


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




మంగళవారం | 10-12-2019 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 235 | శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి ఉ. 10.44 తదుపరి చతుర్దశి; నక్షత్రం: కృత్తిక తె. 5.58 తదుపరి రోహిణి; వర్జ్యం: సా. 5.29-7.09; దుర్ముహూర్తం: ఉ. 8.50-9.34, రా. 9.55-10.45; అమృతఘడియలు: రా. 3.28-5.08; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.38; సూర్యాస్తమయం: 5.38 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

## కమలానికే జై

కర్ణాటక ఉపపోరులో ఘనవిజయం

15 స్థానాల్లో 12 చోట్ల జయకేతనం

కాంగ్రెస్‌కు 2.. జేడీఎస్‌కు సున్నా

యడ్డి సర్కారుకు ఇక తిరుగులేదు

కాంగ్రెస్ నేతలు సిద్దూ, దినేశ్ రాజీనామా

మోదీ-షా లేకుండానే యడ్డి మేజిక్!



పౌరసత్వ బిల్లుపై చర్చలో అమిత్‌షా, బిల్లు ప్రతులను చించుతున్న ఒవైసీ

# పౌరసత్వ బిల్లుకు ఓకే

వివాదాస్పద బిల్లుకు 311-80తో ఆమోదం

రోజంతా చర్చ.. అర్ధరాత్రి సమయంలో లోక్‌సభ ఆమోదముద్ర

ఇది ముస్లిం వ్యతిరేకం కాదు.. రాజ్యాంగ సూత్రాలకూ భంగం కాదు

130 కోట్ల మంది భారతీయుల మద్దతు.. హోంమంత్రి షా ప్రకటన

తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, బిల్లు ప్రతిని చించేసిన ఒవైసీ

వైసీపీ మద్దతు, టీడీపీలో 'విభజన'.. ఇద్దరు ఓకే, కేశినేని వ్యతిరేకం

న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద 'పౌరసత్వ సవరణ బిల్లు'(క్యాబ్)ను లోక్‌సభ ఆమోదించింది. పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్‌లలోని ముస్లిమేతరులు... అక్కడ వేధింపులు తట్టుకోలేక భారత్‌కు వస్తే మన దేశ పౌరసత్వం ఇచ్చే ప్రక్రియలో తొలి అడుగు పడింది. విపక్షాల తీవ్ర విమర్శలు... ఆరేడు గంటల చర్చ అనంతరం... సోమవారం అర్ధరాత్రి సమయంలో 311-80 ఓట్లతో ఈ బిల్లుపై లోక్‌సభ ఆమోద ముద్ర వేసింది. ఈ బిల్లు బుధవారం రాజ్యసభకు చేరనుంది. ఏది ఏమైనా, ఎట్టి

మిగతా 11వ పేజీలో...

# ఢిల్లీని గిల్లి!

## కమలంతో ఢీ అంటే ఢీ





కేంద్రం కాదన్న మనీశ్‌కు కావాలనే కీలక పోస్టు!?

నిఘా బాస్‌గా నియామకం

కస్సుమన్న అమిత్ షా

జగన్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం

సమాచారం తెలిసి ఢిల్లీకి సీఎం

కలవడానికి ఇష్టపడని షా

రఘును దువ్వుతున్నారంటూ గోకరాజు కుటుంబంపై 'ఆకర్ష్'

నేను కోరుకున్న అధికారిని మీరు ఇవ్వనంటారా? అయితే, మీకు గిట్టని అధికారిని అందలం ఎక్కిస్తా! మా పార్టీని, మమ్మల్ని పట్టించుకోకుండా ఒక్క ఎంపీకి మాత్రం ప్రాధాన్యం ఇస్తారా? మీ పార్టీ నేతలను మా పార్టీలోకి లాగేస్తా!

- ఇది వైసీపీ పెద్దల వైఖరి

'మాతో పెట్టుకున్న అధికారికి కీలక పోస్టింగ్ ఇచ్చి... మమ్మల్ని గిచ్చుతావా! అయితే, ఒకే... చూద్దాం!'

- ఇది కమలం పెద్దల వైఖరి



మనీశ్

ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆకస్మికంగా ఢిల్లీకి ఎందుకు వెళ్లారు?

'పది తర్వాత ఇంటికి రావొచ్చు' అని చెప్పిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జగన్‌కు ఎందుకు ముఖం చాటేశారు?

మరుసటి రోజు ఉదయం కూడా అపాయింట్‌మెంట్ ఎందుకు ఇవ్వలేదు? ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి విషయంలో ఎందుకు ఇలా వ్యవహరించారు?

ఢిల్లీ పరిణామాలకూ, రాష్ట్రంలో కీలకమైన నిఘా విభాగం (ఐబీ) చీఫ్ నియామకానికీ ఏదైనా సంబంధం ఉందా?

వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణంరాజు (రఘు)కు ఢిల్లీ పెద్దలు ప్రాధాన్యం ఇవ్వడానికీ, తాజాగా... బీజేపీ నేత గోకరాజు గంగరాజు కుటుంబ సభ్యులు వైసీపీలో చేరడానికీ లింకు ఉందా?

అక్రమాస్తుల కేసులు, సీబీఐ విచారణ కత్తి వేలాడుతున్నా సరే... 'ఢిల్లీతో ఢీ' అనేందుకే జగన్ నిర్ణయించుకున్నారా?

రాజకీయ వర్గాల్లోనేకాదు... అధికారుల్లోనూ తీవ్రస్థాయిలో చర్చకు దారి తీసిన పరిణామాలివి!

రాష్ట్ర భవిష్యత్ రాజకీయ చిత్రంపై ప్రభావం చూపనున్న అంశాలివి!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రానికీ కేంద్రానికీ మధ్య... ఇంకా చెప్పాలంటే బీజేపీ, వైసీపీ మధ్య అనూహ్యమైన లడాయి మొదలైంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... ఈ ఘర్షణకు తెలంగాణ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి స్టీఫెన్ రవీంద్రను ఏపీకి డిప్యుటేషన్‌పై పంపేందుకు కేంద్రం అనుమతించకపోవడంతోనే బీజం పడింది! ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్ర నిఘా విభాగం అధిపతిగా మనీశ్ కుమార్ సిన్హాను నియమించడంతో అది మరింత ముదిరింది. డీజీపీ తర్వాత అత్యంత శక్తివంతమైన పదవి... ఇంటెలిజెన్స్ చీఫ్. రాష్ట్ర సర్కారుకు కళ్లు, చెవులూ నిఘా విభాగమే. రాజకీయ ప్రత్యర్థుల నుంచి

మిగతా 10వ పేజీలో...

# తక్షణ శిక్ష

ప్రత్యేక కోర్టులతో 2 వారాల్లో ట్రయల్ పూర్తి

21 పనిదినాల్లో దోషులకు ఉరిశిక్ష పడాలి

మహిళల రక్షణకు విప్లవాత్మక బిల్లు

రేపే అసెంబ్లీలో ప్రవేశపెడతాం: జగన్

దారుణ స్థితిలో ప్రస్తుత చట్టాలు

సోషల్ మీడియా దిగజారిపోయింది

తప్పుడు పోస్టింగ్ పెడితే కఠిన చర్యలు

అసెంబ్లీలో ముఖ్యమంత్రి స్పష్టీకరణ



అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, దాడులను నిరోధించేందుకు, తప్పులు జరిగితే దోషులకు సత్వరమే కఠిన శిక్షలు విధించేలా విప్లవాత్మక బిల్లు రూపొందించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సోమవారం అసెంబ్లీలో ప్రకటించారు. ఈ బిల్లును బుధవారం సభలో ప్రవేశపెడతామని వెల్లడించారు. మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలు, అరాచకాలు

మిగతా 10వ పేజీలో...

## 'మహిళా బిల్లుకు' మా మద్దతు

ఆడపిల్లపై చెయ్యి వేస్తే అదే చివరి రోజు అనేలా ఉండాలి 2

కోర్టుల ద్వారా సత్వర న్యాయం జరగాలి.. అసెంబ్లీలో చంద్రబాబు

## బాలికపై ఆటోడ్రైవర్ అత్యాచారం 10

## నాకు ఒక్కతే భార్య!

మేం వచ్చి ఆరు నెలలే

చంద్రబాబు హయాంలో మహిళలపై దౌర్జన్యాలు

దిశ కేసులో కేసీఆర్‌కు హ్యాట్సాఫ్

టోల్ కట్టడం కోసమని బైకు దిగితే..

దిశ హత్యాచారంపై జగన్ వెరైటీ విశ్లేషణ



విశ్వసుందరి ఈమే..

ఈ ఏడాది మిస్ యూనివర్స్‌గా దక్షిణాఫ్రికా అందగత్తె జోజిబిని టుంజీ ఎంపికయ్యారు. భారత్‌కు చెందిన వర్తికా సింగ్‌కు టాప్ 10లో కూడా చోటు దక్కలేదు.







# ఉల్లిపై లొల్లి

అసెంబ్లీలో రగడ.. భారీ లైన్లలో ప్రజల అగచాట్లు



## క్యూలోనే ఆగిన గుండె

కిలో రూ.25కి ఇస్తోంది మనమే

హెరిటేజ్‌లో 200కి అమ్మకం: సీఎం

ఉల్లి కొరతపై తక్షణ చర్చ జరపాలి

సభలో టీడీపీ సభ్యుల పట్టు

గంటన్నరపాటు ప్లకార్డులతో నిరసన

పోడియంలోకి వైసీపీ సభ్యురాళ్లు

ఏమీ చేతగాని ప్రభుత్వమిది

ధరను నియంత్రించలేకపోయింది

టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజం

ఉల్లి దండలతో అసెంబ్లీ వద్ద నిరసన



విజయవాడ భవానీపురం రైతు బజారులో ఉల్లి కోసం బారులు (ఇన్‌సెట్) అసెంబ్లీ వద్ద చంద్రబాబు తదితరుల నిరసన

కోస్తే కన్నీరు... కొనాలంటే ఏకంగా రక్త కన్నీరు! కిలో రాయితీ ఉల్లి కోసం కిలోమీటర్ల కొద్దీ బారులు... గంటలకొద్దీ నిరీక్షణ! ఈ ఎదురుచూపుల్లోనే ఒకరి ప్రాణం పోయింది. సోమవారం శాసనసభ శీతాకాల సమావేశాల తొలి రోజే ఉల్లి ధర వేడి పుట్టించింది. ఉల్లి ధరపై చర్చించాలంటూ విపక్ష టీడీపీ సభ్యులు సభ లోపలాబయటా ఆందోళన చేశారు. 10

## చేతగాకే విమర్శలు!

ఎమ్మెల్యేల ఆర్థిక మూలాలపై దాడులు

ఎన్‌కౌంటర్ చేస్తామంటూ బెదిరింపులు

'ఓటుకు నోటు' అవినీతి కేసు కాదు

సీఎం స్థాయి వ్యక్తి పెళ్లిళ్లపై మాట్లాడటమా

సర్కారుపై చంద్రబాబు ధ్వజం 2

# మా ఫండ్.. మా ఇష్టం!

ఆస్పత్రులకు 'సీఎంఆర్ఎఫ్' ఆపివేత

ఆరు నెలల్లో 150 కోట్ల బిల్లు బకాయి

'గత సర్కారు'వి సమీక్షకు అంటూనే అయినవారికి మాత్రం భారీ చెల్లింపు

జగన్ కత్తి గాయానికి చికిత్స చేసిన సిటీ న్యూరో సెంటర్‌కు బిల్లు క్లియర్

హైదరాబాద్‌లోని ఆ ఆస్పత్రికి రూ. 28 లక్షలు గతనెలలో విడుదల

సీఎం జిల్లాలోని ఆస్పత్రికీ బిల్లు ఓకే

సర్కార్ వైఖరితో పేదలకు వైద్యంపై పలు ప్రైవేటు ఆస్పత్రులు వెనుకంజ




అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రాష్ట్రంలోని ఏ ఆస్పత్రికీ సీఎం రిలీఫ్ ఫండ్ బిల్లు ఒక్క పైసా చెల్లించలేదు. 'గత ప్రభుత్వం'లో మంజూరయిన సహాయ నిధిని పేదలు, ప్రభుత్వ ఉద్యోగులకు దాదాపుగా నిలిపివేసిన కొత్త ప్రభుత్వం, ఆస్పత్రులనూ అదే వైఖరితో చూస్తున్నట్టు సమాచారం. అర్ధ సంవత్సరంలో సుమారు రూ.150 కోట్ల వరకూ బిల్లులు ఆస్పత్రులకు బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా గత ప్రభుత్వంలో మంజూరయితే.. ఇక అంతే అన్న వాతావరణం పైకి కన్పిస్తున్నా, అయినవారికి మాత్రం భారీగానే

మిగతా 2వ పేజీలో...

## కనీస చార్జీ పెంచొద్దు 2

రూ.5 టికెట్ పెంచితే ఆటోల దెబ్బ.. చిల్లర సమస్య లేకుండా చూద్దాం

ఆర్టీసీ అధికారుల కసరత్తు.. పెంపు ధరలతో నేడో, రేపో ప్రకటన

## జనవరిలో డీఎస్సీ

ఉద్యోగాల కేలండర్‌లో భాగంగా నోటిఫికేషన్

ఈ భర్తీ లోగా విద్యావలంటీర్ల నియామకం

అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రి సురేశ్ ప్రకటన 9

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రేషన్ కట్! 2

జనవరి నుంచి అమల్లోకి వచ్చే అవకాశం



పరంజ్యోతి

## అనన్య భక్తితో.. కర్మలే- కర్మయోగం



*కాయవాఙ్మనః కార్యముత్తమం*
*పూజనం జపశ్చింతనం క్రమాత్*

శరీరంతో చేయబడే పూజ కన్నా.. వాక్కుతో చేసే మంత్ర జపం, దానికన్నా మనస్సుతో చేసే పరమాత్మ చింతనం లేదా ధ్యానం క్రమంగా ఒకదానికన్నా మరొకటి శ్రేష్ఠమైనవని దీని అర్థం. భగవాన్ రమణ మహర్షి బోధించిన 30 శ్లోకాల 'ఉపదేశ సారం'లో నాలుగో శ్లోకమిది. కర్మలు మనను కర్మసముద్రంలో పడవేస్తాయని.. అవే కర్మలను ఈశ్వరార్పణ బుద్ధితో ఫలాసక్తి లేకుండా చేసి, ఫలితాలను భగవంతుడి ప్రసాదంగా స్వీకరిస్తే అవి మనను బంధించవని, చిత్తశుద్ధిని కలిగించి మోక్షసాధకాలు అవుతాయని తొలి మూడు శ్లోకాల్లో రమణులు తెలియజేశారు. ఈశ్వరార్పణ బుద్ధితో చేయడమంటే ఎల్లప్పుడూ భగవంతుని స్మరణ వదలకుండా కర్మలు చేయడం. ఇలా నిరంతరం భగవంతుడితోనే సంబంధం కలిగి ఉండడమే భక్తి. మనలో భక్తి ఉన్నప్పుడు.. కర్మ- కర్మయోగమై, చిత్తశుద్ధి కలిగించి ముక్తి సాధకమవుతుంది. ఇప్పుడూ మనం భక్తులమేగానీ.. రోజులో ఏదో కొద్దిసేపు మాత్రమే అలా ఉంటున్నాం. ఏ పని చేస్తున్నా అది ఈశ్వరుడే చేయిస్తున్నాడని అనుకోవాలి. భగవంతునితో విడదీయరాని బంధమే భక్తి. అనన్యభక్తి. అలాంటి భక్తిని ఎలా అభ్యసించాలో, కర్మలను ఎలా భక్తితో కర్మయోగంగా మార్చుకోవాలో రమణులు ఈ నాలుగో శ్లోకం నుంచి చెప్పారు. సహజభక్తులుగా మనం ఉండాలన్నా, ఆ భక్తిభావన మనలో స్థిరంగా నిలవాలన్నా మనం చేయాల్సిన సాధనలను ఈ శ్లోకంలో తెలిపారు. అవే.. కాయ, వాక్, మనః కార్యాలైన.. పూజ, జపం, ధ్యానం. వీటిలో పూజ అంటే.. ఒక విగ్రహాన్ని/పటాన్ని ముందుంచుకొని భగవంతునికి ప్రతీకగా భావించి పూజించడం. మంత్ర జపానికి వాక్కు ప్రధానం. ధ్యానం లేదా చింతన అంటే.. పరమాత్మ గుణగణాలను ప్రశాంతమైన మనస్సుతో ధ్యానించాలి. ఒకే వృత్తియందు మనస్సు పూర్తిగా నిలిచిపోవడం వల్ల ఇది అన్నిటికన్నా శ్రేష్ఠమైనది. జపం కూడా శ్రేష్ఠమైనదే కానీ.. ఆ సమయంలో మనస్సు ఇతర విషయాలపైనా మగ్నమై ఉంటుంది. ఉదాహరణకు.. జపమాల తిప్పుతూ చివరి పూస ఎప్పుడొస్తుందా అని ఎదురు చూడటం. ఇక్కడ మనస్సు కొంచెం చలిస్తోంది కాబట్టి.. ధ్యానం కన్నా జపం ఒకింత అల్పమైనది. పూజ చేసేటప్పుడు మనసు అన్ని వైపులా చలించి భగవంతుని మీద తక్కువగా నిలుస్తుంది. కనుక పూజ.. జపం కన్నా అల్పమైనది. అదే విషయాన్ని రమణులు ఈ శ్లోకం ద్వారా స్పష్టంగా చెప్పారు. అయితే, ఈ మూడింటిలో చింతనం చాలా సూక్ష్మమైనది కనుక.. మనస్సు ఏకాగ్రంగా నిలవాలి కనుక.. ఇది చాలా కష్టమైనది. అన్నింటికన్నా పూజ తేలికైంది. కానీ, ఫలితం తక్కువ. తేలికైంది కదా అని ఎప్పుడూ అందులోనే కూర్చుంటాను అంటే ఆధ్యాత్మికంగా ప్రగతి ఉండదు. అందుకే స్వామి వివేకానంద.. 'దేవాలయాలను ఆశ్రయించు.. కానీ, వాటిలోనే చచ్చిపోకు' అన్నారు. కనుక, మొదట పూజ, తర్వాత జపం, తర్వాత చింతనం.. ఇలా ఉన్నతి సాధించాలి.

- దేవిశెట్టి చలపతిరావు, care@srichalapathirao.com




# చేతగాకే విమర్శలు!



- ఎమ్మెల్యేల ఆర్థిక మూలాలపై దాడులు
- ఎన్‌కౌంటర్ చేస్తామంటూ బెదిరింపులు
- నెలల తరబడి జైలులో ఉండి నీతులు
- 'ఓటుకు నోటు' అవినీతి కేసు కాదు
- 11 సీబీఐ కేసులున్నది మీపైనే
- పవన్ మీలా నేరాలు చేయలేదు
- సర్కారుపై చంద్రబాబు ధ్వజం

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి పాలన చేతగాక దానిని కప్పిపుచ్చుకోవడానికి అసెంబ్లీలో తమను తిట్టిపోస్తున్నారని ప్రతిపక్ష నేత చంద్రబాబు విమర్శించారు. అసెంబ్లీ వాయిదా పడిన తర్వాత సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. 'గర్వం, అహంభావం తలకెక్కి నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నారు. మీ వెనుక తప్పులు చాలా ఉన్నాయి. మేమూ చాలా అనగలం. కానీ సంయమనం పాటిస్తున్నాం. జగన్ బాబాయి వివేకాను మేమే హత్య చేయించామని, కోడి కత్తి దాడి చేయించామని నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు. రాజకీయాల్లో నలభై ఏళ్లుగా నా క్యారెక్టర్‌ను కాపాడుకుంటూ వస్తున్నాను. అధికార పక్షం దిగజారి మా వ్యక్తిత్వ హననానికి ప్రయత్నిస్తోంది. ఈ ముఖ్యమంత్రి తండ్రి నాపై 26 విచారణలు వేశారు. ఏం సాధించారు? ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇతరుల భార్యల గురించి... పెళ్లిళ్ల గురించి అసెంబ్లీలో మాట్లాడటం మొదటిసారి చూస్తున్నాను. పవన్‌పై ముఖ్యమంత్రి మాటలు చాలా నీచంగా ఉంటున్నాయి" అని మండిపడ్డారు. ఓటుకు నోటు కేసు గురించి ఏదేదో మాట్లాడుతున్నారని... అది అవినీతి నిరోధక చట్టం కిందకే రాదని తెలిపారు. ఇది రాజకీయ ప్రేరేపిత కేసని కోర్టు వ్యాఖ్యానించిందని గుర్తు చేశారు. "43 వేల కోట్ల రూపాయలు దోచుకొన్నారని సీబీఐ మీపై 11 కేసులు నమోదు చేసింది. 16 నెలలు జైల్లో ఉండివచ్చారు. మీరా ఇతరులకు నీతులు చెప్పేది? పవన్ మీలా నేరాలు చేశారా?" అని ప్రశ్నించారు. పార్టీ మారకపోతే తెలంగాణలో మాదిరిగా ఏదో ఒక రేప్ కేసులో ఇరికించి ఎన్‌కౌంటర్ చేస్తామని తమ ఎమ్మెల్యేలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేల ఆర్థిక మూలాలపై దాడులు చేయడం తొలిసారి చూస్తున్నానన్నారు. పరిస్థితులను గవర్నర్, కేంద్రం దృష్టికి తీసుకువెళ్తామని, వారు పట్టించుకొంటారని ఆశిస్తున్నామని అన్నారు.

ప్రతిపక్షాన్ని తిట్టడానికే అసెంబ్లీ సమావేశాలను నిర్వహిస్తున్నారా అని చంద్రబాబు ప్రశ్నించారు. 'నేను 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశాను. అసెంబ్లీలో మాట్లాడటానికి మైక్ కోసం పదేపదే అడుక్కోవాల్సి వస్తోంది. వెనక కూర్చుని విపరీతంగా రన్నింగ్ కామెంటరీ" అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లిపాయల కోసం ప్రజలు క్యూలో ఎందుకు నిలబడాలి? వలంటీర్లతో ఇంటింటికీ ఎందుకు పంపిణీ చేయరు? అని ప్రశ్నించారు. "మా హయాంలో ఇలాంటి సమస్య వస్తే చౌక దుకాణాల ద్వారా కార్డుకు రెండు కిలోలు చొప్పున విక్రయించాం. ఇప్పుడు ఊరంతటనీ రైతు బజారు వద్దకు రమ్మంటున్నారు. క్యూలో నిలబడలేక గుడివాడలో ఒక వ్యక్తి గుండెపోటుతో మరణించారు. దీనిపై అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. సమాధానం ఇచ్చే ధైర్యం లేక మహిళల అంశం తెచ్చి అడ్డుపెట్టారు" అని విమర్శించారు. నెల్లూరులో సరళ అనే మహిళా ఎంపీడీవో ఇంటిపై అధికార పార్టీ ఎమ్మెల్యే దాడి చేసి నానా రభస చేస్తే పట్టించుకొన్న దిక్కు లేదన్నారు. టీడీపీ వేసిన ప్రశ్నలపై అనుబంధ ప్రశ్నలు అడిగే అవకాశం అధికార పక్షానికి మాత్రమే ఇచ్చి ముగిస్తున్నారని తెలిపారు. మంగళవారం స్పీకర్‌ను కలిసి లేఖ ఇస్తామని చెప్పారు.

### హెరిటేజ్ ఎవరిది?

'హెరిటేజ్' సంస్థపై అసెంబ్లీలో ఆసక్తికర సంవాదం జరిగింది. గుడివాడలో ఉల్లి పంపిణీ క్యూలైన్లో ఒక వ్యక్తి మరణించారని చంద్రబాబు చెప్పినప్పుడు... 'హెరిటేజ్‌లో కిలో ఉల్లి రూ.135కు అమ్ముతున్నారని వైసీపీ సభ్యులు ఎదురుదాడికి దిగారు. దీనికి చంద్రబాబు బదులిస్తూ... "హెరిటేజ్ ఫ్రెష్ మావద్ద లేదు. అది ఫ్యూచర్ గ్రూప్ సంస్థ వద్ద ఉంది. భారతి సిమెంట్, సాక్షి పేపర్, సోలార్ విండ్‌పవర్‌పై మేం కూడా మాట్లాడుతాం. మీ అందరి విషయాలు ప్రజలకు తెలియాలి" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### 'మహిళా బిల్లుకు' మా మద్దతు

- ఆడపిల్లలపై చెయ్యి వేస్తే అదే చివరి రోజు అనేలా ఉండాలి: చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు, అమ్మాయిలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచార ఘటనలు, దౌర్జన్యాలు మనసును కలిచివేస్తున్నాయని ప్రతిపక్షనేత చంద్రబాబు పేర్కొన్నారు. మహిళల రక్షణపై సోమవారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణకు తీసుకొచ్చే బిల్లుకు మద్దతు ఇస్తామని చెప్పారు. ఈ సందర్భంగా గత కొన్ని రోజులుగా ఏపీలో మహిళలు, చిన్నారులపై జరుగుతోన్న అత్యాచారాలు, దౌర్జన్యాల కేసులను చంద్రబాబు సభలో చదివి వినిపించారు. వరుస సంఘటనలు జరుగుతున్నా చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. హిందూపురం ఎంపీపై అత్యాచారయత్నం కేసు నమోదైందని చంద్రబాబు చెప్పారు. ఆడపిల్లలపై చేయివేస్తే దోషులకు అదే చివరి రోజు అనిపించేలా చట్టం ఉండాలన్నారు. బాధితులకు కోర్టుల్లో తక్షణ న్యాయం జరిగేలా కొత్త చట్టం ఉండాలన్నారు.



పట్టాలపై పడుకున్న శ్యామ్‌ను కాపాడుతున్న పోలీసులు

## అన్నయ్యా.. ఇదే నా చివరి కాల్!

- అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నా..
- వెంటనే పోలీసులకు సమాచారమిచ్చిన అన్న
- స్క్రీన్‌షాట్ ఆధారంగా కాపాడిన పోలీసులు

చీరాల టౌన్, డిసెంబరు 9: ఆర్థిక సమస్యల కారణంగా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించిన వ్యక్తిని చీరాల టూటౌన్ పోలీసులు చాకచక్యంగా రక్షించారు. ఈ సంఘటన చీరాలలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ ఎండీ ఫిరోజ్ కథనం ప్రకారం పట్టణ పరిధిలోని విఠల్ నగర్‌కు చెందిన సోదరులు బత్తుల శ్యామ్, ఆదిత్య హైదరాబాద్‌లో కారు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులంతా చీరాలలోనే ఉంటున్నారు. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న శ్యామ్ పదిరోజుల క్రితం చీరాలకు వచ్చాడు. ఈ నేపథ్యంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. సోమవారం సాయంత్రం పేరాల సమీపంలోని రైలుపట్టాలపై పడుకుని అన్న ఆదిత్యకు వీడియో కాల్ చేశాడు. 'అన్నయ్యా.. ఇది నా చివరి ఫోన్‌కాల్. అప్పుల బాధలు తాళలేక నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని విలపిస్తూ చెప్పాడు. ఆదిత్య వెంటనే చీరాల టూటౌన్ పీఎస్ నంబర్ సేకరించి సమాచారం అందించాడు. వీడియో కాల్ స్క్రీన్ షాట్‌ను కూడా వారికి పంపించారు. స్క్రీన్ షాట్‌లో ఉన్న ఆర్వోబీ వంతెన ఆధారంగా అక్కడికి చేరుకున్న పోలీసులు పట్టాలపై పడుకుని ఉన్న శ్యామ్‌ను కాపాడి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సీఐ అతడికి కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

### చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| అనంతపురం | 16.8 | 26.8 |
| కడప | 19.0 | 29.0 |
| గుంటూరు | 19.5 | 30.9 |
| హైదరాబాద్ | 19.7 | 27.5 |
| చిత్తూరు | 20.5 | 27.8 |
| విశాఖపట్నం | 21.4 | 29.4 |
| విజయవాడ | 21.6 | 30.9 |
| ఒంగోలు | 22.3 | 30.3 |
| శ్రీకాకుళం | 23.0 | 33.0 |

### చెదురుమదురుగా వర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక సమీపంలో నైరుతి బంగాళాఖాతం పరిసరాల్లో ఆవరించిన ఉపరితల ద్రోణి ఆంధ్రప్రదేశ్‌లో కోస్తా వరకు విస్తరించింది. దీని ప్రభావంతో తూర్పుగాలులు వీస్తుండడంతో కోస్తా, రాయలసీమల్లో సోమవారం ఉదయం నుంచి పలుచోట్ల మేఘాలు ఆవరించి చల్లనిగాలులు వీచాయి. అక్కడక్కడా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా మేఘాలు ఆవరించడంతో రాత్రి ఉష్ణోగ్రతలు కోస్తా, రాయలసీమల్లో సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యాయి. ఆరోగ్యవరంలో 16.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

## రాజధాని అభివృద్ధిని కొనసాగించండి

- ఆ మేరకు ప్రభుత్వాన్ని ఆదేశించండి: హైకోర్టులో పిటిషన్

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని అభివృద్ధి కోసం రూపొందించిన ప్రణాళికలను యథాతథంగా అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ 'రాజధాని రైతు పరిరక్షణ సమితి' హైకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు రైతు పరిరక్షణ సమితి కార్యదర్శి డి.రామారావు పిటిషన్ దాఖలు చేశారు. ప్రజావసరాలు, భౌగోళికాంశాలను పరిశీలించిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని రాజధానిగా నిర్ణయించిందని తెలిపారు. రాజధాని కోసం రైతులు సుమారు 34 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ఇచ్చారని, వారికి వివిధ రకాల ప్రయోజనాలు కల్పిస్తామని, ఈ ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక రాజధాని పనులన్నింటినీ నిలిపేశారన్నారు. రాజధాని ఏర్పాటులో ప్రభుత్వం ఒకసారి చట్టం చేశాక అందుకు విరుద్ధంగా వ్యవహరించడానికి వీల్లేదని గుర్తు చేశారు. కాబట్టి రాజధాని అభివృద్ధి పనుల్ని కొనసాగించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. అంతేగాక రాజధాని ప్రణాళికల్ని పునస్సమీక్షించేందుకు అనువుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీఎన్ రావు నేతృత్వంలోని నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీచేసిన జీవో 585ను రద్దుచేయాలని కూడా కోరారు.

### ఎస్ఐపీబీ పునర్వ్యవస్థీకరణ

- సీఎం చైర్మన్.. సభ్యులుగా మంత్రులు, కార్యదర్శులు

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ)ని పునర్వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఈ బోర్డుకి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చైర్మన్‌గా ఉంటారు. సభ్యులుగా మంత్రులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, గౌతమ్‌రెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి, కురసాల కన్నబాబు, జయరాం ఉంటారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బోర్డు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

### ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రేషన్ కట్

- జనవరి నుంచి అమల్లోకి వచ్చే అవకాశం

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తెల్ల రేషన్‌కార్డులు రద్దు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం నుంచి వేతనం అందుకుంటున్నందున వీరికి తెల్ల రేషన్‌కార్డులు అవసరంలేదని భావిస్తున్నట్లు తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లో నెలవారీ ఆదాయం రూ.10వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12వేల లోపు వస్తున్న వారంతా దారిద్య్రరేఖకు దిగువన ఉన్నట్లుగా పరిగణిస్తామని, వారంతా తెల్ల రేషన్ కార్డులకు అర్హులని పేర్కొంటూ పౌరసరఫరాల శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రూ.10వేల లోపు వేతనం ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను మినహాయించి, అంతకంటే ఎక్కువ వేతనం అందుకుంటున్న వారందరికీ తెల్ల రేషన్‌కార్డులు రద్దు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

### గ్రూప్-1 మెయిన్స్‌కు 7 కేంద్రాలు

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వచ్చేఏడాది ఫిబ్రవరి 4 నుంచి 16 వరకు జరగనున్న గ్రూప్-1 మెయిన్స్‌కు ప్రొవిజినల్‌గా క్వాలిఫై అయిన అభ్యర్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాల సంఖ్యను ఏడుకు పెంచినట్లు ఏపీపీఎస్సీ సెక్రెటరీ పీఎస్ఆర్ ఆంజనేయులు తెలిపారు. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, హైదరాబాద్‌లలో పరీక్షలు జరుగుతాయన్నారు.

### 'డీలర్ కార్డుల దందా'కు చెక్

పెద్దాపురం రూరల్, డిసెంబరు 9: రేషన్ కార్డుల దందాపై ఈనెల 7న 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన 'డీలర్ కార్డుల దందా' కథనంపై పౌరసఫరాలశాఖ అధికారులు స్పందించారు. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం మండల పరిధిలోని వడ్లమూరులోని రేషన్ దుకాణంలో ఏఎస్‌వో ప్రసాద్, ఎంఎస్‌వో లక్ష్మీకుమారి సోమవారం తనిఖీలు నిర్వహించారు. డీలర్ ఎం.మంగాదేవి రేషన్ కార్డుకు అనుబంధంగా దేవుడి చిత్రాలతో ముద్రించిన పేపర్ కార్డులను పరిశీలించారు. తక్షణమే వాటి పంపిణీని నిలిపివేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయద్దని అన్నారు.

## మా ఫండ్.. మా ఇష్టం!

(మొదటి పేజీ తరువాయి)

బిల్లులు క్లియర్ అవుతున్నాయి. దీనికి హైదరాబాద్‌లోని సిటీ న్యూరో సెంటరే మంచి ఉదాహరణ. ఈ ఆస్పత్రికి చివరి రూపాయి దాకా రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) బిల్లు చెల్లించింది. ప్రతిపక్ష నేతగా ఉండగా కోడికత్తి కేసులో గాయపడిన జగన్ అప్పట్లో ఈ ఆస్పత్రిలోనే చికిత్స పొందటం గమనార్హం. అలాగే, సీఎం జగన్ సొంత జిల్లా కడపలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి ఈ నెల మూడో తేదీన సుమారు రూ.18 లక్షల విలువైన బిల్లులను విడుదల చేసింది. 'మా ఫండ్..మా ఇష్టం' అన్నట్టు సాగుతున్న సర్కారు ధోరణిపై పలు ఆస్పత్రుల యాజమాన్యాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులూ రూటు మారుస్తున్నాయి.

### అడిగిందే తడవుగా..

సాధారణంగా రోగికి శస్త్ర చికిత్స చేసేందుకు లక్ష రూపాయిలు ఖర్చు అవుతుందని అంచనా వేస్తే, సీఎంఆర్ఎఫ్ అధికారులు దానిలో 50%లేదా అత్యధికంగా 65% మాత్రమే కేటాయిస్తారు. కొన్ని శస్త్ర చికిత్సలకు ప్యాకేజీలను అనుసరించి ఎల్‌వోసీలు అందిస్తారు. కొత్త ప్రభుత్వం ఈ విధానాలను మూలన పడేసింది. మెచ్చిన ఆస్పత్రులకు, ఎక్కువ మేలు చేసేలా, కాదనుకుంటే గీసిగీసి చెల్లించడం, లేదంటే పూర్తిగా నిలిపివేసే ధోరణి కనిపిస్తోంది. హైదరాబాద్‌లోని సిటి న్యూరో సెంటర్ ఆస్పత్రికి విడుదల చేసిన బిల్లులే దీనికి ఉదాహరణ. ఆ ఆస్పత్రికి దాదాపు రూ.28 లక్షల వరకూ విడుదల చేశారు. ఈ మేరకు విడుదల చేసిన జీవోలో ఆస్పత్రికి నుంచి వచ్చిన రూ.30.45 లక్షల విలువైన అంచనా మొత్తం, రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన మొత్తం ఒకేలా ఉండటం గమనార్హం. అందులో టీడీఎస్(పన్ను మినహాయింపు) కింద దాదాపు రూ.3.04లక్షలు పోగా, మిగిలిన రూ.27.40 లక్షలను గత నెల 29వ తేదీన మంజూరు చేశారు.

### చెప్పిందొకటి.. చెల్లింపు మరొకటి

గత ప్రభుత్వంలో అంటే ఈ ఏడాది జూన్ నెలాఖరు వరకూ ఇచ్చిన ఎల్‌వోసీలకు సంబంధించిన బిల్లులు, సీఎంఆర్ఎఫ్ బిల్లులను పూర్తిగా పరిశీలించి, తాము సంతృప్తి చెందితేనే విడుదల చేస్తామని సీఎంఆర్ఎఫ్ అధికారులు స్పష్టంగా చెబుతున్నారు. ఏ ప్రభుత్వం అయినా సీఎంఆర్ఎఫ్‌ను పేద రోగుల శస్త్ర చికిత్సలకు ఉపయోగిస్తుంది. గత ప్రభుత్వం ఇచ్చిన ఎల్‌వోసీలతో మాకు సంబంధం లేదంటే వాటి ఆధారంగా పేద రోగులకు శస్త్ర చికిత్సలు చేసిన ఆస్పత్రులు ఇబ్బంది పడతాయి. పోనీ ఆ విధానానికైనా పూర్తిగా కట్టుబడ్డారా అంటే, అదీ లేదు. కడప జిల్లాకు చెందిన ఓ ఆస్పత్రికి మాత్రం గత ప్రభుత్వంలో అనుమతిచ్చిన శస్త్రచికిత్సలకు సంబంధించిన బిల్లులను మాత్రం విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. 'మనవాడైతే ఇచ్చేయండి...' అన్నట్టు ఉన్న ఈ ధోరణిపై పలు ఆస్పతుల వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. బిల్లులు చెల్లించండి బాబోయ్ అంటూ సీఎంఆర్ఎఫ్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా, పట్టించుకునే నాథుడు కనిపించడం లేదని వాపోతున్నాయి.

### ప్రమాదం పేదలకే..

ఎల్‌వోసీలకు సంబంధించిన బిల్లులు చెల్లింపులో సీఎంఆర్ఎఫ్ అధికారుల వైఖరి మారడంతో, ప్రైవేటు ఆస్పత్రులూ తమ దారి తాము చూసుకొంటున్నాయి. గతంలో రోగుల అవసరాన్ని బట్టి, వారి ఆర్థిక పరిస్థితి ఆధారంగా ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎల్‌వోసీని తెచ్చుకుంటారా అని రోగులకు ఒక ఆప్షన్ ఇచ్చేవారు. డబ్బులు కట్టి శస్త్ర చికిత్సలు చేయించుకోలేని రోగులకు ఎల్‌వోసీలు తెచ్చుకోండి అంటూ అంచనా లేఖలను వారే రాసి అందించేవారు. రోగులు కూడా సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుని ఎల్‌వోసీల ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించుకునే పరిస్థితి ఉండేది. ఈ ఫ్రెండ్లీ వాతావరణం గత ఆరు నెలల్లో చెదిరిపోయింది. ఎల్‌వోసీ అంటే ప్రైవేటు వైద్యులు భయపడే పరిస్థితి! శస్త్ర చికిత్సలు చేయాలంటే డబ్బులు కట్టడం కట్టాల్సిందేనని మొహమాటం లేకుండా రోగులకు స్పష్టం చేస్తున్నారు. తాము ఎల్‌వోసీలు తెచ్చుకుంటామని రోగులు చెబుతున్నా, వాటితో శస్త్ర చికిత్సలు చేయడం తమ వల్ల కాదని కొన్ని ఆస్పత్రులు చేతులెత్తేస్తున్నారు. దీంతో అత్యవసర కేసుల్లో రక్త సంబంధికులు అప్పులు చేసి తమవారికి శస్త్ర చికిత్సలు చేయించాల్సి వస్తోంది.

## కాయని 'కాపు'!

- కాపు కార్పొరేషన్‌కు 2 వేల కోట్లు కేటాయింపు
- అయినా.. పైసా విదల్చని వైనం
- ప్రభుత్వ వైఖరిపై లబ్ధిదారుల అసహనం

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): "'కాపు' కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్లు కేటాయించాం. దీనిని ఏటా కొనసాగిస్తాం. కాపులకు అన్ని విధాలా మా ప్రభుత్వం అండగా ఉంటుంది"- ఇది గతంలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సీఎం జగన్ చెప్పిన మాట. మళ్లీ ఇప్పుడు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. నిధులైతే కేటాయించారు కానీ, లబ్ధి దారులకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. దీంతో కాపు కార్పొరేషన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు ఎదురుతెన్నులు చూస్తున్నారు. చంద్రబాబు హయాంలో ఏర్పాటైన కాపు కార్పొరేషన్‌కు అప్పట్లో ఏడాదికి రూ.1000 కోట్లు చొప్పున కేటాయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేటాయింపులు రెట్టింపు చేసి, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2 వేల కోట్లు కేటాయించింది. అయితే, ఇంత వరకు ఒక్కరికి కూడా లబ్ధి చేకూరలేదు. కార్పొరేషన్‌లో స్వయం ఉపాధి కీలకమైన పథకం. కాపు సామాజిక వర్గంలోని పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పేందుకు వీలుగా కార్పొరేషన్ రాయితీలు విడుదల చేస్తోంది. దానికి బ్యాంకులు మ్యాచింగ్ గ్రాంట్‌గా రుణాలను మంజూరు చేస్తాయి. ఈ రెండింటినీ కలిపి లబ్ధిదారుడు స్వయం ఉపాధి యూనిట్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో ఏటా సుమారు 60 వేల మందికి ఈ పథకంలో లబ్ధి చేకూరింది. కానీ, వైసీపీ అధికారంలోకి వచ్చి 6 నెలలు గడిచినా ఇంత వరకూ ఒక్కరికి కూడా రాయితీ విడుదల చేయలేదు. పైగా గత ప్రభుత్వంలో ఎంపికైన లబ్ధిదారులను రద్దు చేశారు. దీంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొదటికి వచ్చింది. దీంతో ఈ పథకం మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది.

### రూ.95 నుంచి రూ.150

- ఎన్‌సీసీ మెస్ అలవెన్సుల పెంపు

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ కెడెట్స్, అసోసియేటెడ్ ఎన్‌సీసీ ఆఫీసర్లకు మెస్ అలవెన్సులను పెంచుతూ క్రీడా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎన్‌సీసీ క్యాంప్‌ల సమయంలో కేడెట్స్‌కు మెస్ అలవెన్సుల కింద రోజుకు రూ.95 ఇస్తున్నారు. దీన్ని రూ.150కు పెంచారు. అసోసియేటెడ్ ఎన్‌సీసీ ఆఫీసర్లకు మెస్ అలవెన్సులను రూ.100 నుంచి రూ.150కు పెంచారు. ఈ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 25:75 నిష్పత్తిలో ఇవ్వనున్నాయి.



### ధరలు పెరిగినా.. గాఢ నిద్రలో కేంద్రం

ఉల్లి ధర కొన్ని ప్రాంతాల్లో రూ.200కు చేరుకుంది. పెట్రోల్ ధర రూ.75 దాటింది. ఇలా నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గాఢ నిద్రలో ఉన్నట్లు కనిపిస్తోంది. నోట్ల రద్దు, జీఎస్టీ వల్లే ధరలు పెరుగుతున్నాయి.

- ప్రియాంక గాంధీ వాద్రా, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి



### భారతీయులను చూసి నేర్చుకోండి

ప్రవాస భారతీయులు తాము సంపాదించిన దాంట్లో ఎక్కువగా భారత్‌లోనే పెట్టుబడులుగా పెడుతున్నారు. ప్రవాస చైనీయులు చైనాలోనే పెట్టుబడులు పెడుతున్నారు. తద్వారా ఆయా దేశాల ఆర్థిక వృద్ధి మెరుగవుతోంది. కానీ ప్రవాస పాకిస్థానీలు మాత్రం తమ మాతృదేశంలో పెట్టుబడులు పెట్టడానికి సుముఖంగా లేరు. దీనికి అవినీతే ప్రధాన కారణం.

- ఇమ్రాన్ ఖాన్, పాకిస్థాన్ ప్రధానమంత్రి

## కనీస చార్జీ పెంచొద్దు

- పెంపు ధరలతో నేడో, రేపో అధికారిక ప్రకటన

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులపై భారం మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఆర్టీసీ యాజమాన్యం ఈ దిశగా దృష్టి సారించింది. పల్లె వెలుగు బస్సుల నుంచి అమరావతి సర్వీసుల వరకూ ఎంత దూరానికి ఎంత పెంచాలో అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇన్‌చార్జి ఎండీ కృష్ణబాబు సెలవులో ఉండటంతో అధికారులు సోమవారం సుదీర్ఘ కసరత్తు చేశారు. మంగళవారం ఎండీ ప్రకటన చేయనున్న నేపథ్యంలో ధరల పెంపును ఓ కొలిక్కి తీసుకొచ్చారు. పల్లె వెలుగు, అర్బన్ సర్వీసుల్లో కనీస చార్జీగా ఉన్న రూ.5 టిక్కెట్ ధర పెంచకూడదని నిర్ణయించినట్లు తెలిసింది. పట్టణాలు, పల్లెల్లో ఆర్టీసీని ప్రధానంగా ఆటోలు దెబ్బతీస్తున్నాయి. సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ విషయం తెలిసింది. దీనికితోడు చిల్లర సమస్య కూడా ఇబ్బంది పెడుతుండడంతో రూ.ఆరున్న కనీస టిక్కెట్ ధరను గతంలో రూ.ఐదుకు తగ్గించింది. తాజాగా కిలోమీటరుకు పది పైసలు పెంపునకు చాన్స్ ఉన్నా... కనీస టిక్కెట్ ధర అలాగే ఉంచనున్నారు.

## సీఎం 'ప్రజా దర్బార్' జీవో రద్దు

- మరో రెండు ఉత్తర్వులు కూడా.. ఈ వర్క్స్ విలువ రూ. 7.72కోట్లు

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ నివాసం, క్యాంపు ఆఫీసుల్లో పనులు చేపట్టడానికి ఇచ్చిన ఉత్తర్వుల్లో మరో మూడింటిని రోడ్లు భవనాల శాఖ రద్దు చేసింది. ఈ మూడు జీవోల్లో పేర్కొన్న వర్క్స్ విలువ రూ. 7.72 కోట్లు కాగా, గత ఐదు రోజుల్లో రద్దయిన జీవోల సంఖ్య 11కు చేరింది. ఈ పనులన్నింటి విలువ రూ. 14.58 కోట్లు! రూ. 82.50 లక్షల వ్యయంతో తాడేపల్లి క్యాంపు ఆఫీసులో ప్రజాదర్బార్ నిర్మాణం కోసం ఇచ్చిన జీవో 202ను ఆర్అండ్‌బీ శాఖ ఉపసంహరించుకొంది. ప్రజాదర్బార్ నిర్మాణం చేపట్టాలంటూ ఈ ఏడాది ఆగస్టు 20 ఆర్అండ్‌బీ ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే, క్యాంపు ఆఫీసులో రూ. 1.89 కోట్లతో రక్షణ చర్యలు చేపట్టేందుకు జూన్ 26న జీవో 133 జారీ చేశారు. సీఎం నివాసం సమీపంలో రేవేంద్రపాడు-సీతానగరం రహదారి విస్తరణ, అభివృద్ధి కోసం రూ. ఐదు కోట్లు కేటాయిస్తూ జూన్ 25న జీవో 132 జారీ చేశారు. ఇప్పుడు ఈ రెండు ఉత్తర్వులను కూడా రద్దుచేశారు.

### స్త్రీ, పురుషులపై 'ప్రో బయాటిక్' ప్రభావంలో వ్యత్యాసం!!

లండన్, డిసెంబరు 9 : పెరుగు, జున్ను, నెయ్యి, వెన్న వంటి పాల ఉత్పత్తులు, పులియబెట్టిన పదార్థాలను ప్రోబయాటిక్ ఆహారంగా వ్యవహరిస్తారు. స్త్రీ, పురుషుల వ్యాధి నిరోధక వ్యవస్థలపై ఇవి వేర్వేరు రకాల ప్రభావం చూపుతాయని బ్రిటన్‌లోని బ్రిస్టల్ వర్సిటీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. శరీరంలోని గట్(హానిచేయని) బ్యాక్టీరియా పనితీరు మహిళలు, పురుషుల్లో విభిన్నంగా ఉండటానికి ప్రోబయాటిక్ ఆహార పదార్థాలే కారణమవుతున్నాయని పేర్కొన్నారు. అధ్యయనంలో భాగంగా పంది పిల్లలపై ప్రయోగ పరీక్షలు నిర్వహించారు. ఆడ పందులతో పోల్చితే.. వెల్లుల్లి, ఉల్లిపాయ, అరటిపండ్లు తిన్న మగ పందుల్లో వ్యాధి నిరోధక వ్యవస్థలో అత్యంత కీలకమైన తెల్ల రక్తకణాల సంఖ్య గణనీయంగా పెరగడాన్ని గుర్తించారు. ప్రోబయాటిక్స్ ప్రభావం వ్యాక్సినేషన్‌పైనా పడుతోందని వెల్లడించారు. వ్యాక్సినేషన్‌కు అనుగుణంగా వ్యాధి నిరోధక వ్యవస్థను మెరుగుపరుచుకునే సామర్థ్యం బాలుర కంటే బాలికల్లో అధికంగా ఉందన్నారు.



హస్తినలో మన గళం

## ఐసీఎంఆర్ సభ్యునిగా కేశినేని

న్యూఢిల్లీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ అండ్ రిసెర్చ్(ఐసీఎంఆర్) సభ్యునిగా టీడీపీ ఎంపీ కేశినేని నాని ఎంపికయ్యారు. లోక్‌సభ సచివాలయం సోమవారం ఈ మేరకు బులెటిన్ విడుదల చేసింది. కేంద్ర భవన, ఇతర నిర్మాణ కార్మికుల సలహా కమిటీ సభ్యునిగా వైసీపీ ఎంపీ ఎన్ రెడ్డప్ప, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల జాతీయ బోర్డు సభ్యురాలిగా వైసీపీ ఎంపీ బి.వెంకట సత్యవతి, కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ సభ్యునిగా వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎంపికయ్యారు.

### ‘ఓడల’ నాణ్యత పాటించాలి: కనకమేడల

ఓడల పునర్నిర్మాణ ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ సూచించారు. సోమవారం రాజ్యసభలో రీసైక్లింగ్ ఆఫ్ షిప్స్ బిల్లు-2019పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఓడల పునర్నిర్మాణ ప్రక్రియపై సరైన పర్యవేక్షణ కొరవడుతోందని, దీనిపై జాయింట్ సెక్రటరీ స్థాయిలో ఒక స్వతంత్ర పర్యవేక్షక సంస్థను ఏర్పాటు చేయాలని కోరారు.

### రామాయపట్నం పోర్టు నిర్మించండి: విజయసాయి

ప్రకాశం జిల్లా రామాయపట్నంలో కొత్తగా ప్రతిపాదించిన పోర్టు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని రాజ్యసభ జీరోఅవర్‌లో వైసీపీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ‘ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం దుగ్గరాజపట్నంలో మేజర్ పోర్టు నిర్మించవలసి ఉంది. అయితే అక్కడ ఓడరేవు నిర్మాణానికి లాభసాటి ప్రదేశం కాదని నిపుణులు తేల్చడంతో కేంద్రం దానికి ప్రత్యామ్నాయంగా రామాయపట్నంలో ఓడరేవు నిర్మాణానికి అంగీకరించింది’ అని ఆయన గుర్తు చేశారు.

### శ్రీశైలం డ్యామ్‌ను పరిరక్షించండి: సంజీవ్

శ్రీశైలం డ్యామ్‌ను పరిరక్షించాలని వైసీపీ ఎంపీ సంజీవ్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లోక్‌సభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ ‘ప్రస్తుతం అక్కడ కొత్త డ్యామ్ నిర్మించే పరిస్థితి లేదు. ప్రత్నామ్నాయ ప్రాజెక్టులు చేపట్టాలి. తుంగభద్ర హైలెవల్ కెనాల్‌కు సరిసమానంగా మరో కెనాల్, మల్లిగనూర్ వరద కాలువ, గుండ్రేవుల రిజర్వాయర్, సంగమేశ్వరం-భావనసై వద్ద డ్యామ్, లద్దగిరి రిజర్వాయర్, సిద్దేశ్వరం అలుగు వంటి ప్రాజెక్టులు చేపట్టాలి’ అని ప్రతిపాదించారు.

### ఎన్ఆర్‌సీకి వైసీపీ మద్దతు

పౌరసత్వ చట్ట సవరణ బిల్లుకు తమ పార్టీ మద్దతిస్తుందని వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి ప్రకటించారు. అయితే, తాము లేవనెత్తే అంశాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం లోక్‌సభలో ఆ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు.

### జడ్జిల పోస్టులను భర్తీ చేయండి: సుబ్బరామిరెడ్డి

“న్యాయస్థానాలలో న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో కక్షిదారులకు సత్వర న్యాయం జరగడం లేదు. ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి” అని రాజ్యసభలో ఎంపీ టీ సుబ్బరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.


భారత ప్రభుత్వం
అణుశక్తి శాఖ
న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్
ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్స్
ECIL పోస్ట్, హైదరాబాద్-500 062

భారత రాష్ట్రపతి తరఫున, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ (CED, PD & EP), సారథి బిల్డింగ్, న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, హైదరాబాద్–500062 వారు దిగువ పనుల కొరకు ఇదే తరహా స్వభావం మరియు పరిమాణంగల పనులు నిర్వహించుటలో ఆమోదిత మరియు అర్హతగల కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లు కోరుచున్నారు.

| టెండరు నం. | E/591/2019 |
|---|---|
| పని పేరు | తమిళనాడు, తుటికోరిన్, పఝ్ఞాయాకాయల్, జిర్కోనియం కాంప్లెక్స్ వద్ద అటామిక్ ఎనర్జీ సెంట్రల్ స్కూల్‌కు ఎలక్ట్రికల్ స్థాపనల ఏర్పాటు |
| అంచనా విలువ (రూ.) | రూ. 150.67 లక్షలు |
| బయానా (రూ.) | రూ. 3,01,340/- |
| డౌన్‌లోడింగ్ & వీక్షించుటకు కాలపరిమితి | 04.12.2019 to 14.12.2019 |
| ఆన్‌లైన్ దాఖలుకు గడువు తేది | 24.12.2019 |
| హార్డ్ కాపీల స్వీకరణకు గడువు తేది | 28.12.2019 |
| పార్ట్–I బిడ్ తెరుచుటకు గడువు తేది | 28.12.2019 |

అర్హత ప్రమాణాలు, నియమ & నిబంధనలు మరియు సవివర టెండరు కోరుతూ ప్రకటన కొరకు www.nfc.gov.in (లేదా) www.tenderwizard.com/DAEకి లాగాన్ కాగలరు. డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ (CED, PD & EP)


# ఎస్కేయూ వీసీ హఠాన్మరణం

▸ సీఎంను కలిసేందుకు బెజవాడ వస్తుండగా మార్గమధ్యంలో బస్సులోనే గుండెపోటు

▸ గుర్తించిన ప్రయాణికులు.. ఆసుపత్రికి చేరేసరికే తుదిశ్వాస విడిచిన ప్రొఫెసర్ జయరాజ్



ఎస్కేయూ, డిసెంబరు 9: అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ(ఎస్కేయూ) వీసీ ప్రొఫెసర్ జయరాజ్(59) ఆదివారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. సోమవారం ఉదయం విజయవాడలో సీఎం జగన్‌తో అపాయింట్‌మెంట్ ఉండటంతో ఆదివారం రాత్రి అనంతపురం నుంచి విజయవాడకు ఆయన ఓ ప్రైవేట్ బస్సులో బయలుదేరి వెళ్లారు. కర్నూలు జిల్లా డోన్ సమీపంలోకి రాగానే జయరాజ్ గుండెపోటుకు గురయ్యారు. దీనిని తోటి ప్రయాణికులు గమనించి, హుటాహుటిన ఆయనను డోన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. జయరాజు మృతితో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జయరాజ్ మృతదేహాన్ని బంధువులు, కుటుంబసభ్యులు, ఇతర రంగాల ప్రముఖులు, విద్యార్థుల సందర్శనార్థం వర్సిటీలోని అధికారిక నివాసంలో ఉంచారు. జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడుతో పాటు పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

#### అవిరళ కృషి.. అంకిత భావం

ఎస్కేయూ వీసీగా ప్రొఫెసర్ జయరాజ్ అక్టోబరు 26న పదవీ బాధ్యతలు చేపట్టారు. నిత్య కృషీ వలుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. తనకు అప్పగించిన ఏ బాధ్యతనైనా అంకిత భావంతో నెరవేర్చారు. ఈ నేపథ్యంలోనే 43 రోజుల ఆయన పాలనలో వర్సిటీలో తనదైన ముద్ర వేసుకున్నారు. పరిపాలనను గాడిలో పెట్టారు. బోధన, పరిశోధన రంగంలో 30 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న జయరాజ్ వర్సిటీ పూర్వ విద్యార్థిగా, ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్‌గా, విభాగాధిపతిగా, డీన్, రిజిస్ట్రార్‌గా, ప్రిన్సిపాల్‌గా పలు హోదాలలో పనిచేశారు.

## సీమలో జనసేన సమన్వయ కమిటీ

▸ రానున్న కాలంలో విస్తృత పర్యటనలు: పవన్

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో జనసేన పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేయడానికి ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాలు ఈ కమిటీ పరిధిలో ఉంటాయన్నారు. చిలకం మధుసూదనరెడ్డి (ధర్మవరం), పసుపులేటి హరిప్రసాద్ (తిరుపతి), గంగరపు రాందాస్ చౌదరి(మదనపల్లి) కమిటీ సభ్యులని చెప్పారు. రానున్న కాలంలో సీమలో పార్టీ పరంగా విస్తృత పర్యటనలు ఉంటాయన్నారు. పార్టీ కార్యక్రమాలను పర్యవేక్షించడంతో పాటు పార్టీ బలోపేతానికి, సంస్థాగత నిర్మాణానికి ఈ కమిటీ కృషి చేస్తుందని చెప్పారు. కాగా, రాష్ట్ర రైతాంగం కష్టాలు తెలుసుకుని, వారికి అండగా నిలబడేందుకు పవన్ కల్యాణ్ కాకినాడలో చేపట్టిన ఒక్క రోజు దీక్షను విజయవంతం చేయాలని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు.

## అసెంబ్లీ పాస్‌ల నిరాకరణ అభ్యంతరకరం

▸ ఏపీయూడబ్ల్యూజే

గండేపల్లి, డిసెంబరు 9: అమరావతిలో అసెంబ్లీ కవరేజీ విషయంలో కొన్ని పత్రికలకు, చానళ్లకు పాస్‌లు మంజూరు చేయకపోవడం తీవ్ర అభ్యంతరకరమైన విషయమని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గం తప్పుపట్టింది. ఇలాంటి ఆంక్షలు విధించడం పత్రికా స్వేచ్ఛను భంగపరచడమేనని అభిప్రాయపడింది. దీన్ని సరిదిద్దుకోవాలని, లేనిపక్షంలో ప్రెస్ కౌన్సిల్‌కు ఈ విషయంపై ఫిర్యాదు చేయాలని సమావేశం నిర్ణయించింది. తూర్పుగోదావరి జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలో సోమవారం ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధ్యక్షతన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై విజయవాడలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించి నేరుగా సీఎం దృష్టికి ఆయా విషయాలను నివేదించాలని సమావేశం నిర్ణయించింది.

## 21 నుంచి అంతర్జాతీయ కవి సమ్మేళనం

విజయవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కవి సమ్మేళనాన్ని విజయవాడలో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి (సీసీవీఏ) ఛైర్మన్ వై.హరిశ్చంద్రప్రసాద్ తెలిపారు. 21న ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర గవర్నరు విస్వభూషణ్ హరిచందన్ ప్రారంభిస్తారన్నారు. విజయవాడలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 16 దేశాలు, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 150 మంది ప్రతినిధులు ఈ సమ్మేళనానికి హాజరవుతున్నారన్నారు.

## పొలం కంచెలో కరెంటు

▸ కట్టెల కోసం వెళ్లి షాక్‌తో ముగ్గురి మృతి

శ్రీకాళహస్తి అర్బన్, డిసెంబరు 9: నిర్లక్ష్యం ముగ్గురి నిండు ప్రాణాలను బలి తీసుకుంది. పొట్ట కూటి కోసం కట్టెపుల్లలు ఏరుకునేందుకు వెళ్లిన ముగ్గురు నిరుపేదలు పొలానికున్న కంచెను తాకి కరెంటు షాక్‌తో మరణించారు. ఈ దారుణం చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి మండలం ఎల్లంపల్లె ఎస్టీ కాలనీ వద్ద సోమవారం చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి మండలం వాగివేడు పంచాయతీ ఎల్లంపల్లె ఎస్టీ కాలనీకి చెందిన చిల్లకూరు కృష్ణయ్య(47), చెంబేటి చెంచమ్మ(45), తుపాకుల గౌతమ్(5), రాణెమ్మ(55) వేకువజామున కట్టెపుల్లలు సేకరించేందుకు వెళ్లారు. ఎస్టీ కాలనీ సమీపంలోనే తిరుపతికి చెందిన లక్ష్మీప్రసాద్ అనే మాజీ సైనిక ఉద్యోగికి పొలం ఉంది. ఈయన పొలంలో బోరు కోసం విద్యుత్ కనెక్షన్ తీసుకున్నాడు. మరో కనెక్షన్‌ను కూడా అనధికారికంగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పొలంలోని మోటారు వరకు కరెంటు వైర్లను కంచె ఆధారంగా ఏర్పాటు చేసుకున్నాడు. ఇవి ఇనుప కంచెను తాకి ఉండడంతో కంచె మొత్తానికి కరెంటు ప్రవహించింది. ఇది తెలియని గౌతమ్, అతడి అమ్మమ్మ చెంచమ్మ కంచె దాటుకుని అవతలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. విద్యుత్ షాక్‌కు గురై గట్టిగా కేకలు పెట్టారు. అరుపులు విన్న కృష్ణయ్య వారిని రక్షించేందుకు వచ్చి ఇనుప తీగలు పట్టుకుని తానూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. ముగ్గురు క్షణాల్లోనే విలవిల్లాడుతూ ప్రాణాలు కోల్పోయారు. వీరికి కొంతదూరంలోనే ఉన్న రాణెమ్మ పరిస్థితి గమనించి దగ్గరకు వెళ్లకుండా తనను తాను రక్షించుకుంది.

### అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఎర్రగొండపాలెం, డిసెంబరు 9: రుణ భారం ఓ రైతు ఉసురు తీసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం అమానునిగుడిపాడుకు చెందిన రైతు రేళ్ల శ్రీను(42) తనకున్న నాలుగెకరాల్లో పత్తి, మిర్చి సాగు చేసి నష్టపోయాడు. సాగు కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోవడం, కొత్తగా మరికొంత అప్పు కావడంతో వాటిని తీర్చేమార్గం కనిపించక తీవ్ర మానిసిక క్షోభను అనుభవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న తన పొలం వద్దే పురుగుమందు తాగాడు. చికిత్స నిమిత్తం తొలుత ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఐదు రోజులుగా చికిత్స పొందుతున్న శ్రీను ఆదివారం మృతి చెందాడు.

### ‘స్పందన’కు రాకుంటే అట్రాసిటీ కేసు!

పార్వతీపురం, డిసెంబరు 9: స్పందన కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని విజయనగరం జిల్లా పార్వతీపురం ఐటీడీఏ పీవో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హెచ్చరించారు. సోమవారం ఐటీడీఏలో జరిగిన స్పందన కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆలయాల్లో అన్య మతస్థులను తొలగించాలి

▸ ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి



డాబా గార్డెన్స్ (విశాఖపట్నం), డిసెంబరు 9: రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో పనిచేస్తున్న అన్య మతస్థులను తక్షణమే తొలగించాలని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షుడు, ఆనందాశ్రమ అధిపతి శ్రీనివాసానంద సరస్వతి డిమాండ్ చేశారు. సోమవారం విశాఖలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమలలో ఇటీవల అన్య మతస్థులు ఎక్కువయ్యారని ఆరోపించారు. టీటీడీతో పాటూ అన్ని దేవాలయాల్లో అన్య మతస్థులు పనిచేస్తున్నారని చెప్పారు. గతంలో కూడా ఈ విషయమై తాము రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశామన్నారు. ఇలాంటి అపచారాల వల్లనే లడ్డూ తయారీ కేంద్రంలో మంటలు చెలరేగాయన్నారు. తిరుమలలో జరిగిన ఈ ప్రమాదం ప్రభుత్వంతో పాటు రాష్ట్రానికి అరిష్టమన్నారు. దేవాలయాల్లో అన్య మతస్థులను తొలగించాలంటూ జీవో ఇచ్చిన ప్రభుత్వం ఒక్కరిని కూడా తీయకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. అన్య మతస్థులను తొలగించలేదు కానీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యంను మాత్రం పక్కనపెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.


భారత ప్రభుత్వం
అణుశక్తి శాఖ
న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్
ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్స్
ECIL పోస్ట్, హైదరాబాద్-500 062

భారత రాష్ట్రపతి తరఫున, సీనియర్ సూపరింటెండింగ్ ఇంజినీర్ (PD, EP, AC & Vent.), 2వ అంతస్తు, సారథి బిల్డింగ్, న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, హైదరాబాద్-500062 వారు దిగువ పనులకు ఇదే తరహా స్వభావం మరియు పరిమాణం గల పనులు నిర్వహించుటలో ఆమోదిత మరియు అర్హతగల కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లు కోరుచున్నారు.

| టెండరు నం. | NFC/PD/05/2019 |
|---|---|
| పని పేరు | హైదరాబాద్, NFC వద్ద ఎయిర్ సర్క్యూట్ బ్రేకర్లతో LT పవర్ కంట్రోల్ సెంటర్ మరియు రిలే ఫిట్టింగ్స్‌కు ఫ్యాబ్రికేషన్, సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పనిచేయించుట. |
| అంచనా విలువ (రూ.) | 271.64 లక్షలు |
| కాంట్రాక్టు కాలం | 14 నెలలు |
| బయానా (రూ.) | 5,43,280/- |
| డౌన్‌లోడింగ్ & వీక్షించుటకు కాలపరిమితి | 12.12.19 to 27.12.19 |
| ప్రీ-బిడ్ మీటింగ్ తేది | 03.01.2020 |
| ఆన్‌లైన్ దాఖలుకు గడువు తేది | 10.01.2020 |
| హార్డ్ కాపీల స్వీకరణకు గడువు తేది | 17.01.2020 |
| పార్ట్-I బిడ్ తెరుచుటకు గడువు తేది | 17.01.2020 |

సవివర NIT ని www.nfc.gov.in నుండి చూడవచ్చు. టెండరు డాక్యుమెంట్లు www.tenderwizard.com/DAE నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చు. బిడ్డరు టెండరు డౌన్‌లోడింగ్ మరియు పాల్గొనుటకు చెల్లుబాటులో గల క్లాస్-III డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్ మరియు www.tenderwizard.com/DAE తో నమోదును తప్పనిసరిగా కలిగియుండవలెను.
సీనియర్ సూపరింటెండింగ్ ఇంజినీర్



**IN THE COURT OF THE HON'BLE XI SPECIAL MAGISTRATE AT ERRAMANZIL, HYDERABAD**

**Proclamation requiring the appearance of a Person Accused**
**(See section 82 Cr.P.C)**
**Crl.M.P.No.5240 of 2019**
**in**
**C.C.No.126 OF 2018**

Between:
**M/s Aamoda Publications Pvt Ltd**
Andhra Jyothi Building, Plot No.76, Aswani Enclave,
HUDA Heights, Jubilee Hills, Hyderabad-500 033
**Rep. by Mr. Kavula Ravi Kiran S/o Subba Rao,**
35 years, R/o Hyderabad Assistant Manager,
Advertisement Recoveries, Authorized signatory,
By virtue of Authorization Letter Dt:01.06.2010 **Complainant**

1. **A.P.Media & Broadcasting Company Pvt Ltd,**
   Plot No.48, Road No.70 Journalist Colony,
   Jubilee Hills, HYDERABAD-500 033
   Rep By its C.E.O. P.Ramesh Babu
2. **P.Ramesh Babu** S/o Not Known C.E.O
   A.P.Media & Broadcasting Company Pvt Ltd,
   Plot No.48, Road No.70 Journalist Colony,
   Jubilee Hills HYDERABAD-500 033 **Accused**

WHEREAS complaint has been made by the Complainant before me that Mr.P.Ramesh Babu C.E.O A.P.Media & Broadcasting Company Pvt Ltd, Plot No.48, Road No.70 Journalist Colony, Jubilee Hills HYDERABAD-500 033, **presently residing at H.No,2-195, Mohammaspet, Amadigur Mandal, Ananthapur Dist AP. PIN No.515 556** has committed (or is suspected to have committed) the offence punishable under **section 138 of the Negotiable Instruments Act, and Non Bailable Warrant (NBW) there upon issued were returned as** the said person **Mr P.RAMESH BABU** cannot be found, and whereas it has been shown to my satisfaction that the said **Mr.P.RAMESH BABU** has absconded (or is concealing himself to avoid the service of the said warrant); Proclamation is hereby made that the said of **Mr.P.RAMESH BABU** is required to appear before this Court to answer the said complaint on the **10th day of FEBRAUARY 2020 at 10.30 A.M.**

**//BY ORDER OF THE COURT//**








# యెడ్డీ విజయం

కర్ణాటక ఉప ఎన్నికల ఫలితాల నేపథ్యంలో, ముఖ్యమంత్రి యెడియూరప్పకు ఇక అర్థంతరంగా కుర్చీ దిగాల్సిన అవసరం లేకపోగా, మూడున్నరేళ్ళూ ఆయనే అధికారంలో కొనసాగే అవకాశం ఏర్పడింది. పోలింగ్ జరిగిన 15అసెంబ్లీ స్థానాల్లో పన్నెండింటిని బీజేపీయే గెలుచుకోవడం, కాంగ్రెస్ రెండు స్థానాలైనా గెలుచుకుంటే, కుమారస్వామి పార్టీకి ఒక్కటీ దక్కకపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తమపై రాహుల్‌గాంధీ ఎంతో నమ్మకం పెట్టుకున్నారనీ, తామూ శ్రమించినా ఫలితం దక్కలేదంటూ పీసీసీ అధ్యక్షపదవికి యువ గుండూరావు, విపక్ష నేత స్థానానికి సిద్దరామయ్య రాజీనామాలు చేశారు. ప్రజాతీర్పును దొడ్డిదారిన తస్కరించిన కాంగ్రెస్‌కు ప్రజలు భలే గుణపాఠం చెప్పారంటూ మోదీ సంతోషించారు. కాంగ్రెస్–జెడిఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోసి, బీజేపీని అధికారంలో కూచోబెట్టడానికి ఎంతగానో సహకరించిన ఈ ఎమ్మెల్యేలందరికీ కీలక మంత్రిత్వ శాఖలు కట్టబెట్టబోతున్నట్టు యెడియూరప్ప ప్రకటించారు.

అసెంబ్లీలో బీజేపీకి ఇప్పుడు అవసరానికి మించి మరో ఐదుగురి బలం చేకూరింది. హైకోర్టు కేసు కారణంగా రెండుస్థానాలకు ఎన్నికలు జరగకపోవడంతో సభ మొత్తం బలం, మెజారిటీ హద్దు తక్కువగా ఉన్న విషయం తెలిసిందే. దీనికితోడు ఒక ఇండిపెండెంట్ ఎమ్మెల్యే కూడా బీజేపీ పక్షానే ఉన్నారు. పార్టీ ఫిరాయింపు పుణ్యమాని కాంగ్రెస్–జెడిఎస్‌లనుంచి అధికారాన్ని హస్తగతం చేసుకున్న యెడియూరప్ప ఇప్పటివరకూ అత్తెసరు మెజారిటీతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ముఖ్యమంత్రి అయిన పాతికరోజుల వరకూ అధిష్ఠానం ఆయనను మంత్రివర్గ ఏర్పాటుకు అనుమతించలేదు. ఆ తరువాత జరిగిన విస్తరణలోనూ ఆయనకు పూర్తి స్వేచ్ఛనివ్వకుండా, ఆయన తన మనుషులతో పదవులన్నీ నింపేయకుండా జాగ్రత్తపడింది. గత ప్రభుత్వాన్ని కూల్చి, బీజేపీని గద్దెనెక్కించేందుకు శ్రమించినవారికి పెద్దపీట వేయడంలో భాగంగా ఓడిన ఎమ్మెల్యేలకూ పదవులు ఇచ్చి, వరుసగా ఏడెనిమిదిసార్లు గెలుస్తూ వచ్చినవారిని సైతం పక్కనబెట్టడం అప్పట్లో నిప్పురాజేసింది. గత కూటమి ప్రభుత్వాన్ని కుప్పకూల్చిన రెబెల్ ఎమ్మెల్యేలను ఇప్పుడు ఇంతపెద్ద సంఖ్యలో గెలిపించుకున్నప్పటికీ, కీలకపదవులన్నీ వారికే కట్టబెడితే పార్టీని దీర్ఘకాలంగా నమ్ముకున్నవారిలో ఆగ్రహం రేగక మానదు. గెలిచిన ఇరవైనాలుగు గంటల్లో మంత్రులను చేస్తానంటూ రెబెల్ ఎమ్మెల్యేలకు యెడ్డీ వలవిసిరిన విషయం తెలిసిందే.

అసెంబ్లీ ఎన్నికల్లో 104స్థానాలు సంపాదించిన యెడియూరప్ప సంఖ్యాబలం లేకున్నా, ఎదుటివారికి వల విసరగలనన్న నమ్మకంతో ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధపడి, చివరకు సాధ్యం కాక బలపరీక్షకు ముందు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్–జెడీఎస్ కూటమి తన 13నెలల పాలననూ కయ్యాలూ, కన్నీళ్ళ మధ్య కొనసాగిస్తుంటే, దానిని కూల్చేందుకు యెడ్డీ నిరంతరం ప్రయత్నిస్తూ ఎట్టకేలకు ఆ రెండు పార్టీలనుంచి 17మంది ఎమ్మెల్యేలను తనవైపు తిప్పుకోగలిగారు. వీరంతా రాజీనామాల ద్వారా ప్రభుత్వాన్ని కూల్చి, బీజేపీకి సహకరించినప్పటికీ, స్పీకర్ అనర్హత వేటుతో పరిణామాలు మారిపోయాయి. సుప్రీంకోర్టు విచిత్రంగా ఒకచేత్తో ఈ ఎమ్మెల్యేల అనర్హతను ఎత్తిపడుతూనే మరోచేత్తో ఎన్నికల్లో పోటీకి వీలుకల్పించింది. మొన్న పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రం నుంచి బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకున్నప్పటికీ ఆ ఖ్యాతి పూర్తిగా మోదీ–అమిత్ ఖాతాలోకి పోయిందే కానీ, యెడ్డీకి దక్కలేదు. ఈ ఉపఎన్నికల ప్రచారంలో కేంద్రపెద్దలెవ్వరూ పాల్గొనకపోవడం, యెడియూరప్పే సమస్తమూ చక్కబెట్టడం గమనించాలి. ఈ ఎన్నికల్లో బీజేపీ కులసమీకరణాలను సైతం అధిగమించి రాష్ట్రంలోని కొత్త ప్రాంతాలకు విస్తరించింది. ప్రాంతీయాధినేతలను చక్రం తిప్పనివ్వని బీజేపీ అధిష్ఠానం ఇకపై యెడ్డీ విషయంలో కాస్తంత భిన్నంగా వ్యవహరించక తప్పదు. పార్టీ ఫిరాయింపులు, కుట్రలు ప్రజలకు పట్టకపోవడమేమిటని ఈ ఫలితాలు చూసి అనేకులు ఆశ్చర్యపోతున్నారు. కాంగ్రెస్–జెడిఎస్ కూటమితో ప్రజలు విసుగెత్తిపోయినందునో, లేక సుస్థిర ప్రభుత్వం కోసమో ప్రజలు ఈ ఘన విజయాన్ని అందించివుండవచ్చుగానీ, దీర్ఘకాలంగా యెడ్డీ కంటున్న కల మాత్రం ఎట్టకేలకు నెరవేరింది.

## మూడో కన్ను



పార్లమెంటులో 'సిటిజెన్‌షిప్ అమెండ్‌మెంట్ బిల్' (సిఎబి)

© మంజుల్

పౌరసత్వ బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా హిందువులపట్ల మన దేశంలోనే కొన్ని దశాబ్దాలుగా అమలు చేస్తున్న వివక్షకు అంతం పలికినట్లయింది. దీనికి కొనసాగింపుగా దేశంలో అక్రమంగా వలస వచ్చినవారిని ఏరివేసి మన పౌరులందరికీ ఒక జాతీయ రిజిస్టర్ ఏర్పాటు చేస్తారు. భారతీయులందరికీ ఆర్థిక సామాజిక ప్రయోజనాలుపొందే హక్కు కల్పించడమే కాదు, శాంతిభద్రతలను కట్టుదిట్టంగా అమలు చేయాలన్నదే బిజెపి సంకల్పం.

# జాతి అస్తిత్వానికి 'పౌరసత్వ' కవచం

సత్యకాలమ్


■ వై. సత్యకుమార్

భారతీయ జనతా పార్టీ ఏది చేసినా దానికి మతం రంగు పులిమేందుకు కొన్ని రాజకీయ పార్టీలు సంసిద్ధంగా ఉంటాయి. వాటిలో కాంగ్రెస్, వామపక్షాలు ముఖ్యమైనవి. విషయం ఏమిటంటే.. దేశంలో కొన్ని దశాబ్దాల పాటు మత, కుల రాజకీయాల ఆధారంగా ప్రజలను విడదీసి అధికారం చెలాయించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్న విషయం అందరికీ తెలుసు. ఏదో విధంగా అధికారంలోకి రావాలన్న తపనతో దేశాన్ని మతపరంగా విడదీసి, వేలాదిమంది ఊచకోతకు, అత్యాచారాలకు, మరెన్నో చెప్పలేని దారుణాలకూ కారణమైంది కాంగ్రెస్. అందుకే కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం లోక్‌సభలో 'పౌరసత్వ బిల్లు'ను ప్రవేశపెడుతూ కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై నిప్పులు చెరిగారు. ఆనాడు కాంగ్రెస్ దేశాన్ని మత ప్రాతిపదికన రెండుగా చీల్చి ఉండకపోతే ఇవాళ ఈ బిల్లును ప్రవేశపెట్టాల్సిన అగత్యం వచ్చేదే కాదని ఆయన అన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న సమానత్వం, లౌకిక వాద సూత్రాలకు ఈ పౌరసత్వ బిల్లు ఏ మాత్రం వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వాలు అక్రమంగా వలస వచ్చిన ముస్లింలనే పెంచి పోషించడం కొనసాగించాయి. వారికి అక్రమంగా గుర్తింపునిచ్చి, ఓటు బ్యాంకులుగా ఉపయోగించుకుని స్థానికులకు చెందిన వనరులను వారు కబళిస్తుంటే చూస్తూ ఉండిపోయాయి. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల్లో మత విశ్వాసాల ఆధారంగా అణిచివేతకు గురై వలస వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులను మాత్రం అక్రమ వలసదారులుగానే భావించాయి. ఈ దారుణాన్ని సరిచేయాలన్న దృక్పథంతోనే వీరికి పౌరసత్వాన్ని కల్పించేందుకు మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం 1955 నాటి పౌరసత్వ చట్టాన్ని సవరించాలని నిర్ణయించింది. ఆయా దేశాల్లో మన దేశానికి చెందిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులు తీవ్ర హింసాకాండకు, అణిచివేతకు గురయినందువల్లే మన దేశానికి వచ్చారు. మరి వీరికి మన పౌరసత్వం కల్పిస్తే తప్పేమిటి? వీరితో పాటు వలస వచ్చిన ముస్లింలకుకూడా గుర్తింపు ఇస్తేనే సమానత్వం, లౌకికవాదం పాటించినట్లవుతుందని కాంగ్రెస్ నేతల వాదన. ముస్లిం దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లలో ముస్లింలు ఎక్కడైనా అణిచివేతకు గురవుతారా? అందుకే ముస్లింలు తప్ప మిగతా మతాలవారికి పౌరసత్వం కల్పించాలని నిర్ణయించిన బీజేపీ ప్రభుత్వానికి కాంగ్రెస్ నేతలు మతం రంగు పులుముతున్నారు. ముస్లింల గురించి మాత్రమే మాట్లాడే కాంగ్రెస్ తనను తాను లౌకికవాదానికి ప్రతీకగా భావించుకోవడం హాస్యాస్పదం.

చరిత్రలో జరిగిన ఘోర తప్పిదాలను సవరించి అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చేందుకే బీజేపీ ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఇది ఏ ఒక్క మతానికీ వ్యతిరేకంగా ఉద్దేశించినది కాదు. ఏ ఒక్క ముస్లిం ప్రయోజనాలూ దెబ్బతినే అవకాశాలు లేవు. భారత దేశంలో చట్ట ప్రకారం పౌరసత్వం పొందే హక్కు అందరికీ ఉన్నది. అందుకే పౌరసత్వం కల్పించడంలో జరిగిన అన్యాయాన్ని చక్కదిద్ది, అక్రమంగా వలస వచ్చిన వారిని ఏరి వేసేందుకు బీజేపీ కృత నిశ్చయంతో ఉన్నది. దేశ పౌరులందరికీ గుర్తింపునివ్వడం, ఇక్కడి వనరులను, సంపదను పొందే హక్కు కల్పించడం దాని లక్ష్యం.




దాదాపు మూడు దశాబ్దాలుగా దేశంలోకి అక్రమ వలసల వల్ల జరిగే ప్రమాదాల గురించి బీజేపీ హెచ్చరిస్తూనే వస్తోంది. 1990లోనే అసోంలో విదేశీయులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతో బీజేపీ మమేకమైంది. నిజమైన భారతీయ పౌరులను గుర్తించడానికి కూడా సమాన ప్రాధాన్యతనిస్తోంది. బంగ్లాదేశ్ నుంచి సాగుతున్న అక్రమ వలసల వల్ల మన దేశ జనాభా రూపురేఖలు మారిపోతాయని 1996 ఎన్నికల మేనిఫెస్టోలోనే బీజేపీ ఆందోళన వ్యక్తం చేసింది. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో కూడా అక్రమ వలసల వల్ల దేశంలోని కొన్ని ప్రాంతాల్లో సాంస్కృతిక, భాషాపరమైన గుర్తింపును, జీవనోపాధిని ప్రజలు కోల్పోతున్నారన్న విషయాన్ని ప్రస్తావించింది.

ఈ క్రమంలోనే తొలి దశగా భారతీయ జనతా పార్టీ భారీ మెజారిటీతో మొదటి సారి అధికారంలోకి వచ్చినప్పటినుంచీ పౌరసత్వ చట్టాన్ని సవరించేందుకు ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. 2016 జులై 15న పౌరసత్వ సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించిన తర్వాత దాన్ని సంయుక్త పార్లమెంటరీ కమిటీకి నివేదించారు. ఉభయ సభలకు చెందిన 30 మందితో కూడిన జెపిసి జోధ్‌పూర్, అహ్మదాబాద్, రాజ్ కోట్, గౌహతి, సిల్చార్, షిల్లాంగ్‌తో పాటు అనేక ప్రాంతాల్లో పర్యటించి వలస వచ్చిన వారిని, ఎన్జీవోలను, ప్రజా ప్రతినిధులను కలుసుకున్నది.

భారత దేశంలో ఏ వ్యక్తి పట్లా మత ప్రాతిపదికన వివక్ష చూపకూడదని రాజ్యాంగంలోని 14వ అధికరణ పేర్కొన్న రీత్యా, పౌరసత్వ బిల్లును సుప్రీంకోర్టు కొట్టి వేస్తుందని కొందరు ప్రతిపక్షాలకు చెందిన సంశయవాదులు వాదించారు. కానీ, ఇది ఎవరి సమానత్వానికీ భంగకరం కాదని, ఎవరి మతపరమైన హక్కునూ ఇది ఉల్లంఘించడం లేదని న్యాయశాఖ వర్గాలు స్పష్టీకరించిన తర్వాతే జెపిసి ఈ బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ తర్వాత 2019 జనవరి 8న లోక్‌సభ ఈ బిల్లును ఆమోదించినప్పటికీ రాజ్యసభలో ప్రతిపక్షాలు అడ్డంకులు కల్పించడంతో ఆ బిల్లుకు కాలదోషం పట్టింది. దీనితో మళ్లీ ఇప్పుడు రెండో సారి అధికారంలోకి రాగానే బీజేపీ ఈ బిల్లును ప్రవేశపెట్టింది. భారతీయుల ప్రయోజనాలను కాపాడేందుకు బిజెపి తాను అనుకున్న లక్ష్యాలను ఎప్పటికైనా చిత్త శుద్ధితో నెరవేర్చేందుకు ప్రయత్నిస్తుందనడానికి ఇది నిదర్శనం.

2019 ఎన్నికల ప్రచార ఘట్టంలోనే బీజేపీ ఈ పౌరసత్వ బిల్లుకు విస్తృత ప్రచారం కల్పించింది. ఇది సహజంగానే ప్రతిపక్షాలకు, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెత్తించాయి. ఇక్కడ ఈ రెండు పార్టీలు ఇంతకాలంగా అక్రమ వలసదారులను ఓటు బ్యాంకులుగా మేపుతూ వచ్చాయి. అదే సమయంలో పశ్చిమ బెంగాల్‌లో లక్షలాది మంది హిందూ బంగ్లాదేశీ వలసదారులను అవి పట్టించుకోలేదు. ఉదాహరణకు 1970 తర్వాత తూర్పు పాకిస్థాన్ నుంచి వలస వచ్చిన మతువా అనే హిందూ మతశాఖకు చెందిన వారు వేలాది మంది ఉన్నారు. ఇతర మతస్థులూ వచ్చారు. ఇలాంటి వారు ఈశాన్య రాష్ట్రాల్లో, పశ్చిమ బెంగాల్ లోనే కాక ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా ఉన్నారు. ఇవాళ వీరంతా చట్టపరంగా పౌరులుగా గుర్తింపు పొందుతున్నారంటే ప్రతిపక్షాలు ఎందుకు ఆందోళన చెందుతున్నాయో సులభంగానే అర్థం చేసుకోవచ్చు.

అణిచివేతకు గురైన ముస్లిమేతర మైనారిటీలతో అక్రమంగా వలస వచ్చినవారిని పోల్చడం ద్వారా ప్రతిపక్షాలు వితండ వాదాన్ని చేస్తున్నాయి. తద్వారా చారిత్రకంగా వారికి జరిగిన అన్యాయాన్ని సవరించడానికి నిరాకరిస్తున్నాయి. ఈ బిల్లు ఈశాన్య రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమైనదనే దుష్ప్రచారాన్ని ప్రతిపక్షాలు చేస్తున్నాయి. కానీ, నిజానికి ఇది ఈశాన్య రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడడమే కాక, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మిజోరంలోని అంతర్ సరిహద్దు పర్మిట్ విషయంలో మినహాయింపునిస్తోంది.

పౌరసత్వ బిల్లు ప్రవేశపెట్టడంతో గడచిన ఆరునెలల్లో హోంమంత్రి అమిత్ షా మూడు భారీ విజయాలను సాధించినట్లయింది. 370 అధికరణ రద్దుతో జమ్మూకశ్మీర్ ప్రాంతం భారత దేశంలో అంతర్భాగమన్న విషయంపై చర్చకు తావు లేకుండా పోయింది. అయోధ్యలో రామజన్మభూమిపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత ఎలాంటి శాంతిభద్రతలు లేకుండా చూడడమే కాక ప్రజలు కలలు కుంటున్న రామమందిర నిర్మాణానికి మార్గం సుగమం చేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కింది. ఇప్పుడు పౌరసత్వ బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా హిందువుల పట్ల మన దేశంలోనే కొన్ని దశాబ్దాలుగా అమలు చేస్తున్న వివక్షకు అంతం పలికినట్లయింది. దీనికి కొనసాగింపుగా దేశంలో అక్రమంగా వలస వచ్చిన వారిని ఏరివేసి మన పౌరులందరికీ ఒక జాతీయ రిజిస్టర్ ఏర్పాటు చేయడం ద్వారా దేశంలో భారతీయులందరికీ ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు పొందే హక్కు కల్పించడమే కాదు, శాంతి భద్రతలను కట్టుదిట్టంగా అమలు చేయాలన్నదే బిజెపి సంకల్పం. సహజంగానే అరాచక వాదులకు, ప్రజలను కులాలుగా, మతాలుగా విడదీసి పబ్బం గడుపుకునేవారికి ఇది జీర్ణించదు. ప్రజలు వారిని విస్మరిస్తున్నారు కనుకే మోదీ సారథ్యంలో ఒక వినూత్న భారత దేశం ఆవిష్కృతం కాబోతున్నది.

(బిజెపి జాతీయ కార్యదర్శి)

# నేర స్వభావాన్ని శోధించాలి

తెలంగాణలో గత కొద్ది రోజులుగా సంభవిస్తోన్న 'విషాద హాస్యయుత' సంఘటనలకు ఫ్రాంజ్ కాఫ్కా సైతం అక్షరీకరణ చేయలేడేమో?! ఒక అమానుష లైంగిక నేరం పర్యవసానంగా చోటు చేసుకుంటున్న ఆ విపరీత పరిణామాలను బట్టి చూస్తే ఆ సరికొత్త రాష్ట్రంలో ఏ వ్యవహారాలూ సజావుగా లేవని స్పష్టమవుతోంది. ప్రభుత్వ పశు వైద్యురాలు ప్రియాంక రెడ్డిపై నలుగురు యువకులు పాల్పడిన రాక్షస కృత్యం ఎవరినైనా కలచివేసేదే. (బాధితురాలి పేరును అజ్ఞాతంగా ఉంచేందుకు పోలీసులు ఆమెను 'దిశ' అని వ్యవహరిస్తున్నారు).

మరో వారం రోజుల్లో జరుపుకోనున్న 'నిర్భయ చేతన దివస్' (2012 నుంచి డిసెంబర్ 16న ఈ 'దివస్'ను పాటించడం జరుగుతోంది) లైంగిక హింసకు తావులేని వాతావరణాన్ని సృష్టించుకోవడం మన కర్తవ్యమని గుర్తు చేస్తోంది. 2012 డిసెంబర్ 16న న్యూ ఢిల్లీలో జ్యోతి సింగ్ అనే 23 ఏళ్ళ పారామెడిక్ నిపుణురాలు పైశాచిక అత్యాచారానికి గురై, మృత్యువుతో పోరాడుతూ కొద్ది రోజుల అనంతరం మరణించింది (ఆ ఘటన అనంతరం కూడా జ్యోతిని అదే పేరుతో వ్యవహరించడానికి ఆమె తల్లి సిగ్గు పడలేదు. అత్యాచారానికి పాల్పడిన వారే సిగ్గు పడాలిగానీ, బాధితురాలి తల్లిదండ్రులుగా తాము సిగ్గుపడనవసరం లేదని ఆ మాతృమూర్తి పేర్కొన్నారు). జ్యోతిని దేశవ్యాప్తంగా పౌర సమాజమూ, పోలీసులూ నిర్భయగా వ్యవహరించసాగారు.

నిర్భయ ఘటనపై ఆసేతుహిమాచలం వెల్లువెత్తిన నిరసనల ఫలితంగా మహిళలకు భద్రత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రభుత్వం పూనుకుంది. ఈ లక్ష్యంతోనే జస్టిస్ జె.ఎస్. వర్మ కమిటీని నియమించింది. నేర విచారణా చట్టాలను సవరించాలని, రూ.1000కోట్లతో నిర్భయ నిధిని ఏర్పాటు చేయాలని వర్మ కమిటీ సిఫారసు చేసింది. ఇంకా జాతీయ పోలీస్ కమిషన్ సిఫారసులు, ప్రకాశ్ సింగ్ కేసు (2006)లో సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాల ఆధారంగా పోలీసు వ్యవస్థలో సంస్కరణలను తీసుకురావాలని కూడా వర్మ కమిటీ సిఫారసు చేసింది. ఆ కమిటీ తన నివేదికను సమర్పించిన ఏడు సంవత్సరాల అనంతరం కూడా నేర విచారణా చట్టాలలో ఏవో కొన్ని మార్పులు మినహా మౌలిక మార్పులేవీ జరగలేదు. సమాజంలో స్త్రీలకు భద్రత సమకూర్చే విషయంలో పరిస్థితులు సైతం పెద్దగా మెరుగుపడలేదు. ఈ ఏడేళ్ళ కాలంలో అమానుష లైంగిక దాడులు వేల సంఖ్యలోనే చోటు చేసుకున్నాయి. మహిళలకు భద్రతా భావం మరింతగా లోపించిందనడంలో అతిశయోక్తి లేదు. దేశ ప్రజలనందరినీ కలచివేసిన దిశ సంఘటనే ఇందుకొక తార్కాణం.

దిశ అత్యాచారం, హత్య సంఘటన దిగ్భ్రాంతి నుంచి దేశ ప్రజలు తేరుకోకముందే, ఆ రాక్షసనేరంలో నిందితులుగా వున్న నలుగురు యువకులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారన్న వార్త వెలువడింది. దీనికి ప్రజలు పలువిధాలుగా ప్రతిస్పందించారు. నేర దర్యాప్తులో భాగంగా నిందితులను నేర స్థలం వద్దకు తీసుకువెళ్ళినప్పుడు వారు తమపై తిరగబడడంతో ఆత్మరక్షణకు కాల్పులు జరపవలసివచ్చిందని, ఆ కాల్పుల్లో నలుగురూ మరణించారన్న పోలీసుల కథనం తెలుగు క్రైమ్‌థ్రిల్లర్ సినిమా స్క్రిప్ట్‌ను తలపిస్తోంది.

దిశ ఘటన నిందితులను మట్టుబెట్టడంలో పోలీసులు వ్యవహరించిన తీరులో ఒక స్పష్టమైన ధోరణి కన్పిస్తోంది. నిందితులను అలా చంపివేయడం ద్వారా ఆ ఘోర కృత్యానికి పాల్పడిన నేరస్థుల మనస్తత్వాన్ని అధ్యయనం చేసే అవకాశం కోల్పోవడం జరిగింది. ఈ సందర్భంగా 2008లో సంభవించిన ఇదే విధమైన ఒక ఘటనను గుర్తు చేసుకోవల్సిన అవసరమున్నది. 2008లో వరంగల్ నగరంలో ఇద్దరు యువతులపై యాసిడ్ దాడులకు పాల్పడిన ముగ్గురు యువకులను కూడా తెలంగాణ పోలీసులు 'ఆత్మరక్షణ' పేరిట ఎదురు కాల్పులు జరిపి హతమార్చారు.

నిర్భయ కేసులో దోషులుగా నిర్ధారితమయిన వారికి విధించిన ఉరి శిక్షను ఇంకా అమలుపరచవలసివుండగా దిశ ఘటనలో నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడం చాలా విచిత్రంగా వున్నది (నిర్భయ నిందితులు పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్ ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నది). దిశ ఘటన అనంతరం కూడా, నిర్భయ ఘటనలో వలే పార్లమెంటు లోపలా వెలుపలా తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. నేరానికి పాల్పడినవారిని తీవ్ర చిత్రవధతో హతమార్చాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఇప్పటికీ నిర్భయ కేసులో దోషులకు ఉరిశిక్షను అమలు పరచలేదు. అయితే వారు ఆ హేయమైన నేరానికి పాల్పడడానికి కారణాలేమిటో మనకు ఇప్పటికీ సవివరంగా తెలియదు.

నిర్భయ కేసులోనూ, దిశ ఘటనలోనూ ఒక న్యాయవాది వివేచనాయుత మనస్సును కలవరపరుస్తున్నదేమిటంటే నిపుణులను సంప్రదించకపోవడం, నేరస్థుల మనో వైజ్ఞానిక/ మనో చికిత్స/ సామాజిక విశ్లేషణలను పరిగణనలోకి తీసుకోక పోవడమే. జస్టిస్ వర్మ కమిటీ కూడా ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోలేదు. అత్యాచారం, లైంగిక దాడులకు సంబంధించిన




జీవ పరిణామ వాస్తవాలను దృష్టిలో వుంచుకుని మనం లైంగిక నేరాలను సమగ్రంగా అర్థం చేసుకోవల్సిన అవసరమున్నది. ఇందుకు మనం లైంగిక నేరస్థులను తీవ్ర మనో విశ్లేషణకు లోను చేయాలి. వారికి మనోచికిత్స చేయాలి. వారు పుట్టి పెరిగిన సామాజిక పరిసరాలను లోతుగా విశ్లేషించాలి. అప్పుడే లైంగిక నేరాలను అర్థం చేసుకుని నిరోధించగలుగుతాం.

'కేస్ లా' గురించి విపులంగా తర్కించినప్పటికీ, మనో వైజ్ఞానికుల, సామాజిక శాస్త్రవేత్తల నుంచి మేధో సహకారాన్ని తీసుకోలేదు. విద్యావేత్తల అధ్యయనాలు పరిగణనలోకి తీసుకుని వున్నట్టయితే జస్టిస్ వర్మ కమిటీ సిఫారసులు మరింత సమగ్రంగా వుండేవని కచ్చితంగా చెప్పవచ్చు. అటువంటి నేరాల గురించిన మన అవగాహన కూడా మరింతగా మెరుగుపడివుండేది. సమాజంలో విస్తృతంగా వున్న ఈ చెడును శాశ్వతంగా అంతమొందించేందుకు, లైంగిక నేరాలను, వాటి కారణాలను, పర్యవసానాలను సమగ్రంగా అర్థం చేసుకోవల్సిన అవసరమున్నది. దురదృష్టవశాత్తు మానవుని నేర చరిత్రకు సంబంధించిన పుస్తకాలేవీ నేర ఘటనలను ప్రస్తావించడమే గానీ వాటిని అన్ని కోణాల నుంచి నిశితంగా పరిశీలించడం జరగలేదు. ఆ మాటకొస్తే సిగ్మండ్ ఫ్రాయిడ్, కార్ల్ గుస్తావ్ జంగ్, ఆల్ఫ్రెడ్ అడ్లర్ లాంటి మనో వైజ్ఞానికుల అధ్యయనాలు కూడా లైంగిక నేరాలు, అత్యాచారం, లైంగిక దాడుల గురించి విపులంగా ప్రస్తావించలేదు. విప్లవ దార్శనికులు మార్క్స్, ఏంగెల్స్ కూడా ఈ అంశాలపై పెద్దగా శ్రద్ధ పెట్టలేదు. అయితే విలియమ్ రీఖ్ అనే మనో వైజ్ఞానికుడు ఈ అంశాలపై గణనీయమైన పరిశోధనలు నిర్వహించాడు. నాజీ నియంత హిట్లర్ కాలంలో రీఖ్ తన సొంత పద్ధతిలో ఆ అధ్యయనాలు నిర్వహించారు. ఆ మార్గదర్శక కృషికిగాను మనం రీఖ్‌కు ఎంతైనా కృతజ్ఞతా బద్ధులమై వుండాలి.

లైంగిక నేరాలకు కారణాలను గుర్తించి, విశ్లేషించడంలో సామాజిక శాస్త్రవేత్తలు, మనో వైజ్ఞానికులు విఫలమైన నేపథ్యంలో మానవులకు పరిణామ క్రమంలో అత్యంత సన్నిహిత జీవులైన ప్రైమేట్లు, చింపాంజీల గురించి విపులంగా అధ్యయనం చేసిన జంతుశాస్త్రవేత్తల లోచూపులు ఆ నేరాలను అర్థంచేసుకోవడానికి విశేషంగా దోహదం చేస్తున్నాయి. ప్రైమేట్లు, చింపాంజీలు అత్యాచారాలకు, వ్యభిచారానికి పాల్పడవని జంతు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. వాస్తవానికి ప్రైమేట్స్‌లో లైంగిక సంగమం అనేది స్త్రీ జీవి ఆహ్వానం మేరకే జరుగుతుంది. స్త్రీ జీవులు వివిధ భౌతిక విన్యాసాల ద్వారా మగవాటిని ఆకట్టుకుంటాయి.

'ప్రైమేట్స్', 'హోమో సెపియన్స్'ల మధ్య శరీర నిర్మాణంలోని తేడాలు మానవులను, 'ఒక నాగరీక ప్రవర్తనను' పెంపొందించుకునేందుకు పురిగొల్పుతున్నాయి. అయితే నాగరీక ప్రవర్తన అంటే ఏమిటి? సామాజిక, జైవిక పరిస్థితుల పరంగా మానవాళి తన పరిణామంలో ఒక అత్యున్నత దశకు చేరుకున్నది. మనుగడకు అవసరమైన ఆహారం, మైథునం, జనాభాను పెంపొందించుకోవడం మొదలైనవాటిని మానవాళి సంతృప్తికరంగా తీర్చుకోగలుగుతుంది. ఇక ఈ పరిణామంలో తదుపరి దశ మానసిక–సామాజిక పరిణామం. ధరిత్రిపై జీవ పరిణామ పురోగతిలో ఇది నాల్గవ దశ.

ఈ పరిణామ వాస్తవాలను దృష్టిలో వుంచుకుని మనం లైంగికనేరాలను సమగ్రంగా అర్థం చేసుకోవల్సిన అవసరమున్నది. ఇందుకు మనం లైంగిక నేరస్థులను తీవ్ర మనోవిశ్లేషణకు లోనుచేయాలి. వారికి మనోచికిత్స చేయాలి. వారు పుట్టి, పెరిగిన సామాజిక పరిసరాలను లోతుగా విశ్లేషించాలి. ఈ విపుల అధ్యయనాలలో వెల్లడయిన సత్యాలను సమాజానికి బహిర్గత పరచాలి. అప్పుడే లైంగికనేరాలను అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది. తద్వారానే వాటిని నిరోధించగలుగుతాము. ప్రభావశీలంగా వాటిపై పోరాడగలుగుతాము.

అలా కాకుండా రాజ్య యంత్రాంగం ద్వారా న్యాయప్రక్రియలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆ నేరాలను అరికట్టడమనేది ఎప్పటికీ అసాధ్యమవుతుంది. దిశ ఘటనలో నిందితులను అంతమొందించడం ద్వారా పోలీసులు, లైంగికనేరాలకు సంబంధించిన అర్థవంతమైన సమాచారాన్ని సంగ్రహించడానికి వీలులేకుండా చేశారు. అది ఇక ఎప్పటికీ మనకు అందుబాటులోకి రాదు. నేరస్థులను నేరాలకు పురిగొల్పిన కారణాలకు సంబంధించిన భోగట్టా లభించి వుంటే ఆ నేరాలను శాశ్వతంగా రూపుమాపేందుకు ఒక దీర్ఘకాలిక వ్యూహ రూపకల్పనకు దోహదం జరిగేది. లైంగిక నేరాలకు ఆస్కారం లేని, స్త్రీలకు పూర్తి భద్రత వుండే సమాజాన్ని రూపొందించుకునేందుకు అవకాశముండేది. జస్టిస్ వర్మ నివేదిక నొక్కి చెప్పినట్టు పోలీసు సంస్కరణలను తక్షణమే అమలుపరచవలసిన అవసరం ఎంతైనా వున్నది. (సొంత లేదా పోలీసులను నుంచి లాక్కున్న) ఆయుధాలతో వున్న నేరస్థులతో తలపడేందుకు పోలీసులకు ప్రస్తుతం పూర్తి శిక్షణ, అవసరమైన సామర్థ్యాలు వున్నాయి. అయితే స్త్రీలకు వ్యతిరేకంగా తమ పురుషాంగాలనే ఉపయోగించే లైంగిక నేరస్థులతో వ్యవహరించేందుకు అవసరమైన శిక్షణ, శాస్త్రీయ సామర్థ్యాలు పోలీసులకు ఉన్నాయా? స్త్రీలకు సంపూర్ణ భద్రత సమకూరుస్తామనే హామీని నెరవేర్చేందుకు మన సమాజం ఇంకా చాలా దూరం పయనించవలసివున్నది.

■ పి. నిరూప్
సుప్రీం కోర్టు న్యాయవాది

# ప్రపంచ బ్యాంకు ద్వంద్వ నీతి

భరతవాక్యం


■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

మందగమనంలో పడిన భారత ఆర్థిక వ్యవస్థకు జవ సత్వాలు చేకూర్చేందుకై ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) సంస్థ కొన్ని సూచనలు చేశాయి. వాటిని నిశితంగా పరిశీలిస్తే దేశీయ, విదేశీ బహుళజాతి కార్పొరేట్ కంపెనీలకే ఇతోధిక లబ్ధిని సమకూర్చేవని అర్థమవుతుంది. ఆ సూచనలనే గనుక మనం ఆమోదిస్తే మన ఆర్థిక వ్యవస్థ మరింతగా కృశించిపోవడం ఖాయం.

స్వేచ్ఛా వాణిజ్యాన్ని, ద్రవ్య పెట్టుబడులను మరింత ఎక్కువగా అనుమతించాలన్నది ప్రపంచ బ్యాంకు, ఐఎమ్ఎఫ్‌ల ప్రధాన సిఫారసు. మూడు దశాబ్దాల క్రితం కంటే ఇప్పుడు మన ఆర్థిక వ్యవస్థ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో మరింత అధికంగా అనుసంధానమై వున్నదనేది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. మరి అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, బ్రిటన్‌లో ప్రధాని బోరిస్ జాన్సన్ సంరక్షణ విధానాలను అనుసరించడానికే ఎందుకు ప్రాధాన్యమిస్తున్నారు? స్వేచ్ఛా వాణిజ్యం ఆ అభివృద్ధి చెందిన దేశాలకు ఇంకెంత మాత్రం ప్రయోజనకరంగా లేదన్నది ఒక వాస్తవం. వర్ధమాన దేశాలూ దాని నుంచి లబ్ధి పొందడం లేదన్నది మరి చెప్పాలా?

స్వేచ్ఛా వాణిజ్యం ఎంతకూ మైక్రోసాఫ్ట్, అమెజాన్ కంపెనీలకు మాత్రమే భారీ లాభాలు సమకూరుస్తుంది గానీ, ప్రజల ఆదాయాలను సరైన స్థాయిలో పెంచడం లేదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రజల శ్రేయస్సును కాలరాచివేస్తోంది. కారణమేమిటి? చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు కాకుండా బహుళజాతి వ్యాపార సంస్థలకే సానుకూలంగా స్వేచ్ఛా వాణిజ్యం పని చేస్తోంది. ఎలా అన్నది చూడండి. షాంఘై లోని ఒక చైనా కార్పొరేట్ కంపెనీ ఆటోమేటిక్ యంత్రాలతో పెద్ద ఎత్తున ఫుట్ బాల్స్‌ను ఉత్పత్తి చేసి వాటిని చౌకగా ముంబైలో విక్రయిస్తోంది. తద్వారా భారతీయ వినియోగదారులకు ఫుట్ బాల్స్ చౌకగా లభిస్తున్నాయి. అయితే మన దేశంలో ఫుట్ బాల్స్‌ను ఉత్పత్తి చేసే చిన్న కంపెనీల ఊపిరిని తీసేస్తున్నాయి. ఫలితంగా ఫుట్ బాల్స్ తయారీలో ఉపాధి పొందుతున్న భారతీయ కార్మికులు నిరుద్యోగులవుతున్నారు.

ఇటువంటి దుష్ఫలితాలు వాటిల్లుతున్నందునే స్వేచ్ఛా వాణిజ్యం పట్ల అమెరికా, బ్రిటన్ పాలకులలో వ్యతిరేకత బాగా పెరిగిపోతోంది. అయితే ఆ సంపన్న దేశాలలోని వ్యాపార వర్గాలు స్వేచ్ఛా వాణిజ్యాన్నే కోరుకుంటున్నాయి. నేను ఇటీవలే లండన్‌లో పర్యటించాను. యూరోపియన్ యూనియన్ నుంచి నిష్క్రమించిన తరువాత తమ పరిస్థితి ఎలా వుంటుందోనని బ్రిటిష్ వ్యాపార వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. బ్రెగ్జిట్ అనంతరం నిత్య ఆహారమైన రొట్టె ధరలు ప్రస్తుత ధరలకు నాలుగురెట్లు అధికంగా ఉండడం ఖాయమని ఒక దుకాణదారు నిట్టూర్చాడు. సరే, మన పరిస్థితికి వద్దాం. స్వేచ్ఛా వాణిజ్యం వల్ల కార్పొరేట్ కంపెనీలు భారీ లాభాలు ఆర్జిస్తున్నాయి. సెన్సెక్స్ 3000 నుంచి 4000 పాయింట్లకు ఎగబాకింది. ఇదే సమయంలో ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 7 నుంచి 4 శాతానికి తగ్గిపోయింది. బడా వ్యాపార సంస్థల పరిస్థితి జోరుగా వుండగా దేశ ఆర్థిక పరిస్థితి దిగజారిపోతోంది. ఇది స్వేచ్ఛా వాణిజ్యం పుణ్యమే. కార్పొరేట్ కంపెనీలు భారత్ నుంచి ఔషధ ఉత్పత్తులను ఎగుమతి చేసి, చైనానుంచి ఫుట్ బాల్స్‌ను దిగుమతి చేసుకునే స్వేచ్ఛను బడా వ్యాపార సంస్థలకు స్వేచ్ఛా వాణిజ్యం ప్రసాదించింది మరి.

ద్రవ్య పెట్టుబడులు దేశంలోకి రావడానికిగానీ లేదా దేశం నుంచి వెళ్ళిపోవడానికిగానీ మరింత స్వేచ్ఛ నివ్వాలని, అలాగే విదేశీ పెట్టుబడులను మరింతగా ఆకర్షించేందుకు కార్మిక సంస్కరణలను అమలుపరచాలని ప్రపంచ బ్యాంక్, ఐఎమ్ఎఫ్ మనకు ఉపదేశిస్తున్నాయి. భారత్‌లో మరింతగా




ప్రపంచ బ్యాంకు వార్షిక 'గ్లోబల్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్' నివేదిక సంపన్న దేశాల నుంచి వర్ధమాన దేశాలకు, అలాగే వర్ధమాన దేశాల నుంచి సంపన్న దేశాలకు పెట్టుబడులు ఏ స్థాయిలో వెళుతున్నాయన్న వివరాలను గతంలో విపులంగా ఇచ్చేది. ఇప్పుడు ఆ వివరాలను ఇవ్వడం నిలిపివేసింది. తమ ఆర్థిక వ్యవస్థలను ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తెరువడం వల్ల తాము మరింతగా పేదరికంలోకి జారిపోతున్నామనే వాస్తవాన్ని వర్ధమాన దేశాల ప్రజలకు తెలియకూడదనే లక్ష్యంతోనే ప్రపంచ బ్యాంకు అలా వ్యవహరిస్తోందన్నది స్పష్టం.

పెట్టుబడులు పెట్టేందుకు అమెజాన్ కంపెనీకి స్వేచ్ఛ వుండాలని, అమెరికాకు వలసపోయేందుకు భారతీయ వ్యాపారికి స్వేచ్ఛ వుండాలని అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు నిర్దేశిస్తున్నాయి!

అయితే క్షేత్ర స్థాయి వాస్తవాలు భిన్నంగా వున్నాయి. ద్రవ్య పెట్టుబడుల స్వేచ్ఛాయుత చలనమనేది నిజానికి మన దేశంనుంచి పెట్టుబడులు అభివృద్ధి చెందిన దేశాలకు వెళ్ళడానికి ఒక మార్గమవుతోంది. ప్రపంచ బ్యాంకు ఏటా 'గ్లోబల్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్' నివేదికను ప్రచురిస్తుంది. సంపన్న దేశాల నుంచి వర్ధమాన దేశాలకు, అలాగే వర్ధమాన దేశాల నుంచి సంపన్నదేశాలకు పెట్టుబడులు ఏ స్థాయిలో వెళుతున్నాయన్న వివరాలను గతంలో ఆ నివేదికలు విపులంగా ఇచ్చేవి. భారత్, ఇతర వర్ధమానదేశాల నుంచి అభివృద్ధి చెందిన దేశాలకు పెద్ద ఎత్తున నికర పెట్టుబడులు వెళుతున్నాయని ఆ వివరాలు సూచించేవి. అయితే గత కొద్ది సంవత్సరాలుగా ప్రపంచ బ్యాంక్ ఆ వివరాలను ఇవ్వడం నిలిపివేసింది. ఎందుకని? తమ ఆర్థిక వ్యవస్థలను ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తెరువడం వల్ల తాము మరింతగా పేదరికంలోకి జారిపోతున్నామనే వాస్తవాన్ని వర్ధమాన దేశాల ప్రజలకు తెలియకూడదనే లక్ష్యంతోనే ప్రపంచ బ్యాంకు అలా వ్యవహరిస్తోందన్నది స్పష్టం.

మరింత ఘోరమైన విషయమేమిటంటే ప్రపంచ బ్యాంకు పాక్షిక లేదా అసంపూర్ణ సమాచారాన్ని మాత్రమే ఇస్తోంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలోకి ప్రైవేట్ పెట్టుబడులు ప్రవహిస్తున్నాయని ప్రపంచ బ్యాంకు పేర్కొంటుంది. అయితే వర్ధమాన దేశాల నుంచి పెట్టుబడులు వాణిజ్య అక్రమాలు, చట్ట వ్యతిరేక మార్గాల ద్వారా సంపన్నదేశాలకు వెళుతున్నాయనే వాస్తవాన్ని అది కప్పిపుచ్చుతోంది. దీనికి సంబంధించిన వివరాలను ప్రపంచ బ్యాంకు నివేదిక ఏ మాత్రం ఇవ్వడం లేదు. అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి నికర పెట్టుబడులు బయటకు పోతున్నాయనడానికి ఆ దేశాల కరెన్సీల విలువలు పడిపోవడమే ఒక నిదర్శనం. మరింత స్పష్టంగా చెప్పాలంటే రూపాయి నిధులు భారత్ నుంచి మరింత ఎక్కువగా విదేశాలకు వెళుతున్నాయి. అయితే భారత్‌లోకి వస్తున్న డాలర్ నిధులు చాలా తక్కువగా వుంటున్నాయి. రూపాయిల సరఫరా ఎక్కువగా ఉంటుండగా డాలర్ల సరఫరా తక్కువగా వుంటుంది. ప్రపంచ బ్యాంకు, ఐఎమ్ఎఫ్‌లు బడా వ్యాపార సంస్థల ప్రయోజనాలను కాపాడుతున్నాయేగానీ, చిన్న వ్యాపార సంస్థల శ్రేయస్సును పట్టించుకోవడం లేదన్నది దీన్ని బట్టి స్పష్టమవ్వడం లేదా?

(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)





**‘నా రంగు, నాలా జుట్టు ఉన్న అమ్మాయిని అసలు అందగత్తెగానే పరిగణించని ప్రపంచంలో పెరిగాను నేను’...**

**ఆదివారం రాత్రి అమెరికాలో జరిగిన మెగా ఈవెంట్‌లో విశ్వసుందరి కిరీటం శిరస్సున అలంకరించుకున్న సందర్భంలో 26 ఏళ్ల జోజిబినీ టున్జీ భావోద్వేగం ఇది! అందమంటే పైన కనిపించే రంగును బట్టి కొలిచేది కాదంటున్న ఈ దక్షిణాఫ్రికా సుందరి ఇప్పుడు మిస్ యూనివర్స్-2019.**

**ఆమె ప్రయాణంలో వివక్షల సూటిపోటి మాటలు ఎన్నో...**

న్యూస్‌మేకర్





# వివక్షను ప్రశ్నించిన నల్ల కలువ

అందాల కిరీటం అంటే ఆమెకు వ్యక్తిగత ఘనత మాత్రమే కాదు... తన నల్లజాతి మొత్తానికి దక్కిన ఘనత. అవును... దక్షిణాఫ్రికాలోని జోలోలో పుట్టిన జొజిబినీ టున్జీ చిన్నప్పటి నుంచి వివక్షను ఎదుర్కొంటూనే పెరిగారు. అందుకే ఆమె ఈ అందాల పోటీలను తన గళం గట్టిగా వినిపించే వేదికగా కూడా మలుచుకున్నారు. సొంత దేశంలోనే అవమానాలు ఎదురైనా ఎదిరించి నిలిచిన ఆమె మిస్ యూనివర్స్ టైటిల్ సాధించిన మూడో దక్షిణాఫ్రికా మహిళగా ఇప్పుడు రికార్డులకెక్కారు. పుట్టిన ఊరికి సమీపంలోని సిడ్వద్వేనిలో పెరిగిన టున్జీకి ఇద్దరు సోదరీమణులున్నారు. ప్రాథమిక విద్య అయిపోగానే పబ్లిక్ రిలేషన్స్ అండ్ ఇమేజ్ మేనేజ్‌మెంట్(2018)లో ‘కేప్ పెనిన్సులా యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ’ నుంచి డిగ్రీ పట్టా పొందారు.

**ఇంట గెలిచి...**

‘మిస్ యూనివర్స్’ టైటిల్ గెలవడానికి ముందు టున్జీ ఈ ఏడాది ‘మిస్ సౌతాఫ్రికా’గా నిలిచారు. అయితే ఆ టైటిల్ ఆమెకు అంత సులువుగా రాలేదు. దాని వెనుక ఎన్నో మనోవేదనలు, అవమానాలూ ఉన్నాయి. వాస్తవానికి రెండేళ్ల కిందట జరిగిన ‘మిస్ సౌతాఫ్రికా’లో కూడా ఆమె పోటీపడ్డారు. కానీ టాప్ 12లో కూడా ఆమెకు స్థానం దక్కలేదు. అలాగని ఆమె నిరాశ పడలేదు. మళ్లీ ప్రయత్నించి, కిరీటం సాధించారు. అయితే ఆ చరిత్రాత్మక విజయం ఆమెను వివాదాల్లోకి లాగింది. టున్జీ గెలుపు గిట్టని కొందరు ఆమె మేని ఛాయ గురించి ఆన్‌లైన్‌లో చర్చకు తెరలేపారు. ‘నాలాంటి వారు అందాల కిరీటం గెలవడం వారికి నచ్చడం లేదు’ అంటూ ఆ సందర్భంలో టున్జీ బాధపడ్డారు. అయితే ఆ అవహేళనలేవీ తన స్ఫూర్తి ముందు నిలవలేకపోయాయి.

**అందమంటే రంగేనా?**

“అందమంటే పైకి కనిపించేదో, శరీరం రంగో కాదు అని వీళ్లందరికీ అర్థమయ్యేలా ఎలా చెప్పాలో నాకు తెలియడం లేదు. మా దేశంలో ఈ ‘కలరిజమ్’ అతి పెద్ద సమస్యగా మారింది” అంటూ ఓ పత్రిక ఇంటర్వ్యూలో ఆవేదన వ్యక్తం చేశారు టున్జీ. అంతే కాదు... “నల్లగా ఉన్నవారిని అందగత్తెలుగా పరిగణించవద్దు అని వాళ్లందరిలో ప్రోగ్రామింగ్ చేసినట్టున్నారు” అంటూ అసహనంతో వ్యంగాస్త్రం కూడా సంధించారు. అప్పటి నుంచి టున్జీ వివక్షపై తన గళాన్ని వినిపిస్తున్నారు. ఎదుటివాళ్లను విమర్శించే ముందు వాళ్లను వాళ్లు ప్రేమించుకోవడం నేర్పిస్తే, ఇలాంటి జాత్యహంకారాలకు తెరపడుతుందనేది ఆమె అభిప్రాయం.

సొంత దేశంలో ఈ వెక్కిరింపులే టున్జీలో మరింత పట్టుదలను పెంచాయి. ‘విశ్వసుందరి’ కిరీటాన్ని దక్కించుకోవాలన్న కసిని పెంచాయి. ఆ సంకల్పంతోనే లక్ష్యం అందుకోవాలని ఆమె అహర్నిశలూ శ్రమించారు. శరీర ఆకృతే కాదు... తెలివితేటలకూ పదును పెట్టారు. చివరకు అమెరికాలోని అట్లాంటా వేదికగా అత్యంత వైభవంగా జరిగిన మెగా ఈవెంట్‌లో ‘విశ్వసుందరి’గా నిలిచారు. ప్రపంచానికి తన సందేశాన్ని వినిపించారు. ఆనంద భాష్పాలు... ఉద్విగ్న క్షణాలు... కళ్లు చెమర్చిన వేళ జొజిబినీ టున్జీ మనసు లోతుల్లో నుంచి రెండు ముక్కలు...

“నాలాంటి రంగు, జుట్టు ఉన్న మహిళలు అందగత్తెలే కాదన్న సమాజంలో నేను పెరిగాను. అలాంటి వివక్షకు ముగింపు పలికే సమయం ఇదేనని భావిస్తున్నా. చిన్నారులు నాలో వారిని వారు చూసుకోవాలని కోరుకొంటున్నాను” అంటూ ఆమె చెప్పుకొచ్చారు. ఆమె మాటలు అక్కడున్నవారినే కాదు, టీవీలో ప్రత్యక్ష ప్రసారం చూస్తున్న కోట్లమందిని కదిలించాయి.. ‘నీ విజయం ఎట్టకేలకు నా నాలుగేళ్ల కూతురు ఓ సెలబ్రిటీలో తనను తాను చూసుకొనేలా చేసింది’ అంటూ ఓ తల్లి ఇన్‌స్టాగ్రామ్‌లో టున్జీని అభినందిస్తూ పోస్ట్ పెట్టింది. ఈ విషయాన్ని టున్జీ ఎంతో గర్వంగా పంచుకున్నారు. అందుకే టున్జీ గెలుపు నల్లజాతి మొత్తానిది! అంతేకాదు... ఓ నల్లజాతి మహిళ ‘విశ్వసుందరి’గా నిలవడం ఎనిమిదేళ్ల తరువాత ఇదే తొలిసారి. 1977లో ట్రినిడాడ్‌కు చెందిన జానెల్లే కమిషంగ్ మొట్టమొదటిసారి ఈ టైటిల్ దక్కించుకుంది.

మోడలింగ్‌ను కెరీర్‌గా ఎంచుకున్న టున్జీ... మరోవైపు సామాజిక సేవ కూడా చేస్తున్నారు. లింగ వివక్షపై విస్తృతంగా పోరాడుతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తన ఉద్యమాన్ని ఉధృతంగా నడిపిస్తు ఆమె ఒక పుస్తకాల పురుగు. అమ్మమ్మే తనకు స్ఫూర్తి అని చెబుతున్న ఈ విశ్వసుందరి రూపలావణ్యంలోనే కాదు... ఆకట్టుకొనే వాగ్ధాటి, తెలివితేటలు, వినమ్రతలతో న్యాయనిర్ణేతలు, ఆహూతుల మనసు గెలుచుకున్నారు. అందుకే అందాల పోటీకే పనికిరావన్నవారు... నీ ‘రంగు’ రంగే కాదన్నవారు ఇప్పుడు జొజిబినీ టున్జీకి నీరాజనాలు పడుతున్నారు.

---

లీగల్ కౌన్సెలింగ్

## కన్న కొడుకులో ఇంత కసాయితనమా?

నా వయసు 80 సంవత్సరాలు. నేను ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైరయ్యాను. గత 30 ఏళ్లుగా నా కొడుకు దుర్మార్గాలతో పలు బాధలు, హింస అనుభవిస్తున్నాను. ఇటీవల అంటే 6 మాసాల క్రితం నా శరీరమంతా కందిపోయేలా కొట్టాడు. దీనికి సంబంధించిన డాక్టర్ రిపోర్టును స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చాను. అయితే, నా కొడుకు మీద ఏ చర్యలూ తీసుకోకుండా, నేనే నేరస్థుణ్ణి అయినట్లు మాట్లాడి ఏదో వారికి తోచిన రీతిలో విచారణ చేసి, వారికి నచ్చినట్లు కాగితం రాయించుకుని పంపించి వేశారు. అసలు నా ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు ఏమిటంటే, 1. అతడు మేము బతికి ఉన్నంత కాలం మా దరిదాపునకు రాకూడదు. 2. అతడిని పర్మనెంట్ నేరస్థునిగా గుర్తిస్తూ, రోజూ పోలీస్ స్టేషన్‌లో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి. 3. మాకు ప్రాణభయం ఉన్నందున పోలీసులు మాకు రక్షణ కల్పించాలి. 4. మా ఆస్తులనూ, మమ్ములనూ కంటికి రెప్పలా కాపాడే వారి పేరిట వీలునామా రాసే వెసులుబాటు నాకు కల్పించాలి. 5. నా అంతిమ యాత్రలోనూ అతడు పాల్గొనకూడదు. 6. మాకు ఏడుగురు కూతుళ్లు. నా ఆస్తిలో వారికి అన్ని హక్కులూ చెందాలి. నా ఈ కోరికలు వాస్తవరూపం ధరించేందుకు నేను ఏం చేయాలో వివరించండి!

- **ఎన్. ప్రకాశ రావు** చిత్తూరు.



మీరు ఆశించినట్లు, 1. మీరు బతికి ఉన్నంత కాలం మీ కొడుకు మీ దరిదాపుల్లోకి రాకుండా ఉండేలా ఆర్డర్ జారీ చేసే అధికారం సివిల్ కోర్టుకు మాత్రమే ఉంది. అందుకోసం సివిల్ కోర్టులో దావా వేయండి. 2. మీ అబ్బాయి వల్ల వ్యక్తులకు, ఆస్తులకు భంగం కలుగుతున్నట్లు పోలీసులు భావించినప్పుడు మాత్రమే మీ అబ్బాయి మీద రౌడీషీట్ ఓపెన్ చేసి అతడు రోజూ గానీ, వారానికి ఒకసారి గానీ పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యేలా బైండింగ్ ఓవర్ కేసు నమోదు చేస్తారు. 3. మీ అబ్బాయి వల్ల మీకు ప్రాణభయం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినప్పుడు పరిస్థితులను పరిశీలించి మీకు రక్షణ కల్పించవలసిన బాధ్యత పోలీసులదే! పోలీసుల నిర్లక్ష్యాన్ని మీరు మానవ హక్కుల సంఘానికి తెలియపరిస్తే పోలీసులు మీకు రక్షణ కల్పించే విధంగా ఒక ఉత్తర్వును జారీ చేస్తారు. 4. మీ స్వార్జితమైన మీ ఆస్తులను మీ ఇష్టానుసారం అనుభవించే అధికారం ఉంది. మీ తదనంతరం మీ ఆస్తులు ఎవరికి చెందాలనే విషయాన్ని మీ వీలునామాలో పొందుపరిచి, ఆ వీలునామాను మీకు నమ్మకమున్న ఎవరి వద్దనైనా ఉంచండి. మీ తదనంతరం మీ వీలునామాలోని నిర్దేశాలను అనుసరించి వ్యవహరించేలా అతన్ని ఎగ్జిక్యూటర్‌గా అపాయింట్ చెయ్యండి. ఈ స్థితిలో మీ కొడుకు ద్వారా ఎదురవుతున్న ఆ ఇబ్బందుల గురించిన ఫిర్యాదును రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌కు పంపించండి. ఒకవేళ ఎస్‌పి ఏ చర్యా తీసుకోకపోతే, మీ లోకల్ పోలీసులతో పాటు ఎస్‌పిని కూడా పార్టీగా చేసి మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేయండి. మీ కేసులో సివిల్, క్రిమినల్ ఈ రెండు అంశాలూ మిళితమై ఉన్నాయి. అందువల్ల ఏ రకంగా చూసినా మీ సమస్య పరిష్కారానికి మానవ హక్కుల సంఘమే ఉత్తమమైన పరిష్కార వేదిక!



● **ఒడ్నాల శ్రీహరి,**
న్యాయవాది, హైదరాబాద్

---

**వరద వస్తే... ఊళ్లూ, ఇళ్లూ మునుగుతాయి. కానీ వరదలు వచ్చినప్పుడు నీటిపై తేలేలా మోడల్ ఇంటిని రూపొందించారు కేరళకు చెందిన పి గోపాలకృష్ణన్ ఆచారి. ఇంటి నిర్మాణంలో రాళ్లు, ఇసుక, సిమెంట్ వాడలేదు. స్టీల్, మల్టీ ఉడ్‌షీట్స్‌తో వరదలు వచ్చినప్పుడు నీటిపై తేలేలా, వరదలు తగ్గాక సాధారణ ఇళ్లలానే మునుపటి స్థానానికి చేరేలా డిజైన్ చేశారు. అతి తక్కువ ఖర్చులో ఈ ఇంటి నిర్మాణం పూర్తవడంతో చాలామంది ఇలాంటి ఇళ్ళు కట్టుకునేందుకు ముందుకొస్తున్నారు.**

వినూత్నం



# వరద గూడు!

కేరళలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాకాలంలో తుపాన్లు, వరదలు, కొండచరియలు విరిగిపడడం చాలా సాధారణం. ఆ సమయంలో స్థానికుల ఇళ్లను భారీ ఎత్తున వరదలు ముంచెత్తడం వల్ల తీవ్ర నష్టం జరుగుతోంది. దాంతో ప్రజలు నిరాశ్రయులు అవుతున్నారు. ఇలాంటి తీవ్ర వాతావరణ పరిస్థితులను ఊహించి ముందుగానే చాలామంది తమ ఇంటి నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నష్టాన్ని తగ్గించేందుకు వినూత్న డిజైన్లలో నిర్మాణాలు చేస్తున్నారు. అలాంటివారిలో కేరళలోని వాళప్పిల్లికు చెందిన పి. గోపాలకృష్ణన్ ఆచారి ఒకరు. ఇంతకీ ఆ ఇంటిని ఎలా కట్టారంటే...



అవార్డు అందుకుంటూ...

**నీటిపైన నిలిచే ఇల్లు!**

“ఈ మోడల్‌లో ఇల్లు కడితే వరదలను తట్టుకుంటుంది! కూలిపోకుండా నీటిపైన తేలుతుంది. గడచిన కొన్నేళ్లుగా కేరళలో నిర్మాణ రంగం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. బేబీ మెటల్, ఇసుక, రాయిలాంటి వనరుల కొరత తీవ్రమైంది. దాంతో ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చులో, నాణ్యమైన వనరుల కోసం వెతకాల్సివచ్చింది. ఆ ప్రయత్నంలో భాగంగా స్టీల్ పైపులు, మల్టీ ఉడ్ షీట్స్‌తో ఐదేళ్లు శ్రమించి నేను ఒక మోడల్ హౌస్‌ను నిర్మించాను. 2017లో ఇల్లు పూర్తయింది. మరుసటి ఏడాది కేరళలో వరదలు వచ్చాయి. అప్పుడు నేను ఆ ఇంటిని మళ్లీ వరదలు వస్తే తట్టుకొనేలా రీ డిజైన్ చేశాను. ఈసారి ఇంటి పునాదిలో ఎయిర్‌ట్యాంక్‌లు ఏర్పాటు చేశాన్లు. వీటి వల్ల వరదల్లో నీటి మట్టం పెరిగిన కొద్దీ ఇల్లు నీటి పైన తేలుతుంది. ఇలా నీటిపైన తేలాక వరదల్లో పడి కొట్టుకుపోకుండా ఉండడానికి ఇంటి గోడలకు నాలుగు వైపులా నాలుగు స్టీల్ పిస్టన్లు అమర్చాను.

**ఇంటి నిర్మాణంలో మట్టి, రాళ్లు, టైల్స్, సిమెంట్, కలపను ఉపయోగించలేదు. మొత్తం నిర్మాణం అంతా స్టీల్‌తోనే చేశాను. గోడలుగా రెండువైపులా మల్టీఉడ్‌షీట్స్‌తోనే చేశారు. ఈ షీట్ల మధ్యన గాలి కోసం అంగుళంన్నర గ్యాప్ ఉంటుంది. దీనివల్ల గదిలో ఉష్ణోగ్రతలు తగ్గి ఇంటి లోపల చల్లగా ఉంటుంది.**

ఈ స్టీల్ పిస్టన్‌లు ఇంటిలోపల గానీ, బయటగానీ కనిపించవు. భూమిలో పాతిక అడుగుల లోతువరకూ ఉంటాయి. పిస్టన్‌ల లోపల ఉండే స్టీల్ రాడ్లపైనే ఇల్లు నిలబడి ఉంటుంది తప్ప నేలకు తాకదు. వరదలు వచ్చినప్పుడు ఈ పిస్టన్లు, ఎయిర్‌ట్యాంకుల సహాయంతో ఇల్లు పైకి లేస్తుంది. వరదలు తగ్గాక తిరిగి సాధారణ స్థానానికి తిరిగొస్తుంది. వరదలు ఎంత ఉధృతంగా వచ్చినా ఇల్లు అంగుళం కూడా పక్కకు జరగదు.

ఈ విధానంలో ఇల్లు నేల నుంచి 15 అడుగుల దాకా పైకి లేస్తుంది. పిస్టన్ల ఎత్తును కావలసినంత మేర పెంచుకోవచ్చు. కానీ పిస్టన్ల పొడవు, బలం అవసరమైనంత మేరకు ముందుగానే ఏర్పాటు చేసుకోవాలి.

ఈ ఇంటి నిర్మాణంలో మట్టి, రాళ్లు, టైల్స్, సిమెంట్, కలపను ఉపయోగించలేదు. మొత్తం నిర్మాణం అంతా స్టీల్‌తోనే చేశాను. గోడలుగా రెండు వైపులా మల్టీఉడ్‌షీట్స్‌తోనే చేశారు. ఈ షీట్ల మధ్యన గాలి కోసం అంగుళంన్నర గ్యాప్ ఉంటుంది. దీనివల్ల గదిలో ఉష్ణోగ్రతలు తగ్గి ఇంటిలోపల చల్లగా ఉంటుంది.

**చదరపు అడుగుకు రూ. 1600**

ఇంటి నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడలేదు. “ఈ ఇల్లు 1300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. నిర్మాణంలో రాళ్లు, ఇసుక, సిమెంట్ లాంటివేవీ వాడలేదు. నాణ్యమైన జీఐ పైప్ వాడడం వల్ల చదరపు అడుగుకు 1600 రూపాయల ఖర్చు అయింది. ఇంటి నిర్మాణానికి నాలుగు నెలలు పట్టింది. ఈ విధానంలో కూలీల అవసరం బాగా తగ్గింది. వెల్డర్, వడ్రంగి, పైపులు బాగు చేసే వృత్తి పనివాళ్లు మాత్రమే అవసరం అయ్యారు. నలుగురు వెల్డర్లు, నలుగురు వడ్రంగులతో కొన్ని రోజుల్లో నిర్మాణం పూర్తయింది” అని గోపాల కృష్ణన్ వివరించారు.

విశేషం ఏమిటంటే “ఇసుక నేలలు, రాతి నేలలు అనే తేడా లేకుండా ఎలాంటి నేలలో అయినా వరదలను తట్టుకునే ఇలాంటి ఇళ్లను నిర్మించవచ్చు. కుట్టనాడ్ లాంటి లోతట్టు ప్రాంతాల్లో ఎప్పుడూ నీళ్లు నిలిచే ఉంటాయి. తరచూ వరదలు వస్తూనే ఉంటాయి. అక్కడ నివసించే ప్రజల కోసం ఎత్తు ఎక్కువ ఉండే ఒక మోడల్ హౌస్‌ను రూపొందించాను. చాలా ఎక్కువ సంఖ్యలో పిస్టన్లపైన ఇల్లు నిలిచి ఉంటుంది” అని ఆయన చెబుతారు.

ఈ నీటిపై నిలిచే ఇంటి వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. కేరళ, కర్ణాటక, తమిళనాడు ఆర్కిటెక్ట్‌లు, సివిల్ ఇంజినీర్లు, విద్యార్థులు మా ఊరికి వచ్చి ఈ ఇంటిని చూసి వెళుతున్నారు.

ఈ ఇంటి నిర్మాణం గురించిన పూర్తి వివరాలను నేను వారికి అందజేశాను. దాంతో కొంతమంది ఈ మోడల్‌లో ఇళ్లను నిర్మించడం ఇప్పటికే ప్రారంభించారు. నా అనుభవం ఇలా ప్రజలకు ఉపయోగపడుతున్నందుకు సంతోషంగా ఉంది. నా అనుభవాన్ని ఆసక్తి ఉన్నవాళ్లతో పంచుకోవడానికి నేను ఎప్పుడూ సిద్ధమే” అని గోపాలకృష్ణన్ తన గొప్ప మనసును చాటుకున్నారు.

---

## అధరాలు ఆరోగ్యంగా...

**ఈ సీజన్‌లో పెదవులు తొందరగా పొడిబారడంతో పాటు పగుళ్లు ఏర్పడతాయి. అయితే లిప్‌బామ్ వంటివి తక్కువ సమయమే పనిచేస్తాయి. అలాంటప్పుడు వంటింట్లో లభించే పదార్థాలతో పెదవులను మృదువుగా, ఆరోగ్యంగా మార్చుకోవచ్చు. అదెలాగో చూద్దాం...**

**చక్కెర, తేనె:** పెదవుల మీద మృతకణాలు పేరుకోవడం వల్ల పొడిగా కనిపిస్తాయి. అలాంటప్పుడు స్క్రబ్బర్‌తో వాటిని తొలగించుకోవాలి. తేనె, చక్కెర మిశ్రమం సహజ స్క్రబ్బర్‌గా పనికొస్తుంది. ఈ మిశ్రమంతో రుద్దుకుంటే మృతకణాలు తొలగి పెదవులు మృదువుగా, తాజాగా కనిపిస్తాయి.



బ్యూటీ

**కొబ్బరినూనె:** పగుళ్లు ఏర్పడిన పెదవుల మీద కొద్దిగా కొబ్బరి నూనె రాస్తే వాటికి తేమ అందుతుంది. కొబ్బరినూనెలోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు పెదవుల పగుళ్ల మీద బ్యాక్టీరియా వృద్ధిని అడ్డుకుంటాయి. ఇన్‌ఫెక్షన్లను నివారిస్తాయి.

**అలోవెరా:** దీనిలోని జెల్ పగిలిన పెదవులకు మందుగా పనిచేస్తుంది. అలోవెరా జెల్‌ను కొద్దిసేపు ఫ్రిజ్‌లో ఉంచి, పెదవులకు రాసుకోవాలి. రోజుకు రెండు లేదా మూడు సార్లు ఈ జెల్ రాసుకుంటే అధరాలు సున్నితంగా, ఆరోగ్యంగా మారతాయి.

**నెయ్యి:** ఒక చుక్క నెయ్యి రుద్దుకుంటే పెదవులకు తేమ అందుతుంది. రాత్రిపూట నిద్రపోయే ముందు నెయ్యి రాసుకుంటే పెదవులు తాజాగా కనిపిస్తాయి.

**గ్రీన్ టీ బ్యాగ్:** ఈ టీలోని యాంటీ ఆక్సిడెంట్, మినరల్స్, పాలీఫెనాల్స్ పెదవులకు రక్షణనిస్తాయి. అందుకే గ్రీన్ టీ బ్యాగును పెదవుల మీద కొద్దిసేపు రుద్దుకుంటే మృతకణాలు మాయమవుతాయి.

అధ్యయనం

# హిమోగ్లోబిన్ తగ్గినా, పెరిగినా...



ప్రపంచ మానవాళిని ప్రత్యేకించి వృద్ధుల్ని నేడు కలవరపెడుతున్న అతిపెద్ద వ్యాధుల్లో డిమెన్షియా, అల్జీమర్స్ ప్రధానం. ఈ సమస్యలు రావడానికి కారణాలు చాలానే ఉన్నాయి. అయితే పెద్దవాళ్లల్లో మతిమరుపు రావడానికి హిమోగ్లోబిన్ హెచ్చుతగ్గులు కూడా కారణమేనంటూ ఒక అధ్యయనంలో కొత్త విషయం బయటపడింది. ఇటీవల 'న్యూరాలజీ' జర్నల్‌లో ప్రచురితమైన డచ్ అధ్యయన వ్యాసం ఇందుకు సంబంధించిన పలు వివరాలు తెలియచేసింది. హిమోగ్లోబిన్ హెచ్చుతగ్గులు, డిమెన్షియాతో పాటు అల్జీమర్స్ వ్యాధికి కూడా దారి తీసే ప్రమాదం ఉంటుందనేది వారి వివరణ. వారి అధ్యయన వివరాలను బట్టి, సగటు వయసు 65 ఏళ్లుగా ఉన్న 12 వేల మందిని పరీక్షిస్తే, వారిలో 745 మంది, అంటే 6 శాతం మందిలో రక్తహీనత సమస్య ఉంది. సదరు వ్యక్తులను 12 ఏళ్ల పాటు అనుసరిస్తూ వెళితే, వీరిలో 15 వందల మంది మతిమరుపు సమస్యకు గురయ్యారు. అయితే వీరిలో 1200 మంది అల్జీమర్స్ బాధితులూ ఉన్నారు. అంతేకాదు రక్తహీనత సమస్యతో ఉన్న వారిలో దాదాపు 41 శాతం మంది అల్జీమర్స్ వ్యాధికి గురవుతారని తెలుస్తోంది. రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉండడమే కాదు, హిమోగ్లోబిన్ నిల్వలు ఎక్కువైన వారు కూడా డిమెన్షియా సమస్యకు గురయ్యే అవకాశం ఉంది. హిమోగ్లోబిన్ నిల్వలు మధ్యస్థ దశలో ఉన్న వారితో పోలిస్తే, ఆ నిల్వలు ఎక్కువగా ఉన్నవారిలోనూ 20 శాతం మంది డిమెన్షియాకు గురయ్యే వీలుంది. డిమెన్షియా, అల్జీమర్స్ వ్యాధులు రావడానికి గల ఇతర కారణాలు ఎన్ని ఉన్నా, హిమోగ్లోబిన్ నిల్వల హెచ్చుతగ్గుల పాత్ర కూడా తక్కువేమీ కాదని ఈ అధ్యయనం స్పష్టం చేసింది.

హార్మోనల్ హెల్త్

# తనకు ద్రోహం చేస్తున్నానా?



**డాక్టర్! నా వయసు 25. 14 ఏళ్ల వయసులో, హాస్టల్‌లో ఉన్న సమయంలో స్నేహితుడితో సన్నిహితంగా గడిపాను. ఆ తర్వాత ఎప్పుడూ అలా జరగలేదు. ప్రస్తుతం నేనొక అమ్మాయిని పెళ్లి చేసుకోబోతున్నాను. కానీ పెళ్లి చేసుకుని ఆ అమ్మాయికి ద్రోహం చేస్తున్నానా అనే భయం నన్ను వెంటాడుతోంది. నేను స్వలింగ సంపర్కుడినా, కానా అనే విషయాన్ని నిర్ధారించుకోలేకపోతున్నాను. నన్ను ఏం చేయమంటారు?**

**- ఓ సోదరుడు,** అనంతగిరి

13, 14 ఏళ్ల వయసు అబ్బాయిల్లో ఇలాంటివి ఎంతో సహజం. పిల్లలు తమ చేతులతో జననాంగాలు పట్టుకుని ఆడుతూ ఉండడం చూస్తూ ఉంటాం. ఆనందం కోసమే వారు అలా చేస్తారు. మీరు చేసిన పని కూడా అలాంటిదే! ఆ ఒక్కసారే మీరు అబ్బాయితో సన్నిహితంగా మెలిగారు. అంతకు మించి మీ మధ్య ఏమీ జరగలేదు. ఒక వేళ మీరు స్వలింగ సంపర్కులు అయితే ఆ తర్వాత నుంచి అబ్బాయిలకే ఆకర్షితులు అయ్యేవారు. అమ్మాయిల మీద ఆసక్తి కలగదు. కానీ మీ విషయంలో అలా జరగలేదు. అమ్మాయిని ఇష్టపడడమే కాకుండా, పెళ్లికి కూడా సిద్ధపడుతున్నారు. కాబట్టి మీరు స్వలింగ సంపర్కులు కారని గట్టిగా చెప్పవచ్చు. కాబట్టి అర్థం లేని భయాలు, అనుమానాలు వదలి, హాయిగా పెళ్లి చేసుకోండి. ఆమెకు ద్రోహం చేస్తున్నానేమో అనే ఆత్మన్యూనత భావన నుంచి బయటపడండి.

**- డాక్టర్ రాహుల్ రెడ్డి**
ఆండ్రాలజిస్ట్, హైదరాబాద్
8332850090 (కన్సల్టేషన్ కోసం)



లింఫెడీమా

# వాపును... వదిలిద్దాం!



**కేన్సర్ నుంచి కోలుకోవడం ఒక ఎత్తయితే, తదనంతర ఇబ్బందులను అధిగమించడం మరో ఎత్తు! మరీ ముఖ్యంగా అసౌకర్యానికి లోను చేసే అవయవాల వాపులు మరింత విసుగు తెప్పిస్తాయి! నిర్లక్ష్యం చేస్తే అనవసరపు సమస్యలూ తెచ్చిపెడతాయి! 'లింఫెడీమా' అనే ఈ ఇబ్బందిని అధిగమించేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? నాణ్యమైన జీవితాన్ని ఎలా గడపాలి?**

లింఫెడీమా అంటే అవయవాల వాపు. లింఫ్ గ్రంథుల నుంచి స్రవించే స్రావం కణజాలాలకు చేరకుండా, నిల్వ ఉండిపోతే ఇలా జరుగుతుంది. ఫలితంగా ఆయా ప్రదేశాలతో సంబంధం ఉన్న కాళ్లు, చేతులు, ముఖం... వాచిపోతాయి. గుండె నుంచి అవయవాలకు రక్తాన్ని చేరవేసే ధమనులు క్రమంగా చిన్న శాఖలుగా విడిపోయి, చివరకు సిరలుగా మారతాయి. అయితే శాఖలుగా విడిపోయే దశలో లింఫ్ స్రావం కణజాలాలకు చేరుతుంది. ఆ స్రావం ద్వారానే కణజాలం జీవించడానికి అవసరమైన ఆక్సిజన్, ఆహారం అందుతాయి. అయితే ఇలా కణజాలాలకు చేరిన స్రావం 'లింఫాటిక్స్' అనే సన్నని నాళాల ద్వారా వెనక్కి వచ్చి, తిరిగి సిరల్లో కలుస్తుంది. మార్గమధ్యంలో ఈ స్రావాలు లింఫ్ నోడ్స్ దగ్గర ఆగుతాయి. ఈ మార్గంలో ఏ కారణంగా, ఎక్కడ అవరోధం ఏర్పడినా లింఫెడీమా తలెత్తుతుంది. కేన్సర్ సర్జరీ ఫలితంగా ఈ నాళాలు లేదా లింఫ్‌నోడ్స్ మూసుకుపోవచ్చు. కొన్ని సందర్భాల్లో సర్జరీలో భాగంగా లింఫ్ నోడ్స్‌ను తొలగించవలసి రావచ్చు. కొన్ని సందర్భాల్లో సర్జరీ సమయంలో లింఫ్ గ్రంథులు దెబ్బతినవచ్చు. ఫలితమే... లింఫెడీమా!

**వాపు నియంత్రణ మన చేతుల్లోనే!**

ఈ సమస్య క్రమేపీ పెరుగుతుంది. కాబట్టి ప్రారంభంలోనే గుర్తించి జాగ్రత్తపడడం అవసరం. లింఫెడీమా వాపు సాధారణమైన వాపు కన్నా భిన్నమైనది. కాళ్లలో తలెత్తే లింఫెడీమా అయినా, చేతుల్లో తలెత్తే లింఫెడీమా అయినా... వేళ్ల పైన ఉండే చర్మం ఉబ్బిపోయి, వేళ్లతో పట్టుకుని లాగడానికి సాధ్యపడదు. ఇలా ప్రారంభంలోనే గుర్తిస్తే బిగుతైన 'లింఫాటిక్ గార్మెంట్స్' వేసి వాపును అదుపులో ఉంచుకోవచ్చు.

**చికిత్స ఇలా!**

లింఫ్ స్రావం పేరుకుపోవడం కారణంగా లింఫెడీమా తలెత్తినప్పుడు, ఆ స్రావాన్ని తిరిగి ఆ ప్రదేశం నుంచి వెనక్కి వెళ్లేలా చేయడమే ఈ సమస్యకు ప్రధాన చికిత్స. ఇందు కోసం మూడు రకాల పద్ధతులను అనుసరించాలి. అవేంటంటే...

**మర్దన:** మర్దన వల్ల మూసుకుపోయిన నాళాలు తెరుచుకోకపోయినా, చర్మం అడుగున కొత్త నాళాలు ఏర్పడేలా చేయవచ్చు. ఫలితంగా స్రావం వెనక్కి వెళ్లిపోతుంది. అయితే మర్దన కోసం ఎలాంటి నూనెలూ వాడకూడదు. మర్దన విధానం వైద్యుల దగ్గరే నేర్చుకుని అనుసరించాలి.

**శుభ్రత:** లింఫెడీమా తలెత్తిన అవయవం చర్మాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. మరీ ముఖ్యంగా వేళ్ల సందుల్లో ఎక్కువగా శుభ్రం చేసుకోవాలి. కేవలం చర్మం శుభ్రం చేసుకోవడానికే ఉదయం, సాయంత్రం అరగంట కేటాయించాలి. జీరో పీహెచ్ రకం సబ్బునే వాడాలి. లేదంటే వాపు వల్ల ఏర్పడే ముడతల్లో బ్యాక్టీరియా చేరి ఇన్‌ఫెక్షన్లు మొదలవుతాయి. ఇలా కొత్తగా వచ్చే ఇన్‌ఫెక్షన్లు తిరిగి లింఫ్ నాళాలను మూసుకుపోయేలా చేస్తాయి. పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తాయి.

**లింఫాటిక్ కంప్రెషన్ పంప్:** ఈ పరికరం కూడా అవయవాల్లో పేరుకుపోయిన స్రావాన్ని వెనక్కి పంపిస్తుంది. ప్రారంభంలో వైద్యుల సహాయంతో ఈ చికిత్స తీసుకోవాలి. తర్వాత ఇంట్లోనే ఉపయోగించుకోవచ్చు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం గంట నుంచి గంటన్నర సమయం పాటు ఈ పరికరాన్ని ఉపయోగించాలి.

ఈ జాగ్రత్తలన్నీ అనుసరించడం కోసం ఆస్పత్రిలో వైద్యుల దగ్గర 8 రోజుల పాటు శిక్షణ తీసుకోవలసి ఉంటుంది. ఈ జాగ్రత్తలు పాటించగలిగితే లింఫెడీమాను 70% నుంచి 80% వరకూ తగ్గించవచ్చు. అయితే వాపు తగ్గినా... కంప్రెషన్ గార్మెంట్స్ జీవితాంతం వాడుతూనే ఉండాలి.

## వీళ్లు అప్రమత్తంగా ఉండాలి!

వంశపారంపర్యంగా కేన్సర్ వచ్చే వీలు ఉంది కాబట్టి కేన్సర్ వ్యాధి పీడితుల రక్తసంబంధీకులు అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాధి ఉన్న రక్త సంబంధీకులు ఫస్ట్ డిగ్రీ (తల్లి, తండ్రి, మేనత్త, పిన్ని, బాబాయి, మామయ్య) కోవకు చెందిన వారైతే కేన్సర్ వచ్చే అవకాశాలు 80% సెకండ్ డిగ్రీ (అమ్మమ్మ, తాతయ్య, నానమ్మ) వారైతే 50%, థర్డ్ డిగ్రీ (దూరపు రక్తసంబంధీకులు) వారైతే 20% ఉంటాయి. రొమ్ము, పెద్దపేగు, గర్భాశయం కేన్సర్లు వంశపారంపర్యంగా సంక్రమిస్తాయి. కాబట్టి మీకు కేన్సర్ రక్తసంబంధీకులు ఉంటే, వారికి ఆ వ్యాధి బయటపడినప్పటి వయసుకు ఐదేళ్ల ముందు వయసు నుంచే అప్రమత్తంగా వ్యవహరించాలి.



## సర్జరీ చేసిన ప్రదేశాన్ని బట్టి....

కేన్సర్ సర్జరీ చేసిన ప్రదేశాన్ని బట్టి నిర్దిష్ట అవయవాలకు లింఫెడీమా వస్తుంది. అదెలాగంటే....

**కాళ్లు:** ఒవేరియన్ కేన్సర్, గర్భాశయ కేన్సర్ (ఎండోమెట్రియం, సర్వికల్), రెక్టల్, కొలొనిక్ కేన్సర్లు, కటి ప్రదేశంలో రేడియేషన్

**ముఖం:** తల, మెడకు సంబంధించిన కేన్సర్

**చేతులు:** రొమ్ము కేన్సర్

**ఊపిరితిత్తులు:** లంగ్ కేన్సర్

## ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్ష!

లింఫెడీమాలో చర్మానికి గాయమైతే సూక్ష్మజీవులు తేలికగా ఆకర్షితమవుతాయి. దాంతో ఇన్‌ఫెక్షన్లు పెరుగుతాయి. ఈ అవకాశాలు ఎక్కువ కాబట్టి ఎటువంటి ఇన్‌ఫెక్షన్లకూ గురయ్యే వీలు లేకుండా 'లాంగ్ టర్మ్ యాంటీ బయాటిక్స్' తీసుకోక తప్పదు. ఈ చికిత్సలో భాగంగా తక్కువ మోతాదులో ప్రతి 21 రోజులకు ఒక ఇంజక్షన్ తీసుకోవలసి ఉంటుంది. అలాగే బాడీ మాస్ ఇండెక్స్ 30 కన్నా తక్కువ ఉన్న వారితో పోలిస్తే, అంతకన్నా ఎక్కువ ఉన్న స్థూలకాయుల్లో లింఫెడీమా వచ్చే అవకాశాలు మూడు రెట్లు ఎక్కువ.

**- డాక్టర్ రాజా వి. కొప్పాల**
ఫెలో ఇన్ ఇంటర్వెన్షనల్ రేడియాలజీ,
ఎవిస్ హాస్పిటల్, హైదరాబాద్



ప్రతి వ్యక్తిలో పుట్టుకతోనే కేన్సర్ జన్యువు, దాన్ని అదిమిపెట్టి ఉంచే 'సప్రెసర్ జీన్స్' (రక్షణ జన్యువులు) ఉంటాయి. అయితే మన ఆహార, జీవనశైలి, పర్యావరణ కాలుష్యం కారణంగా రక్షణ జన్యువుల పనితీరు కుంటుపడితే కేన్సర్ జన్యువు ప్రేరేపితమై వ్యాధి రూపం దాలుస్తుంది. కాబట్టి కేన్సర్ నుంచి రక్షణ కోసం కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

- రెండు నిమిషాల్లో వండుకుని తినే వీలున్న ఏ పదార్థమైనా కేన్సర్ కారకమే! ప్రాసెస్డ్ ఫుడ్స్, పదార్థాలు నిల్వ ఉండడానికి ఉపయోగించేవి, రుచి, రంగులను జోడించేవి కూడా కేన్సర్ కారకాలే. వాటికి దూరంగా ఉండాలి.
- ధూమపానం (యాక్టివ్, పాసివ్) మద్యపానాలకు దూరంగా ఉండాలి.
- మహిళలు యుక్తవయసు కన్నా ముందు నుంచే లైంగిక జీవితం మొదలుపెట్టడం వల్ల 'సర్వికల్ కేన్సర్' వచ్చే అవకాశాలు ఎక్కువ.
- 35 ఏళ్ల తర్వాత గర్భం దాల్చడం వల్ల రొమ్ము, 'ఎండోమెట్రియల్ కేన్సర్'కు గురయ్యే అవకాశాలు పెరుగుతాయి.
- 35 ఏళ్లు దాటిన తర్వాత కుటుంబనియంత్రణ మాత్రలు వాడినా రొమ్ము కేన్సర్ వచ్చే అవకాశాలున్నాయి.
- అస్తవ్యస్త జీవనశైలి ధూమపానం కన్నా 8 రెట్లు ప్రమాదకరం. రోజుకు 10 సిగరెట్లు తాగడం కన్నా, రోజుకు 500 మీటర్ల కన్నా తక్కువ నడవడం అంతకు పది రెట్లు ప్రమాదకరం.



## ఈ పరీక్షలు అవసరం!

కేన్సర్‌ను ముందుగానే గుర్తించగలగాలంటే ప్రతి ఒక్కరూ వారి వయసును బట్టి కొన్ని పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి!

**పురుషులు:**

- 50 ఏళ్లు దాటిన వాళ్లు ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటీజెన్ పరీక్ష చేయించుకోవాలి. ఫలితం నార్మల్‌గా ఉంటే, తిరిగి పదేళ్లకు చేయించుకోవాలి.
- ధూమపానం అలవాటు ఉన్న వారు 40 ఏళ్ల వయసు నుంచి ఏడాదికోసారి ఛాతి ఎక్స్‌రే తీయించుకుంటూ ఉండాలి.
- మద్యపానం అలవాటు ఉన్న వాళ్లు ఏడాదికోసారి లివర్ స్కానింగ్ చేయించుకుంటూ ఉండాలి.

**మహిళలు:**

- 40 ఏళ్లు దాటితే ఏడాదికోసారి మామోగ్రామ్ చేయించుకోవాలి.
- 25 ఏళ్ల వయసు మహిళలు ప్రతి ఐదేళ్లకోసారి పాప్‌స్మియర్ టెస్ట్ చేయించుకోవాలి. పరీక్షలో తేడా కనిపిస్తే ఏడాదికోసారి పరీక్షించుకుంటూ ఉండాలి.

**స్త్రీ,పురుషులు**

- 40 ఏళ్లు దాటిన తర్వాత కడుపు ఉబ్బరం హఠాత్తుగా మొదలైతే ఎండోస్కోపీ చేయించుకోవాలి.
- 50 ఏళ్లు దాటిన వాళ్లు కొలనోస్కోపీ చేయించుకోవాలి. ఫలితం నార్మల్‌గా ఉంటే, తిరిగి పదేళ్ల తర్వాత చేయించుకోవాలి.

ఈ పరీక్షలతో పాటు సాధారణ మల, మూత్ర, రక్త పరీక్షలు ఏడాదికోసారి చేయించుకోగలిగితే ఫలితాల ద్వారా కేన్సర్‌ను ముందుగానే కనిపెట్టవచ్చు.

ఆయుర్వేదం



# ఆరోగ్యంగా...ఆనందంగా!

ఆరోగ్యంలోనే ఆనందం ఉంటుంది. ఆరోగ్యం పొందడం కోసం ఎంచుకునే మార్గం మెరుగైనది అయితే, రెట్టింపు ఫలితం దక్కుతుంది. ఇందుకోసం ఆయుర్వేద మార్గాన్ని అనుసరించాలి!

ప్రతి రోజూ ఆరోగ్యకరమైన అలవాట్లను అనుసరిస్తూనే ఉంటాం. వాటికి ఆయుర్వేద పద్ధతులను జోడిస్తే మరింత మెరుగైన, ఫలవంతమైన ఆరోగ్యం దక్కుతుంది. ఇందుకోసం ఈ చిట్కాలు పాటించాలి.

- ప్రతి రోజూ ఉదయం నిద్ర లేచిన వెంటనే, పరగడుపున నిమ్మరసం తాగుతాం. ఇదే నిమ్మరసంలో కొంత పసుపు కూడా కలుపుకొని తాగితే వాపులు, నొప్పులు తగ్గుతాయని ఆయుర్వేదం సూచిస్తోంది.
- ఉదయం వేళ చేసే వ్యాయామంలో ప్రాణాయామం, యోగా, ధ్యానాలకు తలా పది నిమిషాల సమయం కేటాయిస్తే, రోజు మొత్తం చలాకీగా ఉండవచ్చని ఆయుర్వేదం చెబుతోంది.
- ఉదయం 7 నుంచి 8 మధ్య అల్పాహారం, మధ్యాహ్నం 12 నుంచి 2 మధ్య మధ్యాహ్న భోజనం, సాయంత్రం 6 నుంచి 7 మధ్య రాత్రి భోజనం ముగించాలి.
- ఉదయం అల్పాహారం తగుమాత్రంగా, మధ్యాహ్న భోజనం దిట్టంగా, రాత్రి భోజనం తేలికగా తీసుకోవాలనేది ఆయుర్వేద సూచన.
- వ్యాయామం కోసం ఉదయం 6 నుంచి 10, సాయంత్రం అయితే 5 నుంచి 6 గంటల మధ్య సమయాలు అనువైనవి.

# ఒత్తిడి తగ్గించే బిరియానీ ఆకు

ఒత్తిడి తొలగి మనసు తేలికగా మారాలంటే సువాసనతో నిండిన పరిసరాల్లో గడపాలని అంటారు. ఇందుకోసం సుగంధ ద్రవ్యమైన బిరియానీ ఆకునూ ఉపయోగించవచ్చు. అదెలాగంటే...

బిరియానీ ఆకులో ఒత్తిడిని తొలగించే గుణాలు ఉంటాయి. తులసి ఆకుల్లో ఉండే 'లినలూల్' ఒత్తిడికి కారణమయ్యే హార్మోన్లను నెమ్మదించేలా చేస్తుంది. కాబట్టే ఆరోమాథెరపీలో భాగంగా ఈ కాంపౌండ్‌ను వాడుతూ ఉంటారు. కాబట్టి ఒత్తిడిగా అనిపిస్తే బిరియానీ ఆకును కాల్చి, వాసన పీల్చాలి. ఇందుకోసం పచ్చి ఆకుల బదులుగా బాగా ఎండిన ఆకులను ఎంచుకోవాలి. గది తలుపులు మూసి, ఓ గిన్నెలో బిరియానీ ఆకును తుంచి వేసి, మండించాలి. ఆకులు కాలడంతో పల్చని పొగతో పాటు, సువాసన గది మొత్తం అలముకుంటుంది. ఈ వాసనను పీల్చడం వల్ల మనసు నెమ్మదించి, ఒత్తిడి తొలగిపోతుంది.

రెమెడీ



దారి కనుక్కోండి!



ప్రతిభ

# శభాష్ అఫన్!

**పబ్జీ గేమ్‌కు అలవాటు పడిన తమ అబ్బాయి ఏమైపోతాడో అని తల్లితండ్రులు ఆందోళన చెందారు. ఆ ఆట నుంచి అతడి దృష్టి మరల్చేందుకు రూబిక్ క్యూబ్ కొనిచ్చారు. ఇప్పుడా కుర్రాడు దాంతో రికార్డులు సృష్టిస్తున్నాడు. ముంబయ్‌కి చెందిన 14 ఏళ్ల అఫన్ కుట్టీ కబుర్లివి..**

ఒక రూబిక్ క్యూబ్ సెట్ చేయాలంటే గంటలు కూర్చున్నా మనకు సాధ్యం కాదు. కానీ అఫన్ కుట్టీ మాత్రం మూడు నిమిషాల్లో 12 క్యూబ్‌లను పరిష్కరిస్తాడు. అంతేకాదు కళ్లకు గంతలు కట్టుకుని మరీ క్యూబ్‌ను సెట్ చేస్తాడు. 3X3, 7X7, 13X13 క్యూబ్ ఏదైనా అఫన్ చేతుల్లోకి తీసుకుంటే క్షణాల్లో సెట్ అయిపోతుంది. కొద్ది రోజుల క్రితం కళ్లకు గంతలు కట్టుకుని క్యూబ్‌లో 26 ఇంగ్లీష్ పదాలను వరుస క్రమంలో అమర్చి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులోకెక్కాడు. ఎనిమిదో తరగతి చదువుతున్న ఈ కుర్రాడికి సెల్‌ఫోన్‌లో టిక్‌టాక్ వీడియోలు చేయడం, పబ్జీ గేమ్ ఆడే అలవాటు ఉండేది. ఆ అలవాటును మాన్పించడానికి అఫన్ తండ్రి బైజు ఒక రూబిక్ క్యూబ్ కొనిచ్చాడు. 'నేను 500కు పైగా టిక్‌టాక్ వీడియోలు చేశాను. ఎప్పుడూ నా మైండ్‌లో పబ్జి గేమ్ ఉండేది. దానివల్ల ఆరోగ్యం దెబ్బతింది. ఎలాగైనా ఆ అలవాటు నుంచి బయటపడాలనుకున్నాను. ఆ సమయంలోనే మా నాన్న క్యూబ్ కొనిచ్చాడు. యూట్యూబ్‌లో చూసి క్యూబ్స్ ఎలా పరిష్కరించాలో నేర్చుకున్నాను" అంటాడు అఫన్. 'కళ్లకు గంతలు కట్టుకుని అక్షరాలు ఎలా క్రమంలో పెట్టగలుగుతున్నావు'అని అడిగితే "ప్యాటర్న్ ఫాల్ అవుతాను" అని కూల్‌గా చెబుతాడు. లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఇంటర్నేషనల్ క్యూబింగ్ ఈవెంట్స్‌లో పాల్గొనాలని, గిన్నిస్ రికార్డులోనూ చోటు సంపాదించాలని అనుకుంటున్నాడు అఫన్.




## సరైన నీడ ఏది?




## జత ఉన్న బొమ్మ ఏది?




## డైలీ సుడోకు -219

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 8 | 2 | | | | | |
| 1 | 3 | | 4 | | 5 | | | |
| 4 | | | | 8 | | | | |
| | | 3 | 5 | 4 | | 9 | 2 | |
| 5 | 2 | | 9 | | 7 | | 3 | 6 |
| | 7 | 9 | | 2 | 6 | 4 | | |
| | | | | 6 | | | | 9 |
| | | | 8 | | 2 | | 4 | 3 |
| | | | | | 9 | 1 | | |

**ఎలా పూరించాలి?**

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

**సుడోకు - 218 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 2 | 4 | 7 | 5 | 9 | 1 | 6 | 3 |
| 1 | 7 | 6 | 2 | 4 | 3 | 9 | 5 | 8 |
| 9 | 3 | 5 | 6 | 8 | 1 | 7 | 4 | 2 |
| 2 | 8 | 7 | 3 | 9 | 6 | 4 | 1 | 5 |
| 4 | 1 | 9 | 5 | 7 | 2 | 3 | 8 | 6 |
| 6 | 5 | 3 | 4 | 1 | 8 | 2 | 9 | 7 |
| 3 | 9 | 8 | 1 | 2 | 5 | 6 | 7 | 4 |
| 5 | 4 | 2 | 9 | 6 | 7 | 8 | 3 | 1 |
| 7 | 6 | 1 | 8 | 3 | 4 | 5 | 2 | 9 |

# అభిమాని కుటుంబానికి అండగా ఉంటా

- చిరంజీవి


నూర్ కుటుంబ సభ్యులతో చిరంజీవి


రామ్‌చరణ్

గ్రేటర్ హైదరాబాద్ చిరంజీవి యువత అధ్యక్షుడు నూర్ అహ్మద్ సోమవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలియగానే చిరంజీవి తన అభిమాని ఇంటికి చేరుకుని నూర్ పార్థీవదేహానికి నివాళులు అర్పించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ "నూర్ మహ్మద్ నా వీరాభిమాని. ఆయన మరణం తీరని లోటు. నూర్‌ను తిరిగి తీసుకురాలేను కానీ వారి కుటుంబానికి అండగా ఉంటాను" అని చెప్పారు. మెగా అభిమాని చనిపోయారన్న వార్త తెలుసుకున్న రామ్‌చరణ్ వెంటనే స్పందించారు. తను హైదరాబాద్‌లో లేనని, ఇంటికి రాగానే నూర్ కుటుంబ సభ్యులను కలుస్తానని తెలిపారు. నూర్ కుటుంబానికి రూ.10 లక్షలవిరాళం ప్రకటించారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ "నూర్ మెగా అభిమానుల్లోకెల్లా గొప్ప వ్యక్తి. ఎన్నోసార్లు రక్త శిబిరాలు ఏర్పాటు చేశారు. మా పుట్టినరోజులను పురస్కరించి ప్రజలకు ఉపయోగపడే ఎన్నో పనులు నిర్వహించేవారు. గతంలో ఓసారి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి, మెరుగైన వైద్యం అందించమని డాక్టర్లకు చెప్పాను. ఆయన మరణవార్త విని చలించిపోయాను. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా" అని అన్నారు.

# ఎప్పుడో పరిశ్రమ మూతపడేది

- సి.కల్యాణ్



"తెలుగు చిత్రసీమలో చాలా సమస్యలున్నాయి. దాసరి నారాయణరావుగారు లేని లోటు కనిపిస్తోంది. ఇండస్ట్రీకి పెద్దగా ఆ బాధ్యతని చిరంజీవి గారే తీసుకోవాలి. దానికి ఆయనే సమర్థుడు. ఈ విషయాన్ని ఆయనకూ చెప్పాను. కింది స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన ఆయనకు కష్టం, సమస్య విలువ తెలుసు. చిరంజీవి మాటంటే అందరికీ గౌరవం" అని సి.కల్యాణ్ అన్నారు. సోమవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. "ఇన్నేళ్ల నా జర్నీలో విజయాలు, పరాజయాలూ పలకరించాయి. ఎన్నో ఎదురుదెబ్బలు తగిలినా వెనకుంజ వేయలేదు. దర్శకుణ్ణి కావాలని వచ్చి నిర్మాతనయ్యా. నా సామర్థ్యాన్ని చూసి పరిశ్రమ చాలా పదవులు కట్టబెట్టింది. వాటికి న్యాయం చేశాననే అనుకుంటున్నాను. ఏ పదవైనా ఒక్కసారి మాత్రమే స్వీకరించాలని నాకు నేనుగా నియమం పెట్టుకున్నా. పరిశ్రమలో దాసరి నారాయణరావు, రామానాయుడు నాకు స్ఫూర్తి. ఇక్కడికి కొత్తగా వచ్చే నిర్మాతలు ఈ రంగం గురించి ఓ ఏడాదిపాటైనా తెలుసుకోవాలి. అప్పుడే పరిస్థితిని సరిగ్గా అంచనా వేసే సామర్థ్యం వస్తుంది. ఇప్పటి పెద్ద నిర్మాతలంతా ఇలా వచ్చినవారే. చిన్న సినిమాలే పరిశ్రమకు ఆధారం. కొత్త నిర్మాతలు లేకపోతే.. ఆరు నెలల్లో పరిశ్రమ మూత పడుతుంది. ఈ ఏడాది 250 సినిమాలు వస్తే, అందులో స్టార్లు నటించిన సినిమాలు 30కు మించి లేవు. చిన్న సినిమాలు లేకపోతే థియేటర్లు మూతపడాల్సిందే! దర్శకత్వం ఆలోచన ఎప్పటి నుంచో ఉంది. 2020లో ఓ సినిమా డైరెక్ట్ చేస్తా. ప్రస్తుతం బాలకృష్ణతో 'రూలర్' సినిమా తీశా. మంచి కథ ఇది. ఉత్తరప్రదేశ్‌లో స్థిరపడిన తెలుగువాళ్ల కథ. ఎలాంటి రాజకీయ నేపథ్యం ఉండదు. బాలయ్య అభిమానులకు విందు భోజనంలా ఉంటుంది. వినాయక్ - బాలకృష్ణ కలయికలో ఓ సినిమా అనుకున్నాం. తప్పకుండా ఈ కలయికలో 'చెన్నకేశవరెడ్డి'కి మించిన సినిమా అందిస్తాం" అని అన్నారు.


అల్లు అర్జున్

అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న 'అల... వైకుంఠపురములో' సినిమా టీజర్‌ను బుధవారం విడుదల చేయనున్నారు. సూటు, బూటుతో ఆఫీసులో టేబుల్ మీద నడుస్తున్న హీరో కాళ్లను చూపిస్తూ... సోమవారం టీజర్ గ్లింప్స్ విడుదల చేశారు.

# 'ఏరా నీకంత పొగరా.. ఇంటికి పో' అన్నారు

- రజనీకాంత్


'సరిలేరు నీకెవ్వరు'లో మహేశ్‌బాబు

రజినీకాంత్, నయనతార జంటగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'దర్బార్'. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎ.సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. సునీల్‌శెట్టి విలన్‌గా కనిపిస్తారు. సంక్రాంతి కానుకగా ఎన్.వి.ప్రసాద్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇటీవల చెన్నైలో పాటల్ని విడుదల చేశారు. రజనీకాంత్ మాట్లాడుతూ "నేను సక్సెస్ కావడానికి కృషి, పట్టుదలే కారణం కాదు. నన్ను నమ్మిన దర్శకనిర్మాతలు ముఖ్య కారణం. స్కూల్లో పరీక్ష ఫెయిల్ అవుతానని తెలిసి పరీక్ష కోసం ఇంట్లో ఇచ్చిన రూ.150 తీసుకుని చెన్నై రైలెక్కాను. కొన్న టికెట్ ఎక్కడో పడిపోయింది. ఎంత చెప్పినా టీసీ జరిమానా కట్టాల్సిందే అని అరిచాడు. అప్పుడు ఐదుగురు కూలీలు నాకు టికెట్ డబ్బులు ఇవ్వడానికి వచ్చారు. 'నేను కొన్న టికెట్ పడిపోయిందని చెబుతుంటే టీసీ వినడం లేదు' అన్నాను. అప్పుడు టీసీ నన్ను నమ్మారు. తెలియని ఓ వ్యక్తి నన్ను నమ్మడం అదే తొలిసారి. మద్రాస్‌కు వచ్చాక కె.బాలచందర్ నన్ను నమ్మారు. ఆయన నమ్మకాన్ని గెలిపించాను. ఆ తర్వాత ప్రజలు నామీద నమ్మకం పెట్టుకున్నారు. అది ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము కాదు. నా జీవితంలో ఓ బాధాకర ఘటన జరిగింది. '16 వయదినిలే' తర్వాత ఓ నిర్మాత నాతో ఓ సినిమా తీస్తానన్నారు. అడ్వాన్స్ ఇస్తేనే నటిస్తానని గట్టిగా చెప్పాను. 'ఏరా నీకంత పొగరా. నీకు వేషం లేదు. వెళ్లిపో' అని అరిచారాయన. చాలా బాధపడ్డా. ఉన్నత స్థాయికి చేరుకోవాలనుకున్నా. ఆ తర్వాత రెండున్నరేళ్లలో ఫారిన్ కారు కొన్నా' అని అన్నారు. 'దర్బార్' గురించి మాట్లాడుతూ "శివాజీ' టైమ్‌లోనే మురుగదాస్ ఈ కథ చెప్పారు. ముంబై బ్యాక్‌డ్రాప్‌లో సాగే సినిమా ఇది. నేను అనుకున్నదానికన్నా బాగా తెరకెక్కించారు. 'దళపతి' తర్వాత 29 ఏళ్ల అనంతరం మళ్లీ సంతోశ్ శివన్ నా సినిమాకు పనిచేయడం ఆనందంగా ఉంది" అని అన్నారు. "రజనీకాంత్ మనకు దొరికిన వరం. గత 15 ఏళ్లలో రజినీకాంత్‌గారి సినిమాల్లో చూడని విధంగా ఇందులో యాక్షన్ సన్నివేశాలుంటాయి" అని మురుగదాస్ చెప్పారు. 'రజనీసార్‌తో నేను చేసిన రెండో చిత్రమిది. మురుగదాస్ అద్భుతంగా తెరకెక్కించారు" అని సుభాస్కరన్ చెప్పారు.


మురుగదాస్, రజనీకాంత్, సుభాస్కరన్

# రజనీతో కీర్తి

రజనీకాంత్‌తో నటించే అవకాశం రావడంతో కీర్తీ సురేశ్ సంతోషం వ్యక్తం చేశారు. రజనీకాంత్ 168వ చిత్రంలో ఆమె నటించనున్నారు. కీర్తీతో పాటు చిత్రనిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ విషయాన్ని ట్వీట్ చేశారు. అయితే ఆమె నటిస్తున్నది హీరోయిన్‌గా కాదనీ, కీలక పాత్రలో అనీ తెలుస్తోంది. "అందరికీ నమస్కారం! నేను మీ కీర్తీ సురేశ్. తలైవర్198వ చిత్రంలో నేనూ ఓ భాగమైనందుకు చాలా చాలా సంతోషంగా ఉంది. సన్ పిక్చర్స్, దర్శకుడు శివగారికి థ్యాంక్స్. నేను రజనీకాంత్‌గారికి పెద్ద అభిమానిని. ఆయనతో కలిసి నటించే క్షణాలన్నీ నా జీవితంలో ఎంతో మధురమైనవి. నా ప్రయాణంలో ఈ చిత్రం ఓ మైలురాయి" అని కీర్తీ సురేశ్ అన్నారు. త్వరలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందట!


కీర్తీ సురేశ్

## కరణ్ జోహార్ భాగస్వామ్యంతో...

# ఐదు భాషల్లో 'ఫైటర్'


విజయ్ దేవరకొండ

'అర్జున్‌రెడ్డి'తో విజయ్ దేవరకొండకు దేశవ్యాప్తంగా అభిమానులు ఏర్పడ్డారు. దర్శకుడు పూరి జగన్నాథ్ చిత్రాలకూ హిందీలో, ఇతర భాషల్లో అభిమానులు ఉన్నారు. అమితాబ్ బచ్చన్ హీరోగా హిందీలో 'బుడ్డా హోగా తెరా బాప్'కు దర్శకత్వం వహించారు పూరి. ఆయన తీసిన పలు చిత్రాలు ఇతర భాషల్లో రీమేక్ అయ్యాయి. వీరిద్దరి కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఫైటర్'. 'ఇస్మార్ట్ శంకర్' విజయం తర్వాత పూరి చేస్తున్న చిత్రమిది. పాన్ ఇండియన్ కథ కావడంతో హిందీ దర్శక-నిర్మాత కరణ్ జోహార్ ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామిగా మారారు. పూరి, ఛార్మితో కలిసి ఆయన ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. జనవరిలో చిత్రీకరణ ప్రారంభించనున్నారని సమాచారం. తెలుగుతో పాటు హిందీ, కన్నడం, తమిళం, మలయాళం... మొత్తం ఐదు భాషల్లో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## థియేటర్లలో తప్ప...

# డిజిటల్‌లో చూస్తే కిక్ రాదనేలా సినిమాలు తీయాలి!

- సురేశ్‌బాబు

"నేను ఇండస్ట్రీకి వచ్చి 37 ఏళ్లు. చాలా మంచి సినిమాలు తీశాం. చూశాం. ఇప్పుడొచ్చే సూపర్‌హిట్ సినిమాలు కూడా పాతరోజుల్లో చేసిన మంచి సినిమాల కంటే గొప్పగా అనిపించవు. కథలో తప్పేంటి? ఒప్పేంటి? అనేది నాకు ఈజీగా తెలుస్తుంది. కథలో సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ప్రశ్నలు అడుగుతుంటా. సరైన ప్రశ్నలు అడుగుతాను కాబట్టి వాళ్ల దగ్గర సమాధానాలు ఉండవు. ఎందువల్ల, ఎక్కడ తప్పు జరుగుతుందో చెప్తా. కథపై సంతృప్తి చెందాక సినిమా చేయమంటాను. మా ఫ్యామిలీలో హీరోలతో చేసినవి ఆడకపోతే నవ్వుతారని, వాటిపై ఎక్కువ దృష్టి పెడతా" అని సురేశ్‌బాబు అన్నారు. టీజీ విశ్వప్రసాద్‌తో కలిసి ఆయన నిర్మించిన సినిమా 'వెంకీమామ'. వెంకటేశ్, నాగచైతన్య హీరోలు. కె.ఎస్. రవీంద్ర (బాబీ) దర్శకుడు. ఈ నెల 13న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సురేశ్‌బాబు చెప్పిన సంగతులు...

- 'జనార్ధన మహర్షి దగ్గర ఓ కథ ఉంది. బావుంది. వినండి' అని వివేక్ కూచిభొట్ల తీసుకొచ్చాడు. విన్నాను. ఐడియా బావుంది కానీ... ట్రీట్మెంట్ బాలేదు. చాలా వర్క్ చేయాలని పక్కనపెట్టేశా. వెంకటేశ్‌కు కథలు దొరకడం లేదని ఎప్పుడూ వెతుకుతూ ఉంటాను. ఓసారి కోన వెంకట్‌కు ఈ ఐడియా గురించి చెప్పాను. 'బావుంది సార్! వర్క్ చేద్దాం' అన్నాడు. కథ బాగా వస్తే వెంకటేశ్, నాగచైతన్యతో చేయాలనుకున్నా. అప్పుడు కల్యాణ్‌కృష్ణ కురసాల దర్శకత్వంలో చేద్దామనుకున్నాం. అతడికీ ఐడియా నచ్చింది. కానీ, 'బంగార్రాజు' స్క్రిప్ట్ వర్క్‌లో ఉన్నాడు. అన్నపూర్ణ స్టూడియోస్‌లో సినిమా కాంట్రాక్ట్ ఉండడంతో కుదరలేదు. ఇది 'ఎఫ్2' కంటే ముందు సంగతి. అప్పుడు బాబీ అయితే బావుంటుందని కోన వెంకట్ సూచించాడు.
- ఐడియా విన్న బాబీ... నెల రోజులకు వచ్చి మొత్తం కథ చెప్పాడు. జనార్ధన మహర్షి కథలో లేని ఒక సీక్వెన్స్ చెప్పాడు. వినగానే కన్నీళ్లొచ్చాయి. బావుందని చెప్పి పంపించాను. నేను తెలుగు చదవను. కథ చెప్పేటప్పుడు రికార్డ్ చేసుకుని, తర్వాత మూణ్నాలుగు సార్లు వింటాను. డౌట్స్ అన్నీ రాసుకుంటాను. బాబీకి అలాగే చెప్పాను. చెప్పిన కరెక్షన్స్ చేశాడు. వెంకటేశ్, చైతన్య విన్నారు. తమ పాత్రల పట్ల సంతృప్తి చెందారు. చిత్రీకరణ ప్రారంభించాం. సినిమా తీసేటప్పుడు నేను వేలు పెట్టను. పాతరోజుల్లో ఎక్కువ జోక్యం చేసుకునేవాణ్ణి.
- కథ విన్నప్పుడే కాదు... మొన్న సినిమా చూసినప్పుడు మూణ్నాలుగుసార్లు కన్నీళ్లు పెట్టుకున్నా. చాలా రోజుల తర్వాత ప్రేక్షకులకు పూర్తిస్థాయి తెలుగు సినిమా చూసిన ఫీలింగ్ కలుగుతుంది. విధి, జోతీష్యం, మామాఅల్లుళ్ల అనుబంధం నేపథ్యంలో కథ సాగుతుంది. చైతన్య చాలా బ్యాలెన్స్ రోల్ చేశాడు.
- తొలిసారి ఓ సినిమా విడుదల గురించి నేను కన్ఫ్యూజ్ అయ్యాను. అమెరికాలో రెండు నెలలు ఉండడం, ఇతర పనులతో బిజీగా ఉండడంతో కన్ఫ్యూజన్ నెలకొంది. అక్టోబరులో దసరాకు చిత్రాన్ని విడుదల చేయాలనుకున్నాం. లాస్ట్ షెడ్యూల్‌లో వెంకటేశ్‌కి కాలు బెణికింది. తర్వాత 'కోకా కోలా' సాంగ్ షూట్ చేయడానికి రాశీ ఖన్నా డేట్స్ దొరకలేదు. దీపావళి కూడా మిస్ అయ్యింది. ఎప్పుడు విడుదల చేద్దామని మేనేజర్లతో మీటింగ్ పెడితే... సంక్రాంతికి విడుదల చేస్తున్నామని వదంతి వచ్చింది. సంక్రాంతికి విడుదల చేయాలనే ఆలోచన నా మనసులో లేదు. మహేశ్‌బాబు, అల్లు అర్జున్‌తో క్లాష్ కావాలని అనుకోలేదు. క్రిస్మస్ కలిసి వస్తుందని డిసెంబర్ 13న వస్తున్నాం.
- సినిమా తీసేది థియేటర్ కోసమే కాదు... డిజిటల్, శాటిలైట్, వగైరా కోసమని తెలుసుకోవాలి. అమెజాన్, నెట్‌ఫ్లిక్స్ వంటి ఓటీటీ ప్లాట్‌ఫార్మ్స్‌లో 30 రోజుల్లో సినిమా వస్తే... థియేటర్లకు ఇబ్బంది తప్పదు. అయితే... సినిమా థియేటర్‌లోనే చూడాలనే అనుభూతిని ప్రేక్షకులకు కలిగించలేకపోతున్నాం. విదేశాల్లో అత్యున్నత ప్రమాణాలతో థియేటర్‌లో తప్ప డిజిటల్‌లో చూస్తే కిక్ రాదనేలా భారీ చిత్రాలు తీస్తున్నారు. కంటెంట్ మీద దృష్టి పెడుతున్నారు. క్వాలిటీతో తీస్తున్నారు. మనమూ అలా తీయాలి. హిందీలో అక్షయ్‌కుమార్, ఆయుష్మాన్ ఖురానా వివిధ జానర్స్‌లో కొత్త కొత్త సినిమాలు చేస్తున్నారు. మన స్టార్స్ ఇమేజ్ కోసం ఆలోచించకుండా... అక్షయ్‌లా ఏడాదికి మూడు, నాలుగు సినిమాలు చేయాలి.
- వెంకటేశ్‌తో శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో వి క్రియేషన్స్‌తో కలిసి 'అసురన్' రీమేక్ చేస్తున్నాం. జనవరిలో చిత్రీకరణ ప్రారంభిస్తాం. అందులో మా చిన్నబ్బాయి అభిరామ్ నటిస్తున్నాడన్న వార్తల్లో నిజం లేదు. తక్కువ రోజుల్లో నాణ్యమైన సినిమా తీయాలని 'హిరణ్యకశ్యప' ప్రీప్రొడక్షన్ వర్క్స్‌కి ఎక్కువ సమయం కేటాయిస్తున్నాం. ఇంకా చాలా కథలున్నాయి. కొన్ని సినిమాల రీమేక్ రైట్స్ కొన్నాను. కానీ, సరైన దర్శకులు లేరు.
- పేపర్లకు, టీవీలకు యాడ్స్‌ను కంట్రోల్ చేయడం నిర్మాతలు, గిల్డ్ చేతిలో ఉంది కాబట్టి కంట్రోల్ చేస్తున్నారు. మిగతావి చేయలేకపోతున్నారు.


విశ్వప్రసాద్, సురేశ్‌బాబు

## 20 చిత్రాలు నిర్మిస్తున్నాం!

- టీజీ విశ్వప్రసాద్

"నేను అమెరికాలో ఉంటాను. సాంకేతిక రంగంలో వ్యాపారం చేస్తున్నాను. ఐదారేళ్లు క్రితం చిత్రసీమలో అడుగుపెట్టానుకున్నా... సినిమా నిర్మించడం కష్టమనే అభిప్రాయంతో రాలేదు. రెండేళ్ల క్రితం చిత్రనిర్మాణంలోకి వచ్చాం. వివేక్ కూచిభొట్ల నిర్మాణ వ్యవహారాలు చూసుకుంటున్నారు. ఇప్పటివరకూ ఏడు చిత్రాలు చేశాం. 20 చిత్రాల్లో పెట్టుబడి పెట్టాం. కథ నచ్చడంతో 'వెంకీమామ' చేశాం. సురేశ్‌బాబుగారితో ఈ ప్రయాణంలో చాలా నేర్చుకున్నా"

# సస్పెన్స్ థ్రిల్లర్


స్వప్న

కొత్త పాత నటీనటులతో తోలుబొమ్మలు సిత్రాలు బ్యానర్‌పై ఓ సినిమా రూపొందుతోంది. కొమరక్క, స్వప్న, వేదం నాగయ్య, పద్మారావు కీలక పాత్రధారులు. కొమారి జానకిరామ్ దర్శకత్వంలో కొమారి జానయ్య నాయుడు నిర్మిస్తున్నారు. ఓ పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా దర్శకులు మాట్లాడుతూ "లవ్, సెంటిమెంట్, కామెడీ, హర్రర్ నేపథ్యంలో సాగే కమర్షియల్ సినిమా ఇది. ఇందులో సందేశం, వినోదం ఆకట్టుకుంటాయి. అంతర్వేది, మచిలీపట్నం, శ్రీశైలం, వికారాబాద్, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో చిత్రీకరించాం. త్వరలో సినిమాను విడుదల చేస్తాం" అని తెలిపారు.

# ఆత్మహత్య పరిష్కారం కాదు

సంజయ్ ఇదామ, శ్రీనాధ్ మాగంటి, అహల్య సురేశ్, ప్రియ నటీనటులుగా తెరకెక్కిన చిత్రం 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్'. జె.కరుణా కుమార్ దర్శకుడు. బి.ఓబుల్ సుబ్బారెడ్డి నిర్మాత. ఇటీవల ఈ చిత్రం పాటల్ని జీవిత రాజశేఖర్ దంపతులు, మల్కాపురం శివకుమార్ విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "హరి ప్రసాద్ చక్కటి మెసేజ్ ఉన్న కథను అందించాడు. ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదని ఈ సినిమాలో చెప్పాం" అని అన్నారు. "మంచి సందేశంతో వస్తున్న చిత్రమిది. మల్కాపురం శివకుమార్ సహాయంతో సినిమా విడుదల చేస్తున్నాం. ఈ సినిమాతో డబ్బు వస్తుందా లేదా అన్నది పక్కన పెడితే మంచి సినిమా తీశానన్న తృప్తి ఉంది" అన్నారు.


అహల్య, సంజయ్

# హత్యాచారాలను ప్రస్తావిస్తూ...


సంతోష్, చిత్రాన్షి

ముగ్గురమ్మాయిల మధ్య జరిగిన అనుకోని సంఘటనలు వారి జీవితాల్లో ఏ విధమైన మార్పులు తీసుకొచ్చాయనే కథాంశంతో రూపొందుతోన్న చిత్రం 'విక్టోరియా'. మహారాణి... ఉపశీర్షిక. నవీన్ లొట్ల దర్శకుడు. వి. అర్జున్ అప్పారావు నిర్మాత. చిత్రాన్షీ ధ్రంజ్, సంరీన్ మజిర్, పింకీ, సంతోష్ బాలకృష్ణ ప్రధాన తారలు. ఆదివారం ఫిల్మ్‌నగర్ దైవ సన్నిధానంలో ఈ సినిమా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి శ్రీరాఘవ సతీష్ స్వామిజీ కెమెరా స్విచ్చాన్ చేయగా, రాజ్ కందుకూరి క్లాప్ ఇచ్చారు. సముద్ర గౌరవ దర్శకత్వం వహించారు. "సమాజంలో హత్యాచారాలు, వాటిపై సామాజిక మాధ్యమాల్లో ప్రజలు చర్చించడం సర్వసాధారణమైంది. ఈ తీరును ప్రస్తావిస్తూ... కథనమే ప్రధానాకర్షణగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నా" అని దర్శకుడు తెలిపారు. "త్వరలో చిత్రీకరణ ప్రారంభిస్తామ"న్నారు నిర్మాత. 'చమ్మక్ చంద్ర, విజయ్, నాని బాష నటిస్తున్న ఈ చిత్రానికి ఎల్‌వి ముత్తు గణేశ్ సంగీత దర్శకుడు.

# కొత్త కాన్సెప్ట్‌తో 'డీటీఎస్'


ఆశిష్ గాంధీ, పూజా

'నాటకం' ఫేమ్ ఆశిష్ గాంధీ హీరోగా అభిరామ్ పిల్లాను దర్శకుడిగా పరిచయం చేస్తూ... శ్రీ భవితా క్రియేషన్స్ పతాకంపై తొలి ప్రయత్నంగా గంగారెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'డీటీఎస్'. పూజా జవేరి హీరోయిన్. సాయికార్తీక్ సంగీత దర్శకుడు. ఆదివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. "కొత్త కాన్సెప్ట్‌తో, గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో అభిరామ్ మంచి కథ చెప్పాడు. ఈ నెల చివరి వారంలో చిత్రీకరణ ప్రారంభిస్తాం" అని గంగారెడ్డి అన్నారు. "నాటకం' తర్వాత కొత్త కాన్సెప్ట్ కోసం చూస్తున్న సమయంలో అభిరామ్ చెప్పిన కథ ఎగ్జైట్ చేసింది" అని ఆశిష్ గాంధీ అన్నారు. ఈ చిత్రానికి సతీష్ ముత్యాల ఛాయాగ్రాహకుడు.




| 42.28 సెన్సెక్స్ | 16.00 నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 40,487.43 | 11,937.50 | 37,799 | 43,225 | 71.04 | 63.82 |
| | | ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత) 376 | 890 | 16 పైసలు | |



# 'కార్వీ డేటా'లో వాటా విక్రయం!

**కంపెనీ విలువ రూ.4,000 కోట్లుగా అంచనా**

**రూ.500-1,000 కోట్ల సమీకరణ యోచన**

**చర్చల్లో కార్వీ.. సంక్షోభం నుంచి గట్టెక్కే యత్నం**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత సంక్షోభం నుంచి వీలైనంత త్వరగా బయటపడాలని కార్వీ యోచిస్తోంది. ఖాతాదారులకు చెల్లించాల్సిన నగదును చెల్లించడానికి మార్గాలను అన్వేషిస్తోంది. నగదు సంక్షోభాన్ని అధిగమించడానికి అన్ని ఆప్షన్లను పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. కార్వీ డేటా మేనేజిమెంట్ సర్వీసెస్ లిమిటెడ్ (కేడీఎంఎస్ఎల్)లో వాటా విక్రయం ద్వారా నిధులు సమకూర్చుకోవాలని యోచిస్తోంది. నియంత్రణ వాటాను ఉంచుకుని కేడీఎంఎస్ఎల్‌లో వాటా విక్రయానికి కార్వీ చర్చలు జరుపుతున్నట్లు, ఇవి చివరి దశకు చేరినట్లు తెలుస్తోంది. దీంతోపాటు ఇతర గ్రూప్ కంపెనీల్లో వ్యూహాత్మక భాగస్వామిని తీసుకురావడం ద్వారా నిధులు సమీకరించే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తోంది. ఖాతాదారులకు బిజినెస్ అండ్ నాలెడ్జ్ ప్రాసెస్ సేవలను కేడీఎంఎ స్ఎల్ అందిస్తోంది. ఈ-గవర్నెన్స్ ప్రాసెసింగ్, ఇన్సూరెన్స్ బ్యాక్ ఆఫీస్ ప్రాసెసింగ్, రికార్డ్ కీపింగ్, పెద్ద పెద్ద కంపెనీలకు డేటా మేనేజిమెంట్, బీఎ్‌ఫఎస్ఐ రంగంలోని కంపెనీలకు బ్యాక్ ఆఫీసు సేవలు తదితర రంగాల్లో కేడీఎంఎస్ఎల్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కార్వీ డేటా మేనేజిమెంట్ సర్వీసెస్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న రంగంపై నియంత్రణలు తక్కువగా ఉండడంతోపాటు ఈ వ్యాపారంలో మార్జిన్లు, లాభదాయకత ఎక్కువగా ఉన్నందున వాటా కొనుగోలు చేయడానికి మదుపర్లు త్వరగా ముందుకు వస్తారని, వాటాను విక్రయించడం సులభమని కార్వీ భావిస్తోంది. ప్రాథమిక అంచనా ప్రకారం కేడీఎంఎస్ఎల్ విలువ రూ.4,000 కోట్లు ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ కంపెనీలో వాటా విక్రయం ద్వారా రూ.500-1,000 కోట్లు సమీకరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం సంక్షోభానికి కారణమైన కార్వీ స్టాక్ బ్రోకింగ్ (కేఎస్‌బీఎల్) వాటాను విక్రయించే ఉద్దేశం ప్రమోటర్లకులేదని తెలుస్తోంది. 40 ఏళ్ల నుంచి పెంచుకుంటూ వస్తున్న బ్రాండ్ గుర్తింపును కోల్పోకూడదని కార్వీ భావిస్తోంది. కార్వీ గ్రూప్ కంపెనీల్లో దాదాపు 35 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. కార్వీ స్టాక్ బ్రోకింగ్‌కు దాదాపు 15 లక్షల ఖాతాదారులు ఉన్నారు. వీరిలో 2.5-3 లక్షల మంది చురుగ్గా ట్రేడింగ్ చేసే వారే. స్టాక్ మార్కెట్లలో జరిగే ప్రతి ఐదు లావాదేవీల్లో ఒకటి కార్వీ ద్వారానే జరుగుతోంది. 'కార్వీ ఉదంతం వల్ల మదుపర్లకు ఇబ్బందే. చాలా మంది చాలా అవసరాల కోసం మదుపు చేస్తుంటారు. ఏ అవసరం ఎప్పుడు వస్తుందో తెలియదు. ట్రేడింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయడం వల్ల వారి ఖాతాల్లోని నగదు వారిక ఎప్పుడు లభిస్తుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు.

ఖాతాదారులకు చెల్లించాల్సిన నగదును కార్వీనే చెల్లించాలి. ఏదో ఒక సాహసోపేతమైన నిర్ణయాన్ని కార్వీ తీసుకుంటే తప్ప ఈ సంక్షోభం నుంచి బయటపడలేదు. దీన్ని చాలా వేగంగా చేయాలి. ఇతర కంపెనీలకు తరలించిన నగదును మళ్లీ వెనక్కి తీసుకురావాలి. కార్వీ ఆస్తులు, గ్రూప్ కంపెనీలను పరిగణనలోకి తీసుకుంటే ఖాతాదారులకు నగదును తిరిగి చెల్లించే సామర్థ్యం కార్వీకి ఉంది. అయితే.. దానికి ఎంత సమయం పడుతుందన్నదే ప్రశ్న. అప్పటి వరకూ ఖాతాదారులు ఎదురు చూడాల్సిందే'నని బ్రోకర్ ఒకరు అభిప్రాయపడ్డారు.

### ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభం పుట్టి ముంచిందా?

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఐఎల్ అండ్ ఎఫ్ఎస్)లో చెల్లింపుల సంక్షోభం తర్వాత బ్యాంకులు, ఆర్థిక సంస్థలు జాగ్రత్త పడడం.. గ్రూప్ కంపెనీలకు నిధులు అందించడం.. స్టాక్ ఎక్స్ఛేంజీలు కార్వీ స్టాక్ బ్రోకింగ్ విక్రయించిన షేర్లకు సంబంధించిన నగదును కార్వీకి చెల్లించకుండా బ్యాంకులు ఏర్పాటు చేసిన ఎస్క్రో ఖాతాలో వేయడం వంటి పరిణామాల ద్వారా అప్పటికే నగదు సంక్షోభంలో ఉన్న కార్వీ స్టాక్ బ్రోకింగ్ మదుపర్ల షేర్లను తాకట్టు పెట్టింది. మీ షేర్లను తాకట్టు పెట్టుకుంటామని.. అందుకు 2.5 శాతం వడ్డీ చెల్లిస్తామని ఖాతాదారులకు కార్వీ సంక్షిప్త సందేశాలు పంపినట్లు తెలుస్తోంది. సంక్షిప్త సందేశాన్ని చూసి అంగీకరించని ఖాతాదారుల షేర్ల జోలికి వెళ్లకుండా.. మిగిలిన వారు అంగీకరిస్తున్నట్లుగా భావించి వారి షేర్లను కార్వీ తాకట్టు పెట్టినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అక్టోబరులో ఖాతాదారుల షేర్లను తాకట్టు పెట్టడానికి వీలు లేదని సెబీ ఆదేశాలు జారీ చేయడంతో తాకట్టులోని షేర్లను విడిపించడంలో కార్వీ ఇబ్బందులు ఎదుర్కొంది. అప్పటికే నగదు సంక్షోభంలో ఉందని, ఖాతాదారులకు నగదు చెల్లించ లేదని బ్రోకింగ్ వర్గాలు చెబుతున్నాయి.

**ఏం జరిగిందీ?**

- ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభానికి ముందే కార్వీ బ్రోకింగ్ నిర్వహణ మూలధనం కోసం ఇబ్బందులు పడుతోంది. కమర్షియల్ పేపర్ల (సీపీ) ద్వారా దాదాపు రూ.500 కోట్లను సమీకరించింది. సాధారణంగా సీపీలను బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థలు సబ్‌స్ర్కైబ్ చేస్తాయి. ప్రతి మూడు నెలలకు సీపీని రోలోవర్ చేస్తారు. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభం తర్వాత బ్యాంకులు దీన్ని నిలిపివేశాయి. వాటికి చెల్లింపులు చేయాల్సి వచ్చిందని తెలుస్తోంది.
- కేఎస్‌బీఎల్ గ్రూప్ కంపెనీలకు నిధులను తరలించిందని.. రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి నిధులు మళ్లినట్లు సెబీ వెల్లడించిన విషయం తెలిసిందే. దీంతోపాటు కేడీఎంఎస్ఎల్‌కు కూడా మద్దతు ఇవ్వాల్సిన పరిస్థితులు వచ్చినట్లు బ్రోకింగ్‌వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వానికి కేడీఎంఎస్ఎల్ అనేక సేవలు అందిస్తోంది. ఎన్నికల సమయంలో కోడ్ కారణంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో ఆ కంపెనీకి కూడా నిధులు సమకూర్చినట్లు చెబుతున్నారు.
- స్టాక్ ఎక్స్‌పోజర్ల కారణంగా స్టాక్ ఎక్ఛ్సేంజీలకు చెల్లించాల్సిన మొత్తాలు పెరిగిపోయాయి. బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించి కార్వీకి రావాల్సిన నగదును ఎస్క్రో ఖాతాలో ఎక్స్ఛేంజీలు జమ చేయడం కార్వీకి నగదు సంక్షోభంలోకి నెట్టాయని అభిప్రాయ పడుతున్నారు.

# ఎస్‌బీఐ ఎంసీఎల్ఆర్ 0.10% తగ్గింపు

**ఏడాదిలో ఇది ఎనిమిదోసారి**

ముంబై: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ఏడాది కాలపరిమితి గల ఎంసీఎల్ఆర్ రేటును 0.10 శాతం తగ్గించింది. ఇది మంగళవారం నుంచే అమలులోకి వస్తుంది. దీంతో ఎంసీఎల్ఆర్ ఆధారిత గృహ, కారు, రిటైల్ రుణాలపై వడ్డీ రేటు మరింతగా తగ్గుతుంది. ఈ తగ్గింపు అనంతరం ఏడాది కాలపరిమితి గల రుణాలపై ఎంసీఎల్ఆర్ 8 శాతం నుంచి 7.90 శాతానికి తగ్గుతుంది. ఎస్‌బీఐ ఎంసీఎల్ఆర్‌ను తగ్గించడం ఈ ఏడాదిలో వరుసగా ఎనిమిదోసారి. దేశంలో అతితక్కువ రేట్లకు రుణాలు అందిస్తున్న ఘనత తమ బ్యాంకుదేనని, తగ్గుతున్న నిధుల వ్యయాలను ఎప్పటికప్పుడు అందించడంలో తామే ముందుంటున్నామని ఎస్‌బీఐ తెలిపింది. గృహ, ఆటో రుణాల మార్కెట్‌లో తమ వాటా 25 శాతం ఉన్నట్టు బ్యాంకు తెలిపింది. అయితే ఎంసీఎల్ఆర్ రుణాలు ఏడాదికోసారి మాత్రమే సవరించాలనే నిబంధన కారణంగా తక్షణం ఈఎంఐలు తగ్గే ఆస్కారం లేదు. కొత్తగా రుణాలు తీసుకునే వారికి రెపో రేటు అనుసంధానిత రుణాలు కూడా ఎస్‌బీఐ అందిస్తోంది. రెపో రేటుతో అనుసంధానించిన రుణం తీసుకున్న వారికి ఆర్‌బీఐ సవరించినప్పుడల్లా వడ్డీ రేటు మారుతుంది. గత వారంలో జరిగిన సమావేశంలో ఆర్‌బీఐ రెపో రేటును 5.15 శాతం వద్ద యథాతథంగా ఉంచింది. సెప్టెంబరు 30వ తేదీ నాటికి ఎస్‌బీఐ రుణాల పరిమాణం రూ.22.5 లక్షల కోట్లు కాగా డిపాజిట్ల పరిమాణం రూ.30 లక్షల కోట్లుంది.

### బ్యాంక్ ఆఫ్ ఇండియా..

ఏడాది కాలపరిమితి కలిగిన ఎంసీఎల్ఆర్ ఆధారిత రుణ వడ్డీ రేట్లను 20 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించినట్లు బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) తెలిపింది. మంగళవారం నుంచి ఈ రేట్లు అమల్లోకి వస్తాయని పేర్కొంది. ఓవర్‌నైట్ రేట్లను 20 బేసిస్ పాయింట్లు, ఇతర కాలపరిమితి రేట్లను 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఏడాది కాలపరిమితి ఎంసీఎల్ఆర్‌ను 8.30 శాతం నుంచి 8.20 శాతానికి తగ్గించారు.

# జీతాల్లో జాప్యం.. పెరిగిన రుణ డిఫాల్ట్‌లు

**సమస్యగా మారిన వ్యాపారాల మూసివేత**

ముంబై: ఆర్థిక వ్యవస్థలో మందగమనం రిటైల్ రుణాల చెల్లింపులను దెబ్బతీస్తోంది. మందగమనంతో కొన్ని కంపెనీలు సిబ్బందికి జీతాల చెల్లింపుల్లోనూ సమస్యలు ఎదుర్కొంటున్నాయి. దీంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి ఉద్యోగులు తీసుకున్న రిటైల్ రుణాల చెల్లింపుల్లో వైఫల్యాలు (డిఫాల్ట్స్) పెరిగిపోతున్నాయి. ప్రస్తుత రిటైల్ రుణాల డిఫాల్ట్స్‌కు ఇదే ప్రధాన కారణమని పేటీఎంకు చెందిన ఫైనాన్షియల్ టెక్నాలజీ కంపెనీ 'క్రెడిట్‌మేట్' తన తాజా సర్వే నివేదికలో పేర్కొంది. ఈ సర్వే కోసం ఈ కంపెనీ గత ఆరు నెలల్లో 30 రాష్ట్రాల్లో 40 ఎన్‌బీఎఫ్‌సీలు, బ్యాంకులకు చెందిన రెండు లక్షల రిటైల్ రుణ ఖాతాలను పరిశీలించింది. ఆర్థిక మందగమనం నేపథ్యంలో బ్యాంకులు ఎక్కువగా రిటైల్ రుణాలపైనే దృష్టిపెట్టాయి. అయితే ఆర్థిక మందగమంతో రిటైల్ రుణాల వసూళ్లు కూడా కష్టంగా మారాయి. రిటైల్ రుణాల వసూళ్లను ఈ కింది అంశాలు ప్రధానంగా దెబ్బతీస్తున్నట్టు క్రెడిట్‌మేట్ పేర్కొంది.

- జీతాల చెల్లింపుల్లో ఆలస్యం (36 శాతం)
- కొన్ని వ్యాపారాల మూసివేత (29 శాతం)
- వైద్యపరమైన అత్యవసర ఖర్చులు (13 శాతం)
- ఉద్యోగాలు కోల్పోవడం (12 శాతం)
- ఉపాధి కోసం వలసలు (10 శాతం)
- రుణ చెల్లింపుల్లో పురుషుల కంటే మహిళలే నయం
- బకాయిల చెల్లింపుల్లోనూ ముందున్న మహిళలు
- డిఫాల్టర్లలో 82 శాతం మంది పురుషులే.



## సంక్షిప్తంగా...

**వాల్‌మార్ట్ :** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీలకు (ఎంఎస్ఎంఈ) చెందిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శిక్షణ ఇచ్చేందుకు వచ్చే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 25 శిక్షణా సంస్థలు ఏర్పాటు చేయనుంది. వాల్‌మార్ట్ 'వృద్ధి సరఫరాదారుల పథకం' పేరుతో ఈ కార్యక్రమం చేపడుతోంది. వాల్‌మార్ట్ అనుబంధ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌తో సహా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వ్యాపార సంస్థలకు వస్తువుల సరఫరా, ఇతర వ్యాపార మెళకువలు ఈ శిక్షణ కార్యక్రమంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు నేర్పుతారు.

**విస్తారా :** లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్‌తో కోడ్‌షేర్ ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం.. ఇరు సంస్థల ప్రయాణికులు.. రెండు సంస్థలకు చెందిన విమానాల్లో ప్రయాణించవచ్చు. పది భారత నగరాల మీదుగా విస్తారా నడుపుతున్న 18 విమానాలకు లుఫ్తాన్సా తమ 'ఎల్‌హెచ్' కోడ్‌ను జోడించనుంది.

**యమహా మోటార్ :** దేశీ మార్కెట్లోకి బీఎస్-6 ప్రమాణాలతో కూడిన వైజెడ్ఎఫ్-ఆర్15 వెర్షన్ 3.0 మోటార్‌సైకిల్ మోడల్‌ను విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.1.45 లక్షలు (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ). 155 సీసీ ఇంజన్ కలిగిన ఈ బైక్ ఈ నెల మూడో వారం నుంచి అందుబాటులో ఉంటుంది. మూడు రంగుల్లో అందుబాటులో ఉండే ఈ బైక్ ధర రూ.1.45 లక్షల నుంచి రూ.1.47 లక్షల వరకు ఉంది.

**హీరో మోటోకార్ప్ :** వచ్చే జనవరి నుంచి మోటార్‌సైకిళ్లు, స్కూటర్ల ధరలను రూ.2,000 వరకు పెంచనున్నట్టు ప్రకటించింది. మోడల్, మార్కెట్‌ను బట్టి ధరల్లో హెచ్చుతగ్గులుంటాయని తెలిపింది. అయితే ధరలను పెంచడానికి కారణాలను మాత్రం కంపెనీ వెల్లడించలేదు.

# పెట్టుబడులకు సౌదీ బెస్ట్

**8 గంటల్లో ట్రేడ్ లైసెన్స్.. 2 గంటల్లో వర్క్ పర్మిట్**

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో వ్యాపారం చేయాలనుకునేవారికి కేవలం మూడు పత్రాలతో ఆన్‌లైన్‌లో 8 గంటల వ్యవధిలోనే లైసెన్సులు మంజూరు చేస్తున్నామని సౌదీ అరేబియా రాయబారి సౌద్ అల్ సతి తెలిపారు. సోమవారంనాడిక్కడ ఫిక్కీ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోని ఔత్సాహిక వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ దేశంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాలని కోరారు. సౌదీ వాణిజ్య విధానంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని, ఇప్పుడు విదేశీయులకు కూడా 100 శాతం యాజమాన్య హక్కులను ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు సౌదీలో 267 విదేశీ సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించగా అందులో భారత కంపెనీలు 30 వరకు ఉన్నాయని చెప్పారు. అలాగే వీసా విధానంలోకూడా పలుమార్పులు తీసుకువచ్చినట్లు వెల్లడించారు. సౌదీలో సమారు 2 లక్షల మంది భారతీయులు పనిచేస్తున్నారని, ఇప్పుడు వర్క్ వీసాపై రావాలనుకునే వారికి నిబంధనలు సడలించామన్నారు. సౌదీ ప్రభుత్వం కేవలం 2 గంటల్లో వర్క్ వీసా అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు.



సౌద్ అల్ సతి

# వీసా సమస్యలపై హైసియా సమావేశం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఎదుర్కొంటున్న వీసా సమస్యలను హైదరాబాద్‌లోని యూఎస్ వీసా కాన్సులేట్ జనరల్‌లోని వీసా అధికారులు చర్చించారు. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాలపై అవగాహన కల్పించడానికి హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బీ-1, ఎల్-1, హెచ్-1బీ వీసాపై అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఇంటర్వ్యూ సమయంలో ఎదురవుతున్న సమస్యలు, కొంత మంది చేస్తున్న అవకతవకలపై కూడా చర్చ జరిగింది. 60 ఐటీ కంపెనీలకు చెందిన హెచ్ఆర్ అధిపతులు, ఇమ్మిగ్రేషన్ బృందాల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారని హైసియా ప్రెసిడెంట్ మురళీ బొల్లు తెలిపారు.

## సింగరేణి సీఎండీతో అమెరికన్ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ శ్రీధర్‌తో అమెరికన్ రీజినల్ ఎన్విరాన్‌మెంట్ అధికారుల బృందం భేటీ అయింది. సింగరేణి కాలరీస్ చేపడుతున్న మైనింగ్ పద్ధతులు, పర్యావరణహిత కార్యక్రమాల గురించి ఈ సందర్భంగా శ్రీధర్ వివరించారు. క్లీన్ కోల్ సరఫరా కోసం కోల్ వాషరీల ఏర్పాటు, వేస్ట్ మేనేజ్‌మెంట్ చర్యగా ఓవర్ బర్డెన్ నుంచి ఇసుక తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరంతరాయంగా ప్రభుత్వ సంస్థల ద్వారా కాలుష్య కారకాంశాలపై శాస్త్రీయ విశ్లేషణ, పర్యవేక్షణ, తదనుగుణంగా తీసుకొంటున్న జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అమెరికన్ రీజినల్ ఎన్విరాన్‌మెంట్ ప్రతినిధి సారా లిట్కే, అమెరికన్ కాన్సులేట్ జనరల్‌కు చెందిన అన్నె డి సిల్వా పాల్గొన్నారు.

## ముగింపు అనిశ్చితం

**టెక్ వ్యూ**

నిఫ్టీ ప్రారంభంలో 12000 వరకు వెళ్లినా ఇంట్రాడే రియాక్షన్ సాధించింది. చివరికి డే గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల నడుమన క్లోజ్ కావడం ట్రెండ్‌లో అనిశ్చితిని సూచిస్తోంది. టెక్నికల్‌గా ట్రెండ్‌లో పెద్ద మార్పేమీ లేదు. కాని ఇప్పటికీ స్వల్పకాలిక స్థాయిల కన్నా పైనే నిలిచి ఉంది. గత కొద్ది రోజులుగా మైనర్ కరెక్షన్ మా త్రం చోటు చేసుకుంది. మార్కెట్ ఇప్పటికీ 20 డిఎంఎ కన్నా దిగువనే ఉండడం స్వల్పకాలిక బలహీనతను సూచిస్తోంది.

**మంగళవారం స్థాయిలివే...**

**నిరోధం : 11980 మద్దతు : 11870**

- మరింత అప్‌ట్రెండ్ కోసం ఇంట్రాడే నిరోధం 11980 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో మైనర్ ఇంట్రాడే నిరోధం 12020. ఆ పైన క్లోజయినప్పుడే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది.
- బలహీనత ప్రదర్శించి ఇంట్రాడే మద్దతు స్థాయి 11870 కన్నా దిగజారితే మైనర్ బలహీనతను సూచిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 11800.

■ వి.సుందర్ రాజా

# 'రియల్టీ' కుబేరుడు లోఢా

- రూ.32,000 కోట్ల సంపదతో నెంబర్ వన్ స్థానం
- హురున్ 'స్థిరాస్తి శ్రీమంతుల జాబితా' విడుదల
- మై హోమ్ అధినేత రామేశ్వర రావు కుటుంబం, అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ ప్రమోటర్లకు జాబితాలో చోటు

*ప్రస్తుతం భారత రియల్టీ రంగం విక్రయాల మందగమనం నుంచి ద్రవ్య కొరత వరకు పలు సవాళ్లు ఎదుర్కొంటోంది. అయినప్పటికీ ఈ రంగంలోని ప్రముఖ వ్యాపారవేత్తల సంపద పెరుగుతూనే ఉండటం గమనార్హం. ఈ వంద మంది శ్రీమంతుల సంపద సరాసరిగా 16 శాతం పెరిగింది.*


మంగళ్ ప్రభాత్ లోఢా


రాజీవ్ సింగ్

న్యూఢిల్లీ: భారత స్థిరాస్తి రంగంలోని 100 మంది కుబేరుల జాబితాను విడుదల చేసింది హురున్. 2019 సంవత్సరానికి గాను విడుదలైన ఈ లిస్ట్‌లో లోఢా డెవలపర్స్ (ప్రస్తుతం మాక్రోటెక్ డెవలపర్స్) వ్యవస్థాపకుడు మంగళ్ ప్రభాత్ లోఢా అగ్రస్థానంలో నిలిచారు. ఆయన ఆస్తి రూ.31,960 కోట్లు. లోఢాకు అగ్రస్థానం దక్కడం వరుసగా ఇది రెండో ఏడాది. ఆయన కుటుంబ సంపద ఈ ఏడాదిలో 18 శాతం పెరిగింది. హురున్ రియల్టీ రిచ్ లిస్ట్‌లో డీఎల్ఎఫ్ వైస్ ఛైర్మన్ రాజీవ్ సింగ్, ఎంబసీ గ్రూప్ వ్యవస్థాపకుడు జితేంద్ర విర్వానీకి వరుసగా 2,3 స్థానాలు దక్కాయి. గత ఏడాదితో పోలిస్తే ఒకస్థానం ఎగబాకిన రాజీవ్ సింగ్ ఆస్తి రూ.25,080 కోట్లు. గడిచిన ఏడాది కాలంలో 42 శాతం వృద్ధి చెందింది. జితేంద్ర విర్వానీ సంపద రూ.24,750 కోట్లుగా నమోదైంది. హురున్ నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- 2019 సెప్టెంబరు చివరినాటికి ఆయా వ్యక్తులు రియల్టీ వ్యాపారం ద్వారా ఆర్జించిన ఆస్తుల ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. లిస్టెడ్ కంపెనీలైతే, వాటి మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆధారంగా వారి వ్యక్తిగత సంపదను లెక్కగట్టారు. అన్ లిస్టెడ్ కంపెనీల విషయంలో ఆర్థిక నివేదికలను పరిగణనలోకి తీసుకోవడం జరిగిందని హురున్ వెల్లడించింది.
- హీరానందాని కమ్యూనిటీస్ గ్రూప్‌నకు చెందిన నిరంజన్ హీరానందానికి ఈ జాబితాలో 4వ స్థానం లభించింది. ఆయన ఆస్తి రూ.17,030 కోట్లు. కే రహేజా గ్రూపునకు చెందిన చంద్రు రహేజా అండ్ ఫ్యామిలీ రూ.15,480 కోట్ల ఆస్తితో 5వ స్థానంలో నిలిచింది.
- ఒబెరాయ్ రియల్టీ ఛైర్మన్, ఎండీ వికాస్ ఒబెరాయ్ రూ.13,910 కోట్ల ఆస్తితో 6వ స్థానంలో ఉన్నారు. బాగ్మణే డెవలపర్స్‌కు చెందిన రాజా బాగ్మణేకు (రూ.9,960 కోట్ల ఆస్తి) 7వ స్థానం, హౌస్ ఆఫ్ హీరానందనీకి చెందిన సురేంద్ర హీరానందనికి(రూ.9,720 కోట్లు) 8వ స్థానం లభించాయి.
- జాబితాలోని వంద మంది శ్రీమంతుల మొత్తం సంపద రూ.2,77,080 కోట్లుగా నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే 17 శాతం పెరిగింది.
- ఈ లిస్ట్‌లోని టాప్-10 ర్యాంకింగ్స్‌లో ఆరుగురు ముంబైకి చెందినవారే. మొత్తం వంద మందిలో 37 మంది ముంబై వారున్నారు. ఢిల్లీ, బెంగళూరు నుంచి 19 మంది చొప్పున ఈ జాబితాలో చోటు సంపాదించుకోగలిగారు.
- జాబితాలోని వంద మంది శ్రీమంతుల మొత్తం సంపద రూ.2,77,080 కోట్లుగా నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే 17 శాతం పెరిగింది.
- ఈ జాబితాలోని 59 శాతం మంది మొదటి తరం పారిశ్రామికవేత్తలే.
- లిస్ట్‌లో 8 మంది మహిళా పారిశ్రామికవేత్తలున్నారు. స్థిరాస్తి రంగానికి చెందిన అత్యంత ధనిక మహిళగా గోద్రేజ్ ప్రాపర్టీస్‌కు చెందిన స్మితా వీ క్రిష్ణ అగ్రస్థానంలో ఉన్నారు.

## హురున్ జాబితాలో తెలుగువారు

| పేరు | ఆస్తి (రూ.కోట్లు) | స్థానం | కంపెనీ |
|---|---|---|---|
| సీ వెంకటేశ్వర రెడ్డి | 2,590 | 25 | అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ |
| ఎస్ సుబ్రమణ్యం రెడ్డి | 2,570 | 27 | అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ |
| జూపల్లి రాము రావు | 740 | 52 | మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్ |
| జూపల్లి రంజిత్ రావు | 740 | 52 | మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్ |
| జూపల్లి శ్యామ్ రావు | 740 | 52 | మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్ |
| జూపల్లి వినోద్ | 740 | 52 | మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్ |
| జూపల్లి రామేశ్వర్ రావు | 710 | 58 | మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్ |
| జీవీకే రెడ్డి కుటుంబం | 610 | 65 | తాజ్ జీవీకే |

## హైదరాబాద్ నుంచి 8 మంది

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం నుంచి 8 మందికి ఈ జాబితాలో చోటు దక్కింది. అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్‌కు చెందిన సీ వెంకటేశ్వర రెడ్డి, ఎస్ సుబ్రమణ్యం రెడ్డి అగ్రస్థానాల్లో ఉన్నారు. మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రమోటర్ కుటుంబం మొత్తం రూ.3,670 కోట్ల ఆస్తితో తరువాత స్థానంలో ఉంది. 33 ఏళ్ల జూపల్లి రాము రావు, శ్యామ్ రావు ఈ జాబితాలోని వ్యక్తుల్లో అత్యంత పిన్న వయస్కులు.


రామేశ్వర్ రావు

## టై గ్లోబల్ బోర్డులో కాళీ ప్రసాద్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టై గ్లోబల్ బోర్డులో సభ్యుడిగా ద ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (టై) హైదరాబాద్ చాప్టర్ మాజీ ప్రెసిడెంట్ కాళీ ప్రసాద్ గడిరాజు ఎంపిక అయ్యారు. 2020 జనవరి ఒకటి నుంచి రెండేళ్లపాటు ఆయన ఈ బాధ్యతలు నిర్వహిస్తారు.

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 80 | విజయవాడ | 91 |
| వరంగల్ | 80 | గుంటూరు | 90 |
| మహబూబ్‌నగర్ | 80 | ఒంగోలు | 93 |
| కరీంనగర్ | 80 | చిత్తూరు | 80 |
| కర్నూలు | 80 | నెల్లూరు | 80 |
| విశాఖపట్నం | 90 | అనంతపురం | 74 |
| గోదావరి | 88 | | |



## బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 37,940 | 38,600 | 38,960 | 38,600 | 37,850 |
| క్రితం ముగింపు | 38,240 | 38,670 | 39,350 | 38,800 | 37,930 |
| 22 క్యారెట్లు | 36,190 | 35,750 | 36,840 | 35,780 | 36,050 |
| క్రితం ముగింపు | 36,420 | 35,850 | 36,200 | 35,870 | 36,120 |
| వెండి (కిలో) | 43,600 | 44,500 | 44,500 | 44,500 | 46,600 |
| క్రితం ముగింపు | 43,500 | 44,600 | 45,400 | 44,600 | 46,600 |

## ఉదయం సెషన్ మెరుగు

**ఆస్ట్రో వ్యూ**

**తిథి:** మార్గశిర శుక్ల చతుర్దశి; నక్షత్రం: కృత్తిక

**అప్రమత్తం:** ఆర్ద్ర, స్వాతి, శతభిషం నక్షత్ర జాతకులు, మిథున, తుల రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 11.15**

**ధోరణి:** నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడగా/మెరుగ్గా ప్రారంభమై 10.15 నుంచి 1.30 వరకు మెరుగ్గా ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత చివరి వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం:** నిఫ్టీ ఫ్యూచర్స్ 10.15 సమయానికి ఎటిపి కన్నా పైన ఉంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవచ్చు.

**నిరోధం : 11980, 12015**

**మద్దతు స్థాయిలు : 11900, 11865**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంత కన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్100 గుడ్లు)**

| | | | |
|---|---|---|---|
| 9వ తేదీకి.. | | విజయవాడ | 454 |
| హైదరాబాద్ | 431 | విశాఖపట్నం | 470 |
| 10వ తేదీకి.. | | వరంగల్ | 434 |
| చిత్తూరు | 453 | డజను గుడ్లు రూ. 66 | |
| గోదావరి | 454 | | |






## 17 దాకా అసెంబ్లీ

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాసనసభ శీతాకాల సమావేశాలు ఏడు రోజులు జరుగనున్నాయి. 12-15 రోజులు జరుపుదామనుకున్నామని.. కానీ 18న 15వ ఆర్థిక సంఘం రాష్ట్రానికి వస్తోందని ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. సోమవారం స్పీకర్ చాంబర్లో బీఏసీ సమావేశం జరిగింది. జగన్, ప్రతిపక్ష నేత చంద్రబాబు తరపున టీడీఎల్పీ ఉపనేత అచ్చెన్నాయుడు, మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కురసాల కన్నబాబు, పి.అనిల్‌కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆర్థిక సంఘం చైర్మన్ రాష్ట్ర పర్యటనకు వస్తుంటే.. ముఖ్యమంత్రిగా తాను అందుబాటులో లేకపోతే ఏం బాగుంటుందని జగన్ అన్నారు. ఫిబ్రవరిలో బడ్జెట్ సమావేశాలు 45 రోజులు జరుగుతాయని.. ఇప్పుడు ఏడు రోజులు చాలని అభిప్రాయపడ్డారు. సోమవారం నుంచి ఈ నెల 17 వరకూ సమావేశాలు నిర్వహిద్దామన్న సీఎం ప్రతిపాదనకు సభాపతి తమ్మినేని సీతారాం ఆమోద ముద్ర వేశారు. శని, ఆదివారాల్లో (14, 15 తేదీల్లో) సమావేశాలకు సెలవు.


స్పీకర్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో సీఎం జగన్, మంత్రులు, అచ్చెన్నాయుడు

### అచ్చెన్నా ఏమైంది?

ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన అచ్చెన్నాయుడు.. చేతికి బ్యాండేజీతో బీఏసీకి హాజరయ్యారు. జగన్ ఆయన్ను చూసి.. అచ్చెన్నా ఏమైందని పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందని ఆరా తీశారు. దాని గురించి అచ్చెన్నాయుడు వివరించారు. జాగ్రత్త తీసుకోవాలని సీఎం సలహా ఇచ్చారు. శ్రీకాంత్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ.. 'చూశావా.. ముఖ్యమంత్రి జగన్ మనస్సు ఎంత దొడ్డదో! పార్టీలకు అతీతంగా అందరిపట్లా ప్రేమాభిమానాలు కురిపిస్తారు' అని అచ్చెన్నతో అన్నారు.

### హెరిటేజ్ ఉల్లిపై సీఎం ఆరా

ఉల్లి ధరలపై శాసనసభలో చర్చిద్దామని అచ్చెన్న ప్రతిపాదించారు. హెరిటేజ్‌లో ఉల్లి ధర ఎంతని జగన్ ప్రశ్నించారు. కిలో రూ.180కి అమ్ముతున్నారని శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. రైతు బజారులో ఎంతకు అమ్ముతున్నామని సీఎం అడుగగా.. రూ.25కి అమ్ముతున్నామని ఆయన తెలిపారు. బహిరంగ మార్కెట్లో, హెరిటేజ్‌లో రూ.180 అయితే.. మనం రైతు బజారులో రూ.25కే ఇస్తున్నామని జగన్ అన్నారు.

### ఏబీఎన్‌పై నిషేధమెందుకు?

అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్ష ప్రసారం చేయకుండా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, టీవీ-5, ఈటీవీలపై ఎందుకు నిషేధం విధించారని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ఈ చానళ్లు నిబంధనలు ఉల్లంఘించాయని జగన్ తెలిపారు. ఉరి తీసే ముందు ఖైదీని కూడా వివరణ కోరతారని.. నిషేధం విధించిన చానళ్ల నుంచి వివరణ ఎందుకు తీసుకోలేదని అచ్చెన్న అడిగారు. వారి నుంచి వివరణ తీసుకుంటానని స్పీకర్ చెప్పడంతో ఈ సంభాషణ అంతటితో ముగిసింది.

# ఉల్లిపై లొల్లి

**కిలో 25కి ఇస్తోంది మనమే!.. దేశంలో ఏ రాష్ట్రమూ ఇవ్వడం లేదు**





'దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి రైతు బజారులో కిలో ఉల్లి రూ.25కే మన రాష్ట్రంలోనే విక్రయిస్తున్నాం.'

'మహిళల భద్రతపై చట్టాలు సవరించాలి. లోతైన చర్చ జరిపి ఈ సమావేశాల్లోనే చట్టం తెస్తాం.'



- ముందు మహిళల భద్రతపై చర్చిద్దాం
- ఆ తర్వాతే ఉల్లి ధరలపై మాట్లాడదాం
- అసెంబ్లీలో సీఎం జగన్ వెల్లడి
- అంగీకరించని టీడీపీ సభ్యులు

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశం మొత్తమ్మీద ఆంధ్రప్రదేశ్‌లోనే ఉల్లి ధర తగ్గించి ప్రభుత్వం విక్రయిస్తోందని, కిలో రూ.25కి ఉల్లి విక్రయించే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఒక్కటేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీ శీతాకాల సమావేశాల మొదటి రోజున ఉల్లిపై అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదాలతో సభ దద్దరిల్లింది. ఉల్లి ధరల పెరుగుదలపై చర్చ జరపాలని టీడీపీ, మహిళల భద్రతకు సంబంధించి చర్చ మొదట ప్రారంభించాలని అధికారపక్షం వాగ్వాదాలతో అసెంబ్లీ దద్దరిల్లింది. బీఏసీ సమావేశం ఏర్పాటు చేసి ఆ తర్వాత సభను 11.42 నిమిషాలకు తిరిగి ప్రారంభించిన వెంటనే టీడీపీ సభ్యురాలు ఆదిరెడ్డి భవాని, ఇతరులు ఇచ్చిన వాయిదా తీర్మానాలను తిరస్కరించినట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రకటించారు. దీంతో టీడీపీ సభ్యులు ప్లకార్డులతో పోడియం ముందుకు వెళ్లి ఉల్లి ధరలపై చర్చ జరపాలని నినాదాలిచ్చారు. హోంమంత్రి సుచరిత మహిళలపై నేరాలకు సంబంధించి ప్రకటన చేస్తున్న సందర్భంలో వారు నిరసనలతో హోరెత్తించారు. దీంతో అధికారపక్ష సభ్యులు కూడా నినాదాలకు దిగడంతో గందరగోళంగా మారింది. ముఖ్యమంత్రి లేచి మహిళల భద్రత ముఖ్యమైన అంశమంటూ హోం మంత్రి ప్రకటనను అడ్డుకోవడాన్ని తప్పుపట్టారు. 'దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి రైతు బజారులో కిలో ఉల్లి రూ.25కే మన రాష్ట్రంలోనే విక్రయిస్తున్నాం. ఉల్లి ధరలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. అంతకంటే ముందు ప్రాధాన్యం కలిగిన మహిళల భద్రతపై చర్చిద్దాం. ఇప్పటి వరకు 36,536 క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేసి విక్రయించాం. చంద్రబాబు హయాంలో ఉల్లి రైతులు గిట్టుబాటు లేక పొలాల్లో వదిలేసే పరిస్థితి ఉండేది. మేం గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వినియోగదారుడికి ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తున్నాం. చంద్రబాబు హెరిటేజ్‌లో ఉల్లి కిలో రూ.200కి విక్రయిస్తున్నారు' అని తెలిపారు. సీఎం మాట్లాడుతున్నప్పుడు నినాదాలు కాస్త ఆపిన టీడీపీ సభ్యులు హోంమంత్రి తిరిగి ప్రకటన ప్రారంభించగానే.. పోడియం వద్దకు వెళ్లి ఉల్లి ధరలపై చర్చించాలని పట్టుపట్టారు. చర్చకు సీఎం అంగీకరించారని, ముందు మహిళల సమస్యలపై చర్చించాలని స్పీకర్ సూచించారు. ఇదే సమయంలో రోజాతో పాటు వైసీపీ మహిళా ఎమ్మెల్యేలు పోడియం వద్దకు వచ్చి వాగ్వాదానికి దిగారు. టీడీపీ సభ్యులు ఉల్లిపాయలతో గిఫ్ట్ ప్యాకెట్‌ను తెచ్చి స్పీకర్ టేబుల్ వద్ద పెట్టగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు లేచి మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరినా.. స్పీకర్ అటువైపు చూడలేదు. ఈలోపు వైసీపీ సభ్యురాలు విడదల రజని(చిలకలూరిపేట)ని మాట్లాడాలని సూచించడంతో ఆమె మాట్లాడటం ప్రారంభించారు. టీడీపీ సభ్యులు మళ్లీ నినాదాలు కొనసాగించారు. వైసీపీ మహిళా ఎమ్మెల్యేలు కూడా స్పీకర్ పోడియం వద్ద నినాదాలిచ్చారు.

### ప్రతి మహిళకు జగన్‌పై నమ్మకముంది: రోజా

ఈలోపు సీఎం.. రోజాకు ఏవో సూచనలు ఇవ్వడం కనిపించింది. ఆ తర్వాత ఆమె మాట్లాడుతూ.. మహిళా భద్రతపై ముఖ్యమంత్రి ఎలాంటి చట్టం తీసుకొస్తారోనని రాష్ట్రంలోని మహిళలు ఆశగా ఎదురుచూస్తున్నారని, ప్రతి మహిళకు జగనన్నపై నమ్మకముందన్నారు. 'మహిళల భద్రతపై చర్చ జరిగితే లోకేశ్‌పై సోషల్ మీడియాలో వచ్చిన ఫోటోలు బయటకొస్తాయని, బాలకృష్ణ మహిళలపై చేసిన వ్యాఖ్యలు చర్చకొస్తాయని, కాల్‌మనీ గురించి మాట్లాడతారేమోనని చంద్రబాబు భయపడుతున్నారు. ఉల్లి లేకుంటే ప్రాణాలు పోతాయా? లోకేశ్ పప్పులోకి ఉల్లి లేదని బాధపడుతున్నారా? టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కాల్‌మనీ కేసులు పెట్టి 200 కుటుంబాలను వ్యభిచార కూపంలోకి దించారు. జన్మనిచ్చిన ఆడదాని భద్రతపై చర్చిస్తుంటే అడ్డుకుంటున్న మీరు అన్నం తింటున్నారా.. గడ్డి తింటున్నారా? ఆడవాళ్లకు కష్టమొస్తే గన్ కంటే ముందు జగన్ వచ్చి రక్షిస్తారని మహిళలు భావిస్తున్నారు. ఆడపిల్లలను ఏమన్నా అనాలంటే మగాళ్లలో వణుకు పుట్టాలి. ఏపీ అంటే ఆడవాళ్ల ప్రదేశ్‌గా మారాలి' అని పేర్కొన్నారు. దిశ హత్యపై మానవహక్కుల కమిషన్ స్పందనను రోజా తప్పుపట్టారు. ఆడవారిని మానభంగం చేసి చంపిన వారిని రెండు బెత్తం దెబ్బలు వేస్తే సరిపోతుందని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను విమర్శించారు. స్పీకర్ జోక్యం చేసుకుని.. సభలో లేని వారి ప్రస్తావన వద్దనడంతో వారి పార్టీకి చెందిన సభ్యుడు ఉన్నారని, వారి ద్వారా తెలియజేస్తున్నామని రోజా బదులిచ్చారు. కాల్‌మనీ సెక్స్‌రాకెట్ గురించి మాట్లాడినందుకు ఏడాది పాటు తనను సభ నుంచి సస్పెండ్ చేశారని చంద్రబాబును ఉద్దేశించి ధ్వజమెత్తారు. ఆడపిల్లల విషయంలో జగనన్న నిర్ణయం సైరా జగన్మోహన్‌రెడ్డిలా ఉంటుందని ఎమ్మెల్యేలు అభిప్రాయపడుతున్నారని తెలిపారు.

## ఉల్లిపై బాబుది రాద్ధాంతం: మంత్రి మోపిదేవి



ఉల్లి ధరలపై విపక్ష నేత చంద్రబాబు రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి మోపిదేవి వెంకటరమణ విమర్శించారు. చంద్రబాబుకు చెందిన హెరిటేజ్‌లో కిలో ఉల్లిని రూ.135 అమ్ముతున్నారని ధ్వజమెత్తారు. బాబు హయాంలో రాయితీపై ఎప్పుడైనా ఉల్లి ఇచ్చారా? అని ప్రశ్నించారు. సోమవారం సచివాలయంలో మంత్రి మాట్లాడారు. ఉల్లిని రాయితీపై విక్రయిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనేనని చెప్పారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణలో రైతు బజార్ల ద్వారా కిలో రూ.45కు ఉల్లిపాయలు విక్రయిస్తుంటే.. తమిళనాడు, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల్లో రూ.160 నుంచి రూ.200 వరకు ధర పలుకుతోందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా కోల్డ్‌స్టోరేజ్‌లు ఏర్పాటు చేసి ఉల్లి తదితరాలను నిల్వ ఉంచుతామని చెప్పారు.

# చేతగాని ప్రభుత్వం

- ఉల్లి ధరను నియంత్రించలేకపోయింది
- టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజం
- ఉల్లిపై అసెంబ్లీ వద్ద విపక్ష నేతల ఆందోళన
- మెడలో ఉల్లి దండలు వేసుకుని నిరసన
- అసెంబ్లీ ప్రధాన ద్వారం వరకు పాదయాత్ర
- లోనికి అనుమతించని పోలీసులు.. వాగ్వాదం

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కోస్తే కాదు.. కొనేందుకే కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి ధరలపై సోమవారం అసెంబ్లీ సమావేశాల తొలి రోజే ప్రధాన ప్రతిపక్షం టీడీపీ జగన్ ప్రభుత్వాన్ని నిలదీసింది. ధరలను నియంత్రించడంలో సర్కారు పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టింది. ఉల్లి దండలు మెడలో వేసుకుని టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ ఫైర్ స్టేషన్ సమీపంలో నిరసన తెలిపారు. ఉల్లి ధరలు తగ్గించాలని నినదిస్తూ చంద్రబాబుతోపాటు వారంతా ఫైర్ స్టేషన్ నుంచి పాదయాత్రగా అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్దకు చేరుకుని లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, ఉల్లి దండలను, ప్లకార్డులను సభలోకి అనుమతించబోమంటూ పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై ఎమ్మెల్యేలు స్పందిస్తూ సభలోకి ఉల్లిపాయలు తీసుకెళ్లబోమని, టీడీపీ కార్యాలయంలోకి తీసుకెళ్తున్నామని చెప్పారు. అయినా పోలీసులు వినిపించుకోలేదు. దీంతో ఇరు పక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇంతలో సభలో ప్రశ్నోత్తరాలు ప్రారంభమవుతున్నాయని, లోపలికి అనుమతించాలని టీడీపీ సభ్యులు పట్టుబట్టడంతో పోలీసులు చంద్రబాబుతోపాటు అందరినీ అసెంబ్లీలోకి అనుమతించారు.

### మా హయాంలో ఇలానే చేశామా?

అసెంబ్లీ ఫైర్ స్టేషన్ వద్ద చేపట్టిన నిరసనలో చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజలు ఉల్లి కోసం వెళ్లి క్యూలలో నిలబడి సొమ్మసిల్లి పడిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుబజార్ల చుట్టూ రెండు మూడు రోజులు తిరుగుతున్నా ఉల్లి లభించక సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఉల్లి కిలో రూ.200కి అమ్మడం ఎంత దుర్మార్గమో ఆలోచించాలన్నారు. ఈ సందర్భంగా తక్కెడలో ఒక వైపు బంగారం, మరో వైపు ఉల్లిపాయలు పెట్టి రెండూ సమానమేనని చూపించారు. టీడీపీ హయాంలో నిత్యావసర ధరలు పెరగకుండా చర్యలు తీసుకున్నామని, సబ్సిడీపై రేషన్ షాపుల ద్వారా అందించామని చెప్పారు. ఉల్లి ధరలు దిగివచ్చేవరకు టీడీపీ పోరాటం కొనసాగుతుందన్నారు. వాయిదా తీర్మానం కింద ప్రభుత్వం ఉల్లి సమస్యపై చర్చించి పరిష్కరించాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

### టీడీపీ సభ్యుల వైపే వంశీ

తెలుగుదేశం పార్టీ తరపున గెలిచి ఆ పార్టీకి దూరంగా ఉంటున్న గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ... సోమవారం అసెంబ్లీలో టీడీపీ సభ్యులవైపే కనిపించారు. అయితే వారితో మాట్లాడకుండా, కొంచెం దూరంగా, వెనుక ఒక బెంచీమీద ప్రత్యేకంగా కూర్చున్నారు. ప్రశ్నోత్తరాల అనంతరం సభ ప్రారంభమైన తర్వాత... మాట్లాడడానికి తనకు అవకాశమివ్వాలని లేచి నిలబడ్డారు. ఆయనకు చాన్సివ్వాలని వైసీపీ సభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బిగ్గరగా స్పీకర్‌ను కోరారు. గందరగోళం సద్దుమణిగిన తర్వాత అవకాశమిస్తామని స్పీకర్ స్పందించారు.

## జనవరిలో డీఎస్సీ

- ఉద్యోగాల కేలండర్‌లో భాగంగా నోటిఫికేషన్
- ఈ భర్తీ లోగా విద్యావలంటీర్ల నియామకం
- అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రి సురేశ్ ప్రకటన



అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి వచ్చే జనవరిలో కేలండర్ ప్రకటిస్తామని, అందులో భాగంగానే ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకానికి డీఎస్సీ ఉంటుందని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ చెప్పారు. ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ ఉంటుందా? అని వైసీపీ సభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి సోమవారం అసెంబ్లీలో ప్రశ్నించగా... మంత్రి ఈ మేరకు సమాధానం చెప్పారు. 2018 డీఎస్సీపై కొన్ని కోర్టు కేసులున్నాయని, అవి పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఈ లోగా తగినంత నిష్పత్తిలో ఉపాధ్యాయులు ఉండేలా చూసేందుకు విద్యావలంటీర్లను నియమిస్తామన్నారు. ఈ సంఖ్య సుమారుగా 7900 ఉండే అవకాశముంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక 12వేల మంది భాషా పండితులకు పదోన్నతులు కల్పించిందన్నారు. వందశాతం అక్షరాస్యత అనే నినాదాన్ని ముఖ్యమంత్రి జగన్ ఒకడుగు ముందుకేసి వందశాతం ఆంగ్ల అక్షరాస్యత అంటున్నారని చెప్పారు. అనంతరం ఆళ్ల మాట్లాడుతూ... ప్రతి పాఠశాలకు నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని కోరారు. పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడాన్ని సమర్థిస్తున్నట్లు చెప్పారు.

# హోదా తెచ్చారా?

- మెడలు వంచుతామని నడుములు వంచేశారు!: టీడీపీ
- ప్యాకేజీ ముద్దని మీలా స్వీట్లు పంచుకోలేదు: వైసీపీ
- శాసనసభలో అధికార, ప్రతిపక్షాల వాగ్వాదం



అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇరవై రెండు మంది ఎంపీలను ఇస్తే, కేంద్రం మెడలు వంచైనా రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తామన్నారని, ఆ తర్వాత స్వార్థం కోసం కేంద్రం ముందు నడుములు వంచేశారని అధికార పక్షాన్ని తెలుగుదేశం తూర్పారబట్టింది. సోమవారం శాసనసభలో ప్రత్యేక హోదాపై వాడీవేడిగా వాదోపవాదాలు కొనసాగాయి. హోదాతోపాటు, తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తుల పంపకంపై టీడీపీ సభ్యులు శాసనసభలో ప్రశ్నించారు. దీనిపై మంత్రి కన్నబాబు జవాబిస్తూ 'ఏపీ పునర్విభజన చట్టం-2014లోని షెడ్యూలు-9, 10లలో చేర్చిన సంస్థల విభజనపై మా ప్రభుత్వం తెలంగాణతో సామరస్యంగా వెళ్తోంది. ప్రత్యేక హోదా కోసం కేంద్రాన్ని ముఖ్యమంత్రి అడుగుతున్నారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలోనూ ప్రత్యేక హోదా ఇవ్వాలని జగన్ డిమాండ్ చేశారు. శాసనసభలోనూ తీర్మానం చేశాం. 15వ ఆర్థిక సంఘానికి ఇచ్చిన మెమోరాండంలోనూ హోదా కచ్చితంగా ఇవ్వాలన్నాం' అని పేర్కొన్నారు. దీనిపై టీడీపీ సభ్యుడు అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ 'అధికారంలోకి రాగానే హైదరాబాద్‌లోని సచివాలయ భవనాలు తెలంగాణకు అప్పగించేశారు. పార్లమెంటులో మీ ఎంపీ వంగా గీత అడిగిన ప్రశ్నకు...ఇటీవలి కాలంలో హోదాపై ఏపీ నుంచి అడిగిందే లేదని కేంద్రం సమాధానమిచ్చింది. మీరు హోదా కోసం మెడలు వంచుతామని చెప్పి, నడుములు వంచేశారు' అని విమర్శించారు. దీనిపై కన్నబాబు ప్రతిస్పందించారు. 'హోదా వద్దు.. ప్యాకేజీయే ముద్దని స్వీట్లు పంచుకుంది, కోడలు కొడుకును కంటే అత్త వద్దంటుందా? అన్నదీ టీడీపీయే. హోదా అనే హక్కే మీకులేదు. హైదరాబాద్ మీద పదేళ్లు హక్కుండగా, ఓటుకు నోటు కేసులో ఇరుక్కుని పారిపోయి వచ్చేశారు. టీడీపీ హయాంలో హైదరాబాద్ సచివాలయ భవనాలను తెలంగాణ ప్రభుత్వం బలవంతంగా తీసుకుంటే ఏం చేశారు? ఎన్నికల ముందు మోదీని తిట్టారు. సోనియాతో భేటీ అయ్యారు. ఇప్పుడు పిట్టకథలు చెప్తున్నారు' అని ఎద్దేవా చేశారు.

### వీడియోలు చూపించండి: అచ్చెన్న..

టీడీఎల్పీ ఉప నేత అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 'మీరు ప్రతిదానికీ అసెంబ్లీలో వీడియో ప్రదర్శిస్తారు కదా! 22 మంది ఎంపీలను ఇస్తే హోదా తెస్తాం అన్నారా? లేదా? కేంద్రం మెడలు వంచైనా హోదా తెస్తాం అన్నారా? లేదా? వీడియో చూపించండి. హైకోర్టులో కొట్టేసిన ఓటుకు నోటు కేసు గురించి సభలో మంత్రి మాట్లాడటం ఏంటి? ఏపీకి చెందిన విద్యుత్ ఉద్యోగులు తెలంగాణకు కేటాయింపు అయితే, వారిని కార్యాలయాలకు రానివ్వలేదు. గేట్లు మూసేసి అవమానించారు. అయినా, సచివాలయ భవనాలను ఈ ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చేసింది' అని విమర్శించారు.

## చంద్రబాబే పిల్లకాయ

- ఖర్చు తగ్గించేందుకే పీపీఏలపై సమీక్ష
- అసెంబ్లీలో బుగ్గన

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై శాసనసభలో జరిగిన చర్చ అధికార, ప్రతిపక్షాల మధ్య వాదోపవాదాలకు దారితీసింది. రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గించేందుకే విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై సమీక్షకు కమిటీ వేశామని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రకటించారు. పునరుత్పాదక విద్యుత్‌కు తామేమీ వ్యతిరేకం కాదన్న బుగ్గన.. అధిక ధరకు ఒప్పందాలు చేసుకోవడంపైనే అభ్యంతరమని పేర్కొన్నారు. మంత్రి మాట్లాడాక... చంద్రబాబుకి అవకాశమివ్వాలని టీడీపీ ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. మరో సందర్భంలో, మరో రూపంలో అవకాశం ఇస్తామని సభాపతి పేర్కొన్నారు. జోక్యం చేసుకొన్న వైసీపీ ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి... క్వశ్చన్ అవర్‌లో చర్చకు అవకాశం ఇచ్చే సంప్రదాయం లేదన్నారు. ఈ దశలో చంద్రబాబుకు మైక్ ఇవ్వకున్నా మాట్లాడారు. దానిపై వైసీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు స్పందించారు. శాసనసభ్యులను పిల్లకాయలన్న చంద్రబాబే పిల్లకాయ అని విమర్శించారు.

## రుణమాఫీ చేయలేకపోయారు

- టీడీపీకి రైతులపై చిత్తశుద్ధి లేదు: కన్నబాబు

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాల పరిమితిలో రూ.24 వేల కోట్ల రుణమాఫీ చేయలేకపోయిందని వ్యవసాయ మంత్రి కన్నబాబు ఆరోపించారు. రాష్ట్రంలో రైతుల రుణ విమోచన పథకం కింద గత బకాయిలను, చెల్లింపుల ఉత్తర్వులను ప్రభుత్వం రద్దు చేసిన విషయంపై శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. గత ప్రభుత్వ హామీ అయిన రైతు రుణమాఫీ బకాయిలను తాము చెల్లించబోమని వైసీపీ ప్రభుత్వం చెప్పడం కరెక్టు కాదని అశోక్‌బాబు అన్నారు. రుణాలకు సంబంధం లేనప్పుడు ప్రభుత్వ ఆస్తులు అమ్ముకునేందుకు ఎలా సిద్ధపడుతున్నారని ప్రశ్నించారు. కన్నబాబు బదులిస్తూ.. రూ.86 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో చెప్పి చంద్రబాబు.. ఎన్నికల తర్వాత రూ.24 వేల కోట్లకు కుదించారని.. అందులోనూ రూ.17 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని.. చివరి 4,5 విడతలకు కనీసం నిధులివ్వలేదని అన్నారు. రుణమాఫీ బకాయిలు ఉండగానే అన్నదాతా సుఖీభవ పథకాన్ని ఎందుకు తెచ్చారని ప్రశ్నించారు. టీడీపీకి రైతుల కష్టాలు, ఇబ్బందులపై చిత్తశుద్ధి లేదన్నారు.

### మీడియా పాయింట్

**జగన్ పథకాల పేర్లు చెబితే..**

## రాజకీయాలకు గుడ్‌బై

- చీఫ్ విప్ శ్రీకాంత్‌రెడ్డి



అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల పాలనలో సీఎం జగన్ అమలు చేసిన పథకాల పేర్లేమిటో ప్రతిపక్ష నేతలు చెబితే.. తాను రాజకీయాల నుంచి తప్పుకొంటానని ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి సవాల్ చేశారు. వైసీపీ పాలనలో జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధపడినా, ప్రతిపక్షం అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మండిపడ్డారు. ప్రతిపక్షానికి చిత్తశుద్ధి ఉంటే ప్రజాసమస్యలను సభ దృష్టికి తేవాలని సూచించామని, టీడీపీ సభ్యులు సొంత ఎజెండాతో సభా సమయాన్ని వృధా చేస్తున్నారని అన్నారు.

### మాతృ భాష విచ్ఛిన్నానికి కుట్ర

- బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్



అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయడం ద్వారా మాతృ భాష విచ్ఛిన్నానికి కుట్ర జరుగుతోందని బీజేపీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఆందోళన వ్యక్తం చేశారు. మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆంగ్లానికి తాము వ్యతిరేకం కాదని, కానీ తెలుగు మాధ్యమం రద్దుకు వ్యతిరేకమని చెప్పారు. రాజ్యాంగంలో 350ఏ అధికరణ ప్రకారం మాతృభాష కూడా ప్రాథమిక హక్కుల కిందకు వస్తుందని, తెలుగు రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయడం హక్కుల ఉల్లంఘనేనని, ఇది జాతికి ద్రోహం చేయడమేనని చెప్పారు.

### ఆప్షనల్‌గా ఆంగ్లం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు

అమరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాతృభాష కాని ఇతర భాషలు ఆప్షనల్‌గా మాత్రమే ఉండాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఏఎస్ రామకృష్ణ, రవివర్మ ప్రభుత్వానికి సూచించారు. మీడియా పాయింట్‌లో వారిద్దరూ మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాల్లో మాతృభాషలోనే విద్యాబోధన జరుగుతుంటే ఏపీలో ప్రభుత్వం తెలుగు మాధ్యమాన్ని రద్దు చేసి, ఆంగ్లం ప్రథమ మాధ్యమంగా ప్రవేశపెట్టాలని చూడడం సరికాదని అన్నారు. జపాన్‌లో ప్రాథమిక విద్య నుంచి సాంకేతిక విద్య వరకు స్థానిక భాషలోనే విద్యాబోధన జరుగుతుందన్నారు.

### ఏకపక్షంగా వ్యవహరిస్తున్న స్పీకర్

- నిమ్మల రామానాయుడు



అసెంబ్లీ మొదటి రోజు సమావేశాలు జరిగిన తీరు బాధాకరం. స్పీకర్ ప్రతిపక్షానికి మైక్ ఇవ్వకుండా, ప్రతిపక్షం గొంతు వినపడకుండా, ఏకపక్షంగా సభను నిర్వహిస్తున్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో టీ బ్రేక్ అంటూ పీపీఏలపై చర్చించకుండా పాలక పక్షం పారిపోయింది. ప్రతిపక్ష నేత చంద్రబాబును పీపీఏలపై చర్చకు అనుమతించడం లేదు. ఓవైపు సభలో గోపాలరెడ్డి కమిటీ రిపోర్టు ఇంకా రాలేదని చెబుతూ... మరోవైపు సీఎంవో ఉన్నతాధికారులు మీడియా సమావేశం పెట్టి పీపీఏలలో అక్రమాలు జరిగాయంటూ ఎలా చెపుతారు?.

### పెట్టుబడులు ఎవరు పెడతారు?

- మద్దాళి గిరి

కేంద్ర చెబుతున్నా వినకుండా రాష్ట్ర ప్రభుత్వం పీపీఏలను రద్దు చేసింది. వారంతా అంతర్జాతీయ కోర్టుకి వెళితే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరు ముందుకు వస్తారు?

### ముందు జగన్ కేసులపై మాట్లాడండి

- ఎమ్మెల్యే బెందాళం అశోక్

చంద్రబాబుపై ఓటుకు నోటు కేసు ఉందని మాట్లాడే ముందు జగన్మోహన్‌రెడ్డిపై ఉన్న కేసుల గురించి మాట్లాడాలి. ఆళ్ల రామకృష్ణారెడ్డిని ఉద్దేశించి.. 'ఓటుకు నోటు కేసు రాజకీయ కక్ష సాధింపుగానే కనబడుతోంది' అని హైకోర్టు వ్యాఖ్యానించిందిగా!.

### హెరిటేజ్‌లో ఉల్లి తక్కువకి ఇవ్వచ్చుగా!

- కరణం ధర్మశ్రీ

తెలంగాణ రాష్ట్రంలో ఉల్లిపాయలను ప్రభుత్వం రూ.45కి ఇస్తుంటే మన రాష్ట్రంలో కిలో రూ.25కే ఇస్తున్నాం. ఉల్లి ధరలపై టీడీపీ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తుంది. ప్రజలపై వారికంత ప్రేమే ఉంటే చంద్రబాబుకు చెందిన హెరిటేజ్‌లో తక్కువ ధరకు ఉల్లి ఎందుకు ఇవ్వడం లేదు?

### ప్రతిపక్ష హోదా జగన్ పుణ్యమే

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా ఉందంటే అది జగన్ పుణ్యమే. షరతులు లేకుండా వైసీపీలో చేరడానికి 13 మంది ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారు. 2024లో వైసీపీ, బీజేపీ మధ్యే పోటీ ఉంటుంది. టీడీపీకి 3వ స్థానమే.

### ప్రతిపక్షానికి ఎజెండా లేదు: ఉదయభాను

ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రతిపక్షానికి సరైనా ఎజెండా లేదు. తహసీల్దార్ వనజాక్షిపై దాడి విషయంలో చింతమనేనిపై కనీసం విచారణ జరపకుండా చంద్రబాబు ఊపేక్షించారు. కోటంరెడ్డి విషయంలో జగన్ విచారణకు ఆదేశించారు.

### ప్రతిపక్షాల తీరు బాధాకరం

- కళావతి, రెడ్డి శాంతి, శ్రీదేవి

మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిరోధించేందుకు చట్టాల్లో మార్పులు తేచ్చేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. అందుకు అనుగుణంగా మాట్లాడుతున్న మహిళా సభ్యుల ప్రసంగాలను ప్రతిపక్షం అడ్డుకునే ప్రయత్నం చేయడం బాధాకరం. మహిళలకు అన్నింటిలో 50 శాతం అవకాశాలు కల్పించేలా చట్టాన్ని జగన్ తెచ్చారు. మహిళలకు రక్షణ కల్పించేందుకే జీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని తెచ్చాం.

### నేడు సభలో ఆరోగ్యశ్రీ, ఉల్లిపై చర్చ

శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయం ముగియగానే ఆరోగ్యశ్రీపై ప్రత్యేక చర్చ జరుగుతుంది. అనంతరం జీరో అవర్ మొదలవుతుంది. ఆ తర్వాత ఉల్లి, నిత్యావసరాల ధరలపై స్వల్పవ్యవధి చర్చ ఉంటుంది. రైతు భరోసా కార్యక్రమంపైనా చర్చ జరుగుతుంది. కాగా.. అసెంబ్లీలో అనుసరించాల్సి వ్యూహాలపై సీఎం జగన్ అధ్యక్షతన సమావేశం జరిగింది.



సుజనా చౌదరి ఇంటి ముందు ఎన్ఎస్‌యూఐ నేతల ఆందోళన

# ఢిల్లీలో 'హోదా' సెగలు

▸▸ **సుజనా ఇంటిని ముట్టడించిన విద్యార్థులు**

న్యూఢిల్లీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఢిల్లీలో బీజేపీ ఎంపీ సుజనాచౌదరి ఇంటిని ముట్టడించారు. సోమవారం ఏపీ నుంచి తరలివచ్చిన సుమారు 150 మంది విద్యార్థులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న సుజనా, రెండో ద్వారం నుంచి బయటకు వెళ్లిపోయారని ఆందోళనకారులు ఆరోపించారు.

## దళితులను రాజ్యాధికారానికి దూరం చేసే కుట్ర

▸▸ **మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య**



ఢిల్లీలో ధర్నా చేస్తున్న మాలమహానాడు కార్యకర్తలు

న్యూఢిల్లీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దళితులను రాజ్యాధికారానికి దూరం చేసే కుట్రలో భాగంగానే రాజకీయ పార్టీలు ఎస్సీల వర్గీకరణ చేయాలంటున్నాయని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనతోనే ఎస్సీ వర్గీకరణ ఆలోచనకు కాలం చెల్లిందన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మాలమహానాడు నేతలు ధర్నా నిర్వహించారు. అనంతరం జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కథారియాను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

## జగన్‌కు విజయశాంతి అభినందన

హైదరాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దిశ తరహా ఘటనలు పునరావృతం కాకుండా బాధిత మహిళలకు సత్వర న్యాయం జరిగేలా నూతన బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు అసెంబ్లీలో ప్రకటించిన ఏపీ సీఎం జగన్‌కు అభినందనలు తెలియజేస్తున్నానని తెలంగాణ పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ విజయశాంతి అన్నారు. మహిళల భద్రత కోసం తెలంగాణలో కూడా ఇదే తరహా చట్టాన్ని తీసుకురావాలని కేసీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 'నాడు-నేడు'కు కలసిరండి!

▸▸ **మంత్రులు, ఎమ్మెల్యేలకు మంత్రి సురేశ్ పిలుపు**

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చే 'నాడు-నేడు' కార్యక్రమంలో చేయిచేయి కలిపి కలిసి రావాలని, సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రులు, ప్రజాప్రతినిధులను విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ కోరారు. సచివాలయంలో సోమవారం పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మంత్రి సురేశ్ సమావేశం నిర్వహించారు. విద్యా వ్యవస్థలో తీసుకుంటున్న సంస్కరణలతో మన రాష్ట్రం మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని చెప్పారు.

## రెడ్డి ఎంటర్‌ప్రైజెస్‌కు 'ఉపాధి' ఔట్‌సోర్సింగ్

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఇప్పటి వరకూ విముధ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా జీతాలు చెల్లిస్తుండగా... ఇకపై రెడ్డి ఎంటర్‌ప్రైజెస్ ద్వారా జీతాలు అందుతాయి. సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్(ఎస్ఆర్‌డీఎస్) ఈ మేరకు ఆ సంస్థతో ఒప్పందం చేసుకుంది.

## కచ్చితంగా రిజర్వేషన్ల అమలు

▸▸ **నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టులపై సీఎస్ ఆదేశం**

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు, మహిళల అభ్యున్నతి కోసం నామినేటెడ్ పదవులు, పనుల కాంట్రాక్టుల్లో 50 శాతం రిజర్వేషన్ల అమలు ఉత్తర్వులను సక్రమంగా పాటించాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీలం సాహ్ని స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో ఈ అంశంపై సమీక్షించారు. వైద్యఆరోగ్యశాఖ, విద్యుత్ బకాయిలపైనా సమీక్షించారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు అందుబాటులో ఉన్న నిధులతో విద్యుత్ వినియోగ చార్జీల బకాయిలను ఏపీ ట్రాన్స్‌కోకు సకాలంలో చెల్లించాలనీ సీఎస్ ఆదేశించారు.

## మీకు మనస్సాక్షి ఉందా!

▸▸ **మీ నాలుకలను తెగ్గోసేందుకు సిద్ధంగా మహిళలు : అనురాధ**

మంగళగిరి, డిసెంబరు 9: "వైసీపీ మహిళా ఎమ్మెల్యేలకు మనస్సాక్షి ఉందో లేదో అర్థం కావడం లేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఆరు నెలలకాలంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై దాడులు, అత్యాచారాలకు సంబంధించి 12,653 కేసులు నమోదయ్యాయి. వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలలో కొందరు అత్యాచార నేరాల్లో ఇరుక్కున్న సంగతి బహుశా వారికి తెలియదేమో! వైసీపీ నేతల అరాచకాలను, బాధితులకు సహకరించని ప్రభుత్వ తీరును మరుగుపరిచి వైసీపీ మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో మాట్లాడిన తీరుకు మహిళలంతా కోపంగా ఉన్నారు. వారి నాలుకలను తెగ్గోసేందుకు సిద్ధంగా ఉన్నారు" అని టీడీపీ అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎంపీ గోరంట్ల మాధవ్ ఓ అత్యాచారం కేసులో జైలులో ఉన్నారని, మరో ఎంపీ మార్గాని భరత్ వరకట్న వేధింపుల కేసులో నిందితునిగా ఉన్నారనీ, ఎమ్మెల్యే కోమటిరెడ్డి మహిళా ఎంపీడీవో ఇంటిపై అర్ధరాత్రి దాడికి వెళ్లి బెదిరించడం అందరికీ తెలిసిందేనన్నారు.

## 'నైపుణ్యం'పై ప్రత్యేక శాఖ

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా 'నైపుణ్యాభివృద్ధి-శిక్షణ' శాఖను ఏర్పాటు చేస్తూ సీఎస్ నీలంసాహ్ని సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖ, ఉన్నత విద్యాశాఖ, సాంకేతిక విద్య, కార్మిక, ఉపాధి, శిక్షణ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో వాటి సేవల వినియోగం ద్వారా ఈ శాఖను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని పరిశ్రమల్లో 75శాతం ఉద్యోగాలు స్థానికులకే కల్పించాలన్న చట్టాన్ని అమలు చేసేందుకు ఈ శాఖను ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత, నూతన ఆవిష్కరణ శాఖల విలీనం ద్వారా ఈ కొత్త శాఖను ఏర్పాటు చేశారు.

## పవన్‌ది బురద రాజకీయం: కన్నబాబు

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): "వైసీపీ ప్రభుత్వంపై పవన్ కల్యాణ్ బురద రాజకీయం చేస్తున్నారు. బక్కెట్లతో బురద పట్టుకుని జగన్‌పై చల్లేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారు. లేని ధాన్యం సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దీక్షలు చేస్తాననడం హాస్యాస్పదం. సగం సగం, తప్పుడు సమాచారంతో మాట్లాడుతున్న పవన్ వాస్తవాలను తనిఖీ చేసుకోవాలి" అని మంత్రి కన్నబాబు హితవు పలికారు. సోమవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతు సంక్షేమానికి వైసీపీ ప్రభుత్వం ఎంత ఖర్చు చేయడానికైనా, ఎన్ని ఒత్తిళ్లు ఎదుర్కోవటానికైనా సిద్ధంగా ఉందన్నారు. 151 మంది వైసీపీ ఎమ్మెల్యేలు రక్తపు కూడు తింటున్నారంటూ పవన్ కల్యాణ్ అర్థం లేకుండా మాట్లాడడం దారుణమన్నారు. ఏ ఎమ్మెల్యే, ఏ మంత్రి రైతులను ఇబ్బందికి గురి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రొటీన్‌గా చేసే పనిని కూడా పవన్ తనకు భయపడి చేశారనే భ్రమలో ఉన్నారంటూ ఎద్దేవా చేశారు.

## బాలికపై ఆటోడ్రైవర్ అత్యాచారం

వి.కోట, డిసెంబరు 9: చిత్తూరుజిల్లా వి.కోట మండలం పెద్దబరిణేపల్లిలో పాల కేంద్రంలో క్యాన్లు కడిగేందుకు వచ్చిన బాలికపై కన్నేసిన ఆటో డ్రైవర్ రాధాకృష్ణ ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఇంటి దగ్గర దిగబెడతానని చెప్పి మార్గమధ్యంలో మామిడితోటలోకి తీసుకెళ్లి అఘాయిత్యంచేశాడు. దీనిపై ప్రశ్నించిన ఆమె తల్లిదండ్రులపై రాధాకృష్ణ దాడి చేశాడు. గ్రామస్తులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

# బీజేపీలోనే కొనసాగుతా: గోకరాజు

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): "నేను బీజేపీలోనే కొనసాగుతాను. నా కుమారుడు, సోదరులు వైసీపీలో చేరారు. నేను రాజకీయాలకు దూరంగా ఉంటున్నా" అని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు తెలిపారు. పార్టీ మారతారంటూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. ఎన్నికల సమయంలో టీడీపీ, వైసీపీలు తన కుమారుడికి ఎంపీ సీటును ఇస్తామన్నాయన్నారు. తమ కుటుంబం మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉందనీ, తాను మాత్రం వీహెచ్‌పీలో చిన్నతనం నుంచి కొనసాగుతున్నానని వివరించారు. ఎన్నికల సమయంలో హఠాత్తుగా అశోక్ సింఘాల్ తన పేరును ప్రతిపాదించారని చెప్పారు. రాజకీయాలంటే ఇష్టం లేకున్నా ప్రజాసేవ చేయవచ్చన్న కారణంతోనే ఆరోజు ఎంపీగా చేశానని అన్నారు. నాడు పార్టీలు మారుతూ వచ్చిన రఘురామకృష్ణంరాజును అధిష్ఠానం తిరస్కరించిందన్నారు. ప్రధాని మోదీ, అమిత్‌షాకూడా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని వద్దన్నారన్నారు. తన కుమారుడిని వైసీపీలోకి రావాలని ఆహ్వానించారని చెప్పారు. బాగా ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని చెప్పానన్నారు. తన సోదరులు రామరాజు, నరసింహరాజు వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో కాంగ్రెస్‌తో కలసి పనిచేశారన్నారు. ఆ పరిచయాలతోనే వారు వైసీపీలోకి వెళుతున్నారన్నారు.



సీఎం సమక్షంలో వైసీపీలో చేరిన గోకరాజు కుటుంబ సభ్యులతో వైసీపీ ఉండి ఇన్‌చార్జి పీవీఎల్, ఎమ్మెల్యే కారుమూరి, ఎమ్మెల్సీ కంతేటి, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, ఉండి మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు తదితరులు

# ఢిల్లీని గిల్లి!

(మొదటి పేజీ తరువాయి)

ఉగ్రవాద కార్యకలాపాల దాకా... ప్రతి అంశంపై నిఘా వేసి, ఆ సమాచారాన్ని ముఖ్యమంత్రికి చేరవేసేది నిఘా అధిపతే. వైసీపీ అధికారంలోకి రాగానే కేంద్ర సర్వీసుల్లో ఉన్న పీఎస్ఆర్ ఆంజనేయులును రాష్ట్రానికి తీసుకొచ్చి నిఘా విభాగాన్ని అప్పగిస్తారనే ప్రచారం జరిగింది. ఆ తర్వాత... అనూహ్యంగా తెలంగాణ కేడర్‌కు చెందిన స్టీఫెన్ రవీంద్ర పేరు తెరపైకి వచ్చింది. అయితే, సూపర్ టైమ్ స్కేల్‌లో ఉన్న అధికారిని డిప్యుటేషన్‌పై పంపడానికి నిబంధనలు అంగీకరించవు. అత్యంత అసాధారణ పరిస్థితులు నెలకొంటే తప్ప ఇది కుదరదు. దీంతో... ఎంతగా ప్రయత్నించినా స్టీఫెన్ రవీంద్ర డిప్యుటేషన్‌కు కేంద్ర అంగీకరించలేదు.

### మనీశ్ నియామకంతో...

స్టీఫెన్ రవీంద్ర కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో వైఎస్ జగన్ ప్రభుత్వం ఇటీవల... మనీశ్ కుమార్ సిన్హాను ఇంటెలిజెన్స్ అధిపతిగా నియమించింది. ఎవరికి ఏ పదవి అప్పగించాలన్నది సీఎం ఇష్టం! అది ఆయన విచక్షణాధికారం. అయితే, ఎవరి 'సలహా'యో తెలియదుకానీ... కేంద్రంతో 'ఢీ అంటే ఢీ' అనేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పేందుకే మనీశ్‌కు కీలక పదవి కట్టబెట్టినట్లు తెలుస్తోంది. ఇంకెవరూ లేనట్లుగా మనీశ్‌నే ఎంపిక చేయడాన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. ఈ నియామకం కేంద్ర పెద్దలకు ఆగ్రహం తెప్పించింది. తెల్లారేసరికే ఈ సమాచారం ఢిల్లీ నుంచి ఏపీ సీఎం కార్యాలయానికి అందింది. దీంతో... 'ఎందుకైనా మంచిది' అనే ఉద్దేశంతో, మనీశ్ కుమార్ సిన్హా నియామకం గురించి వివరణ ఇచ్చేందుకే జగన్ ఢిల్లీకి వెళ్లారని సమాచారం. అయితే, జగన్ 'ధిక్కార' వైఖరిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న అమిత్‌షా... ఢిల్లీకి రమ్మని మరీ ఆయనకు ముఖం చాటేసినట్లు తెలిసింది.

### అయితే ఏంటి?

బిహార్‌కు చెందిన మనీశ్ కుమార్ సిన్హా ఏపీ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. సమర్థుడిగా పేరుంది. 13 ఏళ్లు రాష్ట్రంలో పని చేసిన ఆయన... 2013లో కేంద్ర సర్వీసులకు వెళ్లారు. సీబీఐ డీఐజీగా నియమితులయ్యారు. గత ఏడాది సీబీఐని రోడ్డుకీడ్చిన 'డైరెక్టర్ అలోక్ వర్మ వర్సెస్ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్థానా' వివాదంలో మనీశ్ కూడా ఒక పాత్రధారి. ప్రధాని మోదీ సొంత రాష్ట్రమైన రాకేశ్ ఆస్థానాకు కేంద్రం ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయనే సంకేతాలు వెలువడ్డాయి. ఆయనకు అమిత్‌షా మనిషిగా పేరుంది. ఈ విషయంలో ఢీ అంటే ఢీ అంటూ కేంద్రంతో 'యుద్ధానికి' దిగిన అలోక్‌వర్మ... రాకేశ్ వర్మపై వచ్చిన ఆరోపణల మీద విచారణ జరిపే బాధ్యతను మనీశ్‌కు అప్పగించారు. డైరెక్టర్, స్పెషల్ డైరెక్టర్ మధ్య వివాదం ముదరడం... సీబీఐ ప్రతిష్ఠ ఎన్నడూలేనంతగా దిగజారిపోవడంతో కేంద్రం వారిద్దరినీ తప్పించింది. అంతటితో ఆగకుండా... వర్మ టీమ్‌లో ఉండి, రాకేశ్ ఆస్థానాపై దర్యాప్తు చేస్తున్న మొత్తం బృందాన్ని రాత్రికి రాత్రి దిక్కుకొకరిగా బదిలీ చేసింది. ఆనాటి బాధితుల్లో మనీశ్ ఒకరు. ఆయనను ఢిల్లీ నుంచి నాగపూర్‌కు పంపించేశారు. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అందులోనూ... కేంద్ర ప్రభుత్వంలో అత్యంత కీలకమైన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. సరిగ్గా ఇక్కడే కేంద్రానికీ, అందునా హోంమంత్రి అమిత్‌షాకు ఆగ్రహమొచ్చింది. కేంద్ర సర్వీసుల నుంచి మనీశ్ అర్ధంతరంగా తిరిగి తన సొంత కేడర్‌కు, అంటే ఏపీకి వచ్చేశారు. ఆయననే జగన్ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించారు. దీంతో... తాము పక్కన పెట్టిన, ఏకంగా దేశ భద్రతా సలహాదారుపైనే సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన అధికారికి కీలక పదవి కట్ట బెట్టడం, ఇది కూడా ఉద్దేశపూర్వకంగా చేసిందే అని సమాచారం అందడంతో అమిత్‌షా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. "మీరు స్టీఫెన్ రవీంద్రను ఇవ్వనంత మాత్రాన ఊరుకుంటామా! మిమ్మల్ని ఢీకొట్టిన, మీ వాళ్ల గుట్టు తెలిసిన అధికారికే పట్టం కడతాం" అనేలా జగన్ వ్యవహరించారని... దీనిని కేంద్రం తీవ్రంగా పరిగణించిందని తెలిసింది.

## సుప్రీంకు ఏం చెప్పారంటే?

రాకేశ్ ఆస్థానా ఎదుర్కొంటున్న ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న తనపై ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి కొందరు ఒత్తిడి తెచ్చారని... రాకేశ్ ఆస్థానా హైదరాబాద్‌కు చెందిన వ్యక్తితో డబ్బులు తీసుకున్న వ్యవహారంపై దృష్టి సారించినందుకే తనను అకారణంగా బదిలీ చేశారని మనీశ్ సుప్రీం కోర్టుకు నివేదించినట్లు వార్తలొచ్చాయి. "ముడుపులకు సంబంధించి ఎగుమతులవ్యాపారి మొయిన్ ఖురేషీతోపాటు మనోజ్ ప్రసాద్, సోమేశ్ ప్రసాద్ తదితరులపై సీబీఐ కేసు నమోదైంది. 2018 అక్టోబరు 16వ తేదీన మనోజ్ ప్రసాద్ దుబాయ్ నుంచి రాగానే ఢిల్లీ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నాం. తనకు 'బాగా ఉన్నతస్థాయి వ్యక్తులు' తెలుసునంటూ దురుసుగా ప్రవర్తించారు. మనోజ్, సోమేశ్ తండ్రి దినేశ్వర్‌ప్రసాద్ గతంలో 'రా'లో పనిచేశారు. ఆయనకు ప్రస్తుత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సన్నిహిత సంబంధాలున్నాయి. 'రా' ప్రత్యేక కార్యదర్శి సామంత్ గోయల్ కూడా తనకు తెలుసునని మనోజ్ చెప్పాడు. ఒక విషయంలో అజిత్ దోవల్‌కు సంబంధించిన ఒక ముఖ్యమైన వ్యక్తిగత పని విషయంలో తన సోదరుడు సోమేశ్, సామంత్ సహాయం చేశారని కూడా వివరించాడు" అని మనీశ్ కుమార్ సిన్హా సుప్రీంకోర్టుకు వివరించారు. మొత్తానికి... పిటిషన్‌లో దోవల్ పేరు పలుమార్లు నేరుగా ప్రస్తావించడం, సీబీఐ కేసులోని నిందితులతో ఆయనకు సంబంధాలున్నాయని ప్రస్తావించడం బీజేపీ పెద్దలకు ఆగ్రహం తెప్పించింది. ఎన్నికల తర్వాత అమిత్ షాయే కేంద్ర హోంమంత్రి అయ్యారు. మనీశ్‌ను సీబీఐ పక్కకు తప్పించింది. కొన్నాళ్లపాటు వేచి చూసిన ఆయన... సొంత కేడర్ ఏపీకి వెళ్లిపోతానని దరఖాస్తు చేసుకోవడంతో కేంద్రం రిలీవ్‌చేసింది. అదే అధికారికి జగన్ కీలక పోస్టు అప్పగించారు. అయితే... కేంద్రం దీన్ని ఇంత సీరియస్‌గా తీసుకుంటుందని జగన్ అనుకోలేదని, సర్దిచెప్పేందుకే అమిత్‌షాను కలవాలనుకున్నారని తెలిసింది.

## 'రాజుకు' రాజు!

▸▸ **కమలం నేతలపై ఆకర్ష్**

▸▸ **ఎంపీ రఘును చేరదీస్తున్న బీజేపీ**

▸▸ **ప్రతిగా గోకరాజు కుటుంబ సభ్యులను పార్టీలో చేర్చుకున్న జగన్**

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



స్టీఫెన్ రవీంద్రను ఇవ్వనందుకు... మనీశ్ కుమార్ సిన్హా!

ఎంపీ రఘురామ కృష్ణంరాజు (రఘు)ను చేరదీస్తున్నందుకు... అదే జిల్లా, అదే సామాజిక వర్గానికి చెందిన గోకరాజు గంగరాజు కుటుంబ సభ్యులపై 'ఆకర్ష్'!

ఇది 'దెబ్బకు దెబ్బ' అన్నట్లుగా కేంద్రానికి జగన్ విసురుతున్న సవాల్! అనేక సంవత్సరాలుగా బీజేపీలో ఉన్న మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు కుమారుడు రంగరాజు, ఆయన సోదరులు రామరాజు, నరసింహరాజు సోమవారం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. వైసీపీకి చెందిన రఘుకు కేంద్రంలో మంచి ప్రాధాన్యం లభిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఆయనను ప్రధాని పలకరించి, పిలిచి కరచాలనం చేశారు. కేంద్ర మంత్రులను రఘు స్వేచ్ఛగా కలుస్తున్నారు. వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, లోక్‌సభా పక్ష నేత మిథున్ రెడ్డి వేచిచూస్తుండగా... ఆ తర్వాత వచ్చిన రఘుకు అమిత్‌షా నుంచి పిలుపు అందింది. ఇక... స్వయంగా వైఎస్ జగన్‌కు లభించని షా అపాయింట్‌మెంట్, రఘుకు సులువుగా లభిస్తోంది. ఎంపీలు సొంతంగా కేంద్ర మంత్రులను కలవొద్దని జగన్ సూచించినా తర్వాత కూడా పరిస్థితి మారలేదు. మరోవైపు... తెలుగుపై లోక్‌సభలో రఘు చేసిన ప్రసంగంపైనా జగన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నప్పటికీ... తమ పార్టీ ఎంపీ రఘును బీజేపీ ఉద్దేశపూర్వకంగానే చేరదీస్తున్నట్లు వైసీపీ అనుమానిస్తోంది. దీనికి బదులుగా... రఘు సొంత జిల్లా పశ్చిమ గోదావరి జిల్లాకే చెందిన, అందులోనూ ఆయన సామాజిక వర్గానికే చెందిన గోకరాజు కుటుంబ సభ్యులను వైసీపీలో చేర్చుకున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

# తక్షణ శిక్ష!



(మొదటి పేజీ తరువాయి)

తన మనుసును కలిచివేశాయని, అందుకే కఠినమైన చట్టం ఉండాలన్న ఉద్దేశంతో బిల్లును తీసుకొస్తున్నామన్నారు. దిశ హత్యకేసులో నిందితుల ఎన్‌కౌంటర్ సంఘటనను ప్రస్తావిస్తూ.. కాల్చేసినా తప్పులేదనుకున్నానని వెల్లడించారు. మహిళ రక్షణపై సోమవారం శాసనసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. తెలంగాణ సీఎం కేసీఆర్, పోలీసు అధికారులకు శాసనసభ సాక్షిగా హ్యాట్సాఫ్ చెప్పారు. ఇంకా చట్టాలు, కోర్టులు విధించే శిక్షలు, సోషల్ మీడియాపై పలు వ్యాఖ్యలు చేశారు. నిర్భయ కేసులో దోషులకు నేటికీ శిక్షలు పడలేదని, వారు బయటే తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'అత్యాచార దోషులకు శిక్ష వెంటనే పడాలని నిర్భయ చట్టం తీసుకొచ్చాం. నాలుగు నెలల్లో తీర్పు ఇవ్వాలి.. నాలుగు నెలల్లో శిక్షపడాలని చట్టం చెబుతోంది. ఏడేళ్లయింది. నిర్భయ బాధితులు( నిందితులు) ఇవాల్టికీ తిరుగుతున్నారు. ఎటువంటి శిక్షపడని పరిస్థితుల్లో చట్టాలున్నాయి. ఏదైనా జరిగితే వెంటనే న్యాయం దక్కాలని మహిళలు, ప్రతి చెల్లీ కోరుకుంటున్నారు. మన ప్రభుత్వం కూడా అదే దిశగా ఆలోచిస్తోంది. ఎవరైనా కూడా చట్టాన్ని వారి చేతుల్లోకి తీసుకుని టకటకా కాల్చేయాలని అనుకోరు. కానీ జరుగుతున్న జాప్యం చూసినపుడు.. ఇక దోషులకు శిక్షపడదు.. వారు తప్పించుకోగలరు.. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగినా ఎటువంటి న్యాయం జరగదని అనిపించినపుడు.. కోర్టులు కూడా ఇంత జాప్యం చేసే పరిస్థితి కనిపిస్తున్నపుడు.. వారికి శిక్ష పడదని అపనమ్మకం కలిగిస్తున్న పరిస్థితుల్లో... వారిని ఎవరైనా కాల్చేస్తే వాళ్లను హీరోలుగా భావించి చప్పట్లుకొట్టే పరిస్థితిలో మన సమాజం ఉంది. ఈ చట్టాలు మారాలి. తప్పు జరిగితే స్పందించే ధోరణి మారాలి. చట్టాలు ఇంకా గట్టిగా బలపడాలి' అని ఆయన ఆకాంక్షించారు.

తాగితే రాక్షసుడవుతాడు..

ఐదారుగురు మనుషులు కలిసి తాగితే మృగాళ్లవుతున్నారని జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అందుకే మద్యం షాపుల వెంట పర్మిట్ రూములను రద్దుచేశామన్నారు. 'మనిషి రాక్షసుడు ఎప్పుడు అవుతాడు? జ్ఞానం ఎప్పుడు కోల్పోతాడు? తాగితే. ఒకరికి నలుగురు తోడయితే, తాగుతూ కూర్చుంటే ఆలోచనలు మారుతాయి. రాక్షసులవుతారు. అందుకే పర్మిట్ రూములు రద్దుచేశాం. మద్య నియంత్రణ చేపట్టాం. 43 వేల బెల్ట్‌షాపులు రద్దుచేశామని సగర్వంగా చెబుతున్నా. అశ్లీలత (పోర్నోగ్రఫీ) కూడా చెడగొడుతోంది. స్మార్ట్‌ఫోన్ వల్ల కలుగుతున్న నష్టం ఇదే. ఎన్ని నిషేధాలున్నా కట్టడిచేయలేకపోతున్నాం. ఐపీ అడ్రస్‌లను బ్లాక్‌చేస్తున్నా ఇంకా కనిపిస్తోంది. ఇవన్నీ మారాలి. మార్చుతూ విప్లవాత్మక బిల్లు తీసుకొస్తాం' అని చెప్పారు.

## నాకు ఒక్కతే భార్య!

ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీ సమావేశంలోనూ భార్యల ప్రస్తావన తీసుకొచ్చారు. మహిళల రక్షణపై జరిగిన ప్రత్యేక చర్చలో బైగమీ(బహు భార్యత్వం) కేసుల గణాంకాలు చెప్పారు. కొందరు పెద్ద పెద్ద నాయకులు.. ఒక్కరు, ఇద్దరు, ముగ్గురు సరిపోరు.. నలుగురు భార్యలు, పెళ్లాలు కావాలని కోరుకుంటున్నారు. దీన్నే బైగమీ అంటారని చెబుతూ గడిచిన నాలుగేళ్లకాలంలో ఈ కేటగిరీలో నమోదైన కేసుల వివరాలు తెలియజేశారు. మరో సందర్భంలో తనకు ఒక్కతే భార్య ఉన్నారని చెప్పారు. 'నాకూ ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరూ ఆడపిల్లలే. చెల్లెలు ఉంది. ఒక్కతే భార్య ఉంది' అని నొక్కిచెప్పారు. తమ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలే అవుతోందని, అయినా రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని, నేరాలు జరిగిపోతున్నాయని చెప్పేందుకు ప్రతిపక్ష నేత తాపత్రయపడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 2014-2018 మధ్య మహిళలపై జరిగిన దౌర్జన్యాలు, అత్యాచారాల కేసుల వివరాలను చదివారు. మహిళల రక్షణపై సలహాలు చెప్పాలని చంద్రబాబును కోరితే.. ఆరు నెలల్లో ఏమీ చేయలేదన్న విమర్శలకు తాము ప్రతి విమర్శ చేస్తున్నామన్నారు. ఈ చర్చలో వైసీపీ ఎమ్మెల్యేలు ఉషశ్రీ, రజని, ధనలక్ష్మి మాట్లాడారు.

## టోల్ కట్టడం కోసమని బైకు దిగితే..

దిశపై హత్యాచారం సమాజం సిగ్గుతో తలదించుకునే సంఘటనని సీఎం జగన్ అన్నారు. 'టోల్‌గేటు దగ్గర టోల్ కట్టడం కోసమని బైకు దిగితే నలుగురు వచ్చి పంక్చర్ చేసి.. అక్కడే ఆమె ఉండేటట్లు చేసి.. పంక్చర్ రిపేర్ చేస్తామని నమ్మించి పక్కకు తీసుకెళ్లారు. రేప్‌చేసి కాల్చివేశారు. దీనిపై మనం, పోలీసులు, రాజకీయ నేతలు ఎలా స్పందించాలి? అలాంటి సంఘటనే ఏపీలోనో, మనకే జరిగితే ఎలా స్పందించాలో మనకు మనం ప్రశ్నించుకోవాలి. ఆ సంఘటన చూశాక, తప్పు జరిగిందని మీడియా, టీవీ చానళ్లు చూపించాయి. తెలంగాణ ప్రభుత్వం, కేసీఆర్, పోలీసు అధికారులకు శాసనసభ నుంచే హ్యాట్సాఫ్ చెబుతున్నాను. ఇద్దరు ఆడపిల్లల తండ్రిగా నేను దిశ ఘటనపై ఎలా స్పందించాలి? నేరస్థులకు ఏ రకమైన శిక్షపడితే ఉపశమనం లభిస్తుంది? జరగకూడని పరిస్థితుల్లో ఎన్‌కౌంటర్ జరిగింది. ఇదే పని(ఎన్‌కౌంటర్) సినిమాల్లో హీరో చేస్తే చప్పట్లు కొడతాం. సినిమా హిట్ అవుతుంది. ఇదే నిజ జీవితంలో దమ్మున్నవారు ఎవరైనా చేస్తే ఏం జరుగుతుంది? నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ (జాతీయ మానవ హక్కుల కమిషన్) అట.. ఢిల్లీ నుంచి టకటకా పరుగెత్తుకుంటూ వస్తున్నారు. జరిగింది తప్పటా? ఇలా జరగకూడదటా? ఇంత దారుణమైన పరిస్థితిలో ఇవ్వాళ చట్టాలున్నాయి' అని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి కేసుల్లో రెండు మార్గాలున్నాయి. కొన్ని దేశాల్లో అయితే కనిపిస్తే వెంటనే కాల్చివేస్తారు. మన దేశంలో, రాష్ట్రంలో ఇంకా కొద్దిగా చట్టాలను సవరించాలి. ఇంకా ఆమోద యోగ్యమైన చట్టాలు రావాలి. వారంరోజుల్లోపు విచారణ పూర్తిచేయాలి. ఈలోపే డీఎన్ఏ, ఇతర రిపోర్టులు తెప్పించుకోవాలి. రెండు వారాల్లోపు ట్రయల్ పూర్తిచేయాలి. 21 పనిదినాల్లో వారికి ఉరిశిక్ష పడేలా చట్టాలు రావాలి" అని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియాను చూస్తే బాధేస్తోందన్నారు. అది పూర్తిగా పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. 'కేవలం ఇతర వ్యక్తులపై బురదజల్లడానికి, ఎటువంటి మనఃసాక్షి లేకుండా సోషల్ మీడియా దిగజారింది. ఆడవారిపై తప్పుడు పోస్టింగ్ పెడితే శిక్ష పడుతుందన్న భయం ఉండాలి. ఆ దిశగా చట్టాల్లో మార్పులు తెచ్చే దిశగా అడుగులు వేస్తున్నాం. సెక్షన్ 354 (ఈ)ని ప్రవేశపెట్టే ఆలోచన ఉంది' అని సీఎం చెప్పారు.

## బార్లకు 520 దరఖాస్తులు

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నూతన బార్ల పాలసీలో జారీ చేయనున్న లైసెన్సుల కోసం 520 దరఖాస్తులు వచ్చాయి. 487 బార్లకు నోటిఫికేషన్ జారీ చేయగా, సోమవారం రాత్రి వరకు 520 దరఖాస్తులు అందాయి. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు నగరాల్లో బార్ల సంఖ్య కంటే, దరఖాస్తులు చాలా తక్కువగా వచ్చాయి. కాగా అనంతపురంలో 5బార్లకు దాదాపు 30 దరఖాస్తులు అందాయి. పెద్ద నగరాల్లో బార్లు మిగిలిపోయే అవకాశం ఉంది. వాటికి ఎక్సైజ్ శాఖ తర్వాత నోటిఫికేషన్ జారీ చేయనుంది. దరఖాస్తు రుసుము రూ.10లక్షలు చేయడం, లైసెన్సు ఫీజులు రెట్టింపు చేయడంతో చాలా మంది వ్యాపారులు మద్యం వ్యాపారానికి ముందుకు రాలేదు.

### 'వైఎస్సార్ స్మృతివనాని'కి 2.5కోట్లు విడుదల

డాక్టర్ వైఎస్సార్ స్మృతి వనం పథకం కింద ప్రభుత్వం సోమవారం రూ.2.5 కోట్లు విడుదల చేసింది. అటవీశాఖ ద్వారా పట్టణాల్లో మొక్కల పెంపకానికి ఈ నిధులు వెచ్చించనున్నట్లు అధికారులు తెలిపారు.



ఒంగోలు దిబ్బలరోడ్డు రైతు బజారులో తెల్లవారు జామున 4 గంటలకే..

# రైతు బజార్లలో అదే రద్దీ

▸▸ **గుడివాడలో వృద్ధుడి ఉసురు తీసిన ఉల్లి...నన్ను కలిచివేసింది: లోకేశ్**

▸▸ **నెల్లూరులో రూ.200 దాటిన ఉల్లి ధర**

**ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్:** ఉల్లి కష్టాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లలో రద్దీ కొనసాగుతోంది. సామాన్యులకు కన్నీళ్లతోపాటు కాళ్ల నొప్పులూ తప్పడం లేదు. కిలో ఉల్లి కోసం రైతుబజార్ల వద్ద నాలుగైదు గంటలసేపు పడిగాపులు తప్పడంలేదు. కొన్నిచోట్ల అర్ధరాత్రే రైతు బజార్లకు చేరుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కిలోమీటర్ల మేర బారులు కనిపిస్తున్నాయి. అయినా అదనపు కౌంటర్లు పెంచకపోవడంతో జనానికి తిప్పలు తప్పడం లేదు. తాజాగా.. కృష్ణా జిల్లా గుడివాడలో సోమవారం ఉల్లి కోసం క్యూలో నిల్చొన్న ఓ వృద్ధుని గుండె ఆగింది. పౌరసరఫరాల మంత్రి కొడాలి నాని సొంత ఇలాకానే ఈ ఘటన జరగడం గమనార్హం. ఒకేసారి వేలాది మంది చొచ్చుకురావడంతో గుడివాడ రైతుబజారు వద్ద క్యూలో నిల్చున్న నూనె సాంబిరెడ్డి (65) గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఈ పరిణామంతో విశాఖలో అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రతి రైతు బజారులో ఉదయం 7 గంటల నుంచి విక్రయాలు ప్రారంభిస్తుండగా, వినియోగదారులు అర్ధరాత్రి నుంచే అక్కడ బారులు తీరి పడిగాపులు కాస్తున్నారు. గుడివాడ ఘటనతో విశాఖలో అదనపు కౌంటర్లు పెంచారు. కర్నూలు ఉల్లి అయిపోయిందని, కృష్ణాపురం ఉల్లిని ఒక్కక్కరికీ కిలో రూ.50 చొప్పున విక్రయించారు. ఆ ఉల్లికి కూడా ప్రజలు పోటెత్తారు. కాగా, ఉల్లి సమస్య తీరేంత వరకు రైతుబజార్లకు వారానికి ఇచ్చే ఒక రోజు సెలవు కూడా రద్దు చేస్తున్నామని మార్కెటింగ్ శాఖ కమిషనర్ ప్రకటించారు. నెల్లూరు బహిరంగ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.200 దాటింది. పెద్ద సైజు 220కిపైగా పలుకుతోంది. ఫత్తేఖాన్‌పేట రైతుబజారులో ఉల్లి పంపిణీ నిలిపివేయడంతో ప్రజలు తిరగబడ్డారు. కావలి రైతు బజారు వద్ద జరిగిన తోపులాటలో కొత్తపల్లి హరిజనవాడకు చెందిన తోట నాగభూషణం సొమ్మసిల్లి పడిపోయాడు. ఒంగోలులో రైతు బజార్ల వద్ద సోమవారం వేకువజామున 4 గంటల నుంచే చాంతాడంత క్యూలైన్లు కనిపించాయి. కాగా, 'పేదలపై సీఎం జగన్‌కు అంత కక్ష ఎందుకో అర్థం కావడం లేదు. ఉల్లికోసం సామాన్యులు అల్లాడుతున్నారు. జగన్ అసమర్ధ పాలన కారణంగా క్యూలైన్లలో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. గుడివాడ రైతు బజార్లో కేజీ ఉల్లి కోసం క్యూ లైన్‌లో నిలబడి సాంబయ్య మృతిచెందిన ఘటన తీవ్రంగా కలిచివేసింది' అని టీడీపీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేర్కొన్నారు.

### ▸▸ పెట్రోల్ పట్టు.. ఉల్లి కొట్టు!

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 9 : కార్లు, బైకులు, టీవీలు, ఫ్యాన్‌లు, రిఫ్రిజిరేటర్లు ఇలా ఖరీదైన వస్తువులకే లక్కీ డ్రాలు చూస్తుంటాం. ఈ కోవలో ఉల్లి చేరడం తాజా విశేషం. లక్కీ డ్రా అంటూ విజయనగరం పట్టణంలోని ఓ పెట్రోల్ బంకు ఆఫర్ ప్రకటించింది. రూ.200 పెట్రోల్ వేయించుకున్న వారికి ఒక కూపన్ అందిస్తున్నారు. రోజూ సాయంత్రం డ్రా తీసి గెలిచిన ఇద్దరికి రెండు కిలోలు చొప్పున ఉల్లిపాయలు ఇస్తున్నారు. బంపర్ డ్రాగా వచ్చేనెల 26న గణతంత్ర దినోత్సవం రోజున డ్రా తీసి విన్నర్‌రు 10కిలోల ఉల్లిపాయల పార్సిల్‌ను అందిస్తామని ప్రకటించారు. ఇదే పెట్రోల్ బంక్ వద్ద మొదటి, రెండు, మూడు బహుమతులుగా కారు, బైక్, ఫ్రిజ్ ఉండగా ఆరో బహుమతిగా ఉల్లి పాయలకు చోటు ఇచ్చారు.

### ▸▸ ఉల్లి.. మద్యం కోసం 'బారు'లు!

తెనాలి, డిసెంబర్ 09 (ఆంధ్రజ్యోతి): ఉల్లి కోసం, మద్యం కోసంఎప్పుడైనా జనం బారులు తీరడం చూశమా!?. కానీ ఇప్పుడా పరిస్థితి వచ్చింది. గతంతో పోలిస్తే మద్యం దుకాణాలు తగ్గడం, ఉన్నవీ రాత్రి 8గంటలకే బంద్ అవుతుండడంతో మందుబాబులు, ఉల్లి దొరక్క ప్రజలు గుంటూరు జిల్లా తెనాలిలోని రత్నాటాకీస్ సెంటర్‌లో సోమవారం రాత్రి గంటల తరబడి కిలోమీటరు మేర క్యూకట్టారు.



## న్యూజిలాండ్‌లో పేలిన అగ్నిపర్వతం

### ఐదుగురి మృతి

వెల్లింగ్టన్, డిసెంబరు 9: న్యూజిలాండ్‌లో వైట్ ద్వీపంలోని అగ్నిపర్వతం పేలింది. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఐదుగురు చనిపోగా.. 18మంది గాయపడ్డారు. పదుల సంఖ్యలో పర్యాటకులు గల్లంతయ్యారు. సహాయక బృందాలు హెలికాప్టర్ల ద్వారా 23 మందిని కాపాడాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అగ్నిపర్వతం పేలిన ద్వీపం పర్యాటకంగా ప్రసిద్ధి చెందినదని, ప్రమాద సమయంలో అక్కడ 50 మందికి పైగా ఉన్నారని అధికారులు చెప్పారు. అగ్నిపర్వతం పేలడంతో వెలువడిన బూడిద దాదాపు 3.6 కిలోమీటర్ల ఎత్తువరకు ఎగిసింది.



## విద్యార్థులపై విరిగిన లాఠీ



జేఎన్‌యూ విద్యార్థులపై పోలీసులు మళ్లీ లాఠీలు ఝుళిపించారు. పెంచిన హాస్టల్ ఫీజులను ఉపసంహరించుకోవాలంటూ సోమవారం విద్యార్థులు రాష్ట్రపతి భవన్‌కు భారీ ర్యాలీ నిర్వహించారు. బికాజీ కామాప్యాలెస్ మెట్రో స్టేషన్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో విద్యార్థులు బ్యారికేడ్లను తోసుకుంటూ ముందుకు దూసుకొచ్చారు. దీంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. రాష్ట్రపతి భవన్‌కు శాంతియుతంగా వెళ్తున్న తమపై ఖాకీలు జులుం ప్రదర్శించారని విద్యార్థులు ఆరోపించారు. హాస్టల్ ఫీజులు తగ్గించాలని, తమపై పెట్టిన కేసులు ఎత్తివేయాలన్న డిమాండ్‌తో జేఎన్‌యూ విద్యార్థులు నెల రోజులుగా ఆందోళన చేస్తున్నారు.

\- న్యూఢిల్లీ

## సోషల్ మీడియాతో ఆధార్ లింక్‌కు ‘నో’

**▸▸ అది మా పని కాదు, ప్రభుత్వానిది: హైకోర్టు**



న్యూఢిల్లీ, డిసెంబరు 9: సోషల్ మీడియా ఖాతాలను ఆధార్, పాన్, ఓటరు గుర్తింపు కార్డుతో అనుసంధానానికి అనుమతిస్తూ ఉత్తర్వులు ఇవ్వబోమని ఢిల్లీ హైకోర్టు తెలిపింది. దీనివల్ల గణనీయ సంఖ్యలో ఉన్న సోషల్ మీడియా ఖాతాదారుల సమాచారాన్ని విదేశాలకు ఇచ్చినట్లవుతుందని సీజే డీఎన్ పటేల్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఫేస్‌బుక్, ట్విటర్, వాట్సాప్ ఖాతాలను ఆధార్, పాన్‌తో లింక్ చేయాలంటే ప్రస్తుత చట్టాన్ని కేంద్రం సవరించాల్సి ఉంటుందని ధర్మాసనం తెలిపింది. సోషల్ మీడియా ఖాతాల్లో 20% ఖాతాలు నకిలీవని, వీటిని తొలగించేందుకు ఆదేశాలివ్వాలంటూ బీజేపీ నేత అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ పిల్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

## 7248.. ఐఐటీల్లో డ్రాపౌట్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 9: ఇంజనీరింగ్ విద్యకు సంబంధించి అత్యున్నతమైన విద్యాసంస్థలైన ఐఐటీల్లో సీటు దక్కించుకోవడం కోసం లక్షలాది మంది విద్యార్థులు కష్టపడి చదువుతారు. కానీ.. గత ఐదేళ్లలో ఏకంగా 7,248 మంది విద్యార్థులు తమకు వచ్చిన ఉద్యోగావకాశాలను, ఇతరత్రా మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఐఐటీల నుంచి బయటికొచ్చేశారు. కేంద్ర మానవవనరుల శాఖ ఇటీవల లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాలను పేర్కొంది. వీరిలో 2000 మంది గత రెండేళ్లలో డ్రాపౌట్ అయినవారు కాగా... అందులో 1400 మంది కేవలం ఐఐటీ ఢిల్లీ, ఖరగ్‌పూర్ క్యాంపస్‌ల నుంచి బయటకెళ్లినవారు కావడం గమనార్హం.. వారిలో అత్యధికులు పీజీ , డాక్టోరల్ ప్రోగ్రాములు చేస్తున్నవారు. పీజీ, డాక్టోరల్ స్థాయిలో లభించే ఆకర్షణీయమైన ఉద్యోగావకాశాలే ఇందుకు కారణమని కేంద్ర మానవ వనరుల శాఖ అభిప్రాయపడింది.

## ఎస్సీ,ఎస్టీలకు మరో పదేళ్లు

**▸▸ చట్టసభల్లో కోటాపై లోక్‌సభలో బిల్లు**

**▸▸ ఆంగ్లో ఇండియన్‌లకు స్వస్తి**

న్యూఢిల్లీ, డిసెంబరు 9: లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీల్లో ఎస్సీ, ఎస్టీ కోటాను మరో పదేళ్లపాటు పొడిగిస్తూ న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లుని ప్రవేశపెట్టారు. అదే సమయంలో.. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో ఆంగ్లో-ఇండియన్లకు ఉన్న రిజర్వేషన్లను ప్రభుత్వం నిలుపుదల చేసింది.

### సైనిక స్కూళ్లలో బాలికలు

దేశంలోని అన్ని సైనిక స్కూళ్లలో బాలికలకు ప్రవేశం కల్పించాలని నిర్ణయించినట్లు రక్షణశాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యస్సో నాయక్ రాజ్యసభలో వెల్లడించారు. 2018-19 ఏడాదికి ప్రయోగాత్మకంగా మిజోరంలో చింగ్‌చిప్‌లోని సైనిక స్కూల్‌లో బాలికలకు ప్రవేశం కల్పించామని, ఈ ప్రయోగం విజయవంతం కావడంతో అన్ని సైనిక పాఠశాలల్లో బాలికలకు ప్రవేశం కల్పించాలని నిర్ణయించామన్నారు.

### అక్రమ ఆయుధాల.. నేరగాళ్లకు జీవిత ఖైదు

చట్టవిరుద్ధంగా ఆయుధాలు తయారుచేసినా, అమ్మినా, మరమ్మతు చేసినా, కలిగిఉన్నా ఆ నేరగాళ్లు బతికున్నంత కాలం జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ఇలాంటి నేరాల్లో కనీస శిక్షగా యావజ్జీవ ఖైదు (14 ఏళ్లు) విధిస్తారు. హోం మంత్రి అమిత్‌షా సోమవారం ఈ మేరకు ప్రవేశపెట్టిన ఆయుధాల(సవరణ) బిల్లును లోక్‌సభ ఆమోదించింది. వేడుకల సందర్భంగా గాలిలోకి జరిపే కాల్పుల్లో నిర్లక్ష్యం వహించినా, ప్రాణహాని జరిగినా రెండేళ్లదాకా జైలు శిక్ష, రూ. లక్ష దాకా జరిమానా లేదా రెండూ విధిస్తారు. వ్యక్తిగత భద్రతకు పౌరులకు ప్రభుత్వం 3 ఆయుధాలను.. ఇకపై రెండుకు కుదించనుంది.

### సముద్రపు నేరగాళ్లకు ఉరే!

సముద్రపు దొంగలకు ఉరిశిక్ష లేదా యావజ్జీవ కారాగార శిక్ష పడేలా ప్రభుత్వం ఓ బిల్లుని తీసుకువచ్చింది. సముద్రయానంలో చోరీలు, కిడ్నాప్‌లు వంటి నేరాలకు పాల్పడే పైరేట్లను కఠినంగా శిక్షించే విధంగా విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టారు.

### కబుర్లతో అంతరాయం కలిగించొద్దు

**▸▸ రాజ్యసభ సభ్యులకు వెంకయ్య హితవు**

న్యూఢిల్లీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో కొందరు సభ్యులు.. మంత్రులతో కలిసి కబుర్లు చెప్పుకోవడాన్ని చైర్మన్ వెంకయ్యనాయుడు తీవ్రంగా ఆక్షేపించారు. సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయనీ విషయాన్ని ప్రస్తావించారు. ఇది మంచి సంప్రదాయం కాదని సున్నితంగా హెచ్చరించారు. అత్యవసరమని భావిస్తే.. బయటకు వెళ్లి మాట్లాడుకోవాలని సూచించారు.

### 70 శాతం తగ్గనున్న ఎంబీబీఎస్ ఫీజులు?

న్యూఢిల్లీ, డిసెంబరు 9: ప్రైవేటు వైద్య కళాశాలలు, డీమ్డ్ వర్సిటీల్లో డిగ్రీ, పీజీ వైద్యవిద్య కోర్సుల ఫీజులు 70 నుంచి 90% దాకా తగ్గనున్నాయి. ఆ విద్యాసంస్థల్లో 50% సీట్లకు రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల మధ్యే ఫీజును వసూలు చేయాలని వైద్యరంగ నిపుణులతో కూడిన బోర్డ్ ఆఫ్ గవర్నర్స్(బీవోజీ) కేంద్ర ఆరోగ్యశాఖకు సిఫారసు చేయనుంది. వైద్యవిద్య ఫీజుల పునర్ వ్యవస్థీకరణపై బీవోజీ రూపొందించిన ముసాయిదాలో ఈమేరకు మార్గదర్శకాలను పొందుపరిచినట్లు తెలుస్తోంది.

# పౌరసత్వ బిల్లుకు ఆమోదం

(మొదటి పేజీ తరవాయి)

పరిస్థితుల్లోనూ సోమవారమే బిల్లు ప్రవేశపెట్టి, అదే రోజు ఆమోదం పొందాలని భావించిన బీజేపీ... అందుకు అనుగుణంగా ప్రణాళిక రచించింది. సోమవారం ఉదయం హోంమంత్రి అమిత్ షా ఈ బిల్లును ప్రవేశపెట్టగానే నిరసన హోరెత్తింది. బిల్లు తెస్తున్నారని ముందే తెలుసుకున్న కాంగ్రెస్ సభా నియమావళి రూల్ 72 కింద నోటీసు ఇచ్చింది. సమానత్వ హక్కును కాలరాసే ఈ బిల్లును అసలు ప్రవేశపెట్టరాదని కోరారు. దీనిపై రెండు గంటలపాటు సభ వాడిగా సాగింది. చివరకు బిల్లును అసలు ప్రవేశపెట్టాలా .. వద్దా అనే అంశంపై ఓటింగ్‌ను నిర్వహించారు. 293 ఓట్లు అనుకూలంగానూ, 82 ఓట్లు వ్యతిరేకంగానూ పడి- విపక్ష ప్రయత్నం వీగిపోయింది. వెరసి... బిల్లుపై ఓటింగ్ జరిగినా ఫలితం ఇదే అని స్పష్టమైపోయింది. ఆ తర్వాత లోక్‌సభలో సోమవారం రాత్రి పొద్దుపోయేదాకా దీనిపై చర్చ జరిగింది.



### ఎందుకు తెచ్చామంటే..!

‘క్యాబ్’ అవసరం గురించి హోంమంత్రి అమిత్‌షా సభకు వివరించారు. విపక్షాల విమర్శలను తిప్పికొట్టారు. “దేశాన్ని మతపరంగా విభజించినది కాంగ్రెస్ పార్టీయే! ఆనాటి ఆ విభజనే నేడు అనేక ఇబ్బందులకు కారణం. ఆనాడు ఆ విభజన జరిగి ఉండకపోతే నేడీ బిల్లు తేవాల్సిన అవసరమే ఉండేది కాదు. మేం మత ప్రాతిపదికన ఈ బిల్లు తేలేదు. మేం ముస్లింలకు వ్యతిరేకం కాదు. శరణార్థులు వేరు, చొరబాటుదారులు వేరు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల్లో మతపరమైన వేధింపులు ఎదుర్కొనే ముస్లిమేతరులకు ఈ బిల్లు ద్వారా భారత పౌరసత్వం కల్పిస్తాం. ఈ మూడు దేశాలే ఎందుకంటే... ఇవి మనకు అతి సమీపంగా, దాదాపు కలిసిపోయినట్లుగా ఉన్న సరిహద్దులు గలవి, అంతకుమించి ఇవి మూడూ ఇస్లామిక్ దేశాలు. అక్కడ ముస్లింలకూ ఎటూ రక్షణ ఉంటుంది. మిగిలిన మతస్థులు ద్వితీయ శ్రేణి పౌరులు. అందుకే హిందూ, క్రైస్తవ, బౌద్ధ, జైన, పార్సీ, సిక్కు మతస్థులకు పౌరసత్వం కల్పించాలని నిశ్చయించాం” అని బిల్లును ప్రవేశపెట్టే సమయంలో హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. బిల్లు రాజ్యాంగంలోని సమానత్వపు హక్కును విశదీకరించే 14వ అధికరణానికి వ్యతిరేకమనీ, ముస్లింలకు వ్యతిరేంగా తీసుకొచ్చినదనీ, ఓటుబ్యాంకు కోసమే ఈ బిల్లు తెచ్చారనీ కాంగ్రెస్, తృణమూల్, ఎస్పీ, ఎన్సీపీ, లెఫ్ట్ పార్టీలు ఆరోపించాయి. “బిల్లుకు 130 కోట్ల మంది భారతీయుల మద్దతు ఉంది. ఈ బిల్లును 2014లోనే మా మేనిఫెస్టోలో చేర్చాం. ప్రజలు మాకు అఖండ మెజారిటీ ఇచ్చారంటే బిల్లుకు ప్రజామోదం ఉన్నట్లే. ఈ బిల్లు 0.001 శాతం కూడా మైనారిటీ-వ్యతిరేకం కాదు. ఈశాన్య రాష్ట్రాల ప్రజల సంస్కృతీ సంప్రదాయాలకు కూడా భంగం వాటిల్లదు. మణిపూర్‌ను కూడా ఇన్నర్ లైన్ ఆఫ్ పర్మిట్ వ్యవస్థ (ఐఎల్‌పీ)లో చేరుస్తున్నాం. అంటే అక్కడ కూడా రక్షిత ప్రాంతాల్లో ప్రవేశించడానికి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి” అని అమిత్ షా చెప్పారు. బిల్లుపై విపక్షాల వ్యతిరేకతను తిప్పికొడుతూ ‘గతంలో 1971 యుద్ధం తరువాత బంగ్లాదేశ్ శరణార్థులకు ఇందిరాగాంధీ పౌరసత్వం కల్పించారు. ఆనాటి ఆమె చర్య రాజ్యాంగ విరుద్ధమా? 1985లో రాజీవ్‌గాంధీ అసోం ఒప్పందంపై సంతకం చేశారు. అది రాజ్యాంగ వ్యతిరేకమా? మేం హక్కుల్ని కలగజేస్తాం తప్ప లాగేసుకోం. ఈ హక్కులు కల్పించడం వల్లే గతంలో పాక్ నుంచి వచ్చి స్థిరపడ్డ డాక్టర్ మన్మోహన్‌సింగ్ దేశ ప్రధాని కాగలిగారు. లాల్ కృష్ణ ఆడ్వాణీ ఉప ప్రధాని కాగలిగారు. మాకు సంబంధించినంతవరకూ ఈ బిల్లులో ఎలాంటి రాజకీయ ఎజెండా లేదు. ఉగ్రవాదం నీడ ఈ దేశంపై పడరాదన్న ఉద్దేశంతో బిల్లు తెచ్చాం. చొరబాటుదారుల ఏరివేతే లక్ష్యం” అని అమిత్ షా వివరించారు.

**వ్యతిరేకం?**

కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ, సీపీఎం, సీపీఐ, ఎస్పీపీ, ఎన్సీ, ఆర్జేడీ, డీఎంకే, ఎంఐఎం, ఐయూఎంఎల్, శివసేన, టీఆర్ఎస్

**అనుకూలం**

బీజేపీ, జేడీయూ, వైసీపీ, అసోం గణపరిషత్, ఎన్‌పీపీ, అకాలీదళ్, అన్నాడీఎంకే

### బిల్లులో ఏముంది?

- బిల్లు ప్రకారం... పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చే ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పిస్తారు.
- వారి వద్ద సరైన ట్రావెల్ డాక్యుమెంట్లు లేకున్నా, ఉన్నవి కాలదోషం పట్టినా ఫరవాలేదు.
- గతంలో 11 ఏళ్ల పాటు భారత్‌లో నివసించి ఉండాలన్న నిబంధనను ఎత్తేసి ఐదేళ్లకు కుదించారు.
- 2014 డిసెంబరు 31న గానీ, ఆ తరువాత గానీ భారత్‌లో ప్రవేశించిన వారికి, ఉంటున్న వారికి వర్తిస్తుంది.
- పౌరసత్వం పొందినవారికి ఆధార్, రేషన్ కార్డులు ఇస్తారు.
- ఒకవేళ ఈ మూడు దేశాల నుంచి ఎవరైనా ముస్లిం వచ్చి దరఖాస్తు చేసుకున్నా దానిని కూడా సానుకూలంగా పరిశీలిస్తారు. అయితే సదరు వ్యక్తికి పౌరసత్వం ఇచ్చినా మిగిలిన సౌకర్యాలు అందవు.
- మణిపూర్‌ను కూడా ఐఎల్‌పీ వ్యవస్థలో చేరుస్తారు. అక్కడ కూడా బిల్లు వర్తించదు.

### కోర్టులో కాంగ్రెస్ సవాల్?

పౌరసత్వ సవరణ బిల్లును సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని కాంగ్రెస్‌లోని ఓ వర్గం కోరుతోంది. ఈ విషయాన్ని అసోం నుంచి ఎన్నికైన ఎంపీ గౌరవ్ గొగోయ్ మీడియాకు చెప్పారు. పార్లమెంటు గనక ఆమోదిస్తే పిటిషన్ వేసే విషయమై నిర్ణయం జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టులోని ఏ ధర్మాసనమూ ఈ బిల్లును సమర్థించబోదని శశిథరూర్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్సే మత ప్రాతిపదికన దేశాన్ని విడగొట్టిందన్న అమిత్‌షా విమర్శను తిప్పికొడుతూ- 1935లోనే మతపరంగా దేశ విభజనను వీరసావర్కర్ కోరుకున్నారని ఎంపీ మనీశ్ తివారీ పేర్కొన్నారు.

### టీఆర్ఎస్ వ్యతిరేకం...

వివాదాస్పదమైన పౌరసత్వ సవరణ బిల్లును టీఆర్ఎస్ వ్యతిరేకించింది. మతప్రాతిపదికన పౌరసత్వాన్ని కలగజేసే ఈ బిల్లును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర సమితి సభలో ప్రకటించింది. బిల్లును అసలు ప్రవేశపెట్టాలా వద్దా అనే అంశంపై జరిగిన చర్చలో పాల్గొన్న టీఆర్ఎస్ పక్ష నేత నామా నాగేశ్వరరావు బిల్లు వివక్షతో కూడినదని గట్టిగా వాదించారు.

### టీడీపీలో చీలిక

తెలుగుదేశం పార్టీకి చెందిన ముగ్గురు సభ్యుల్లో గల్లా జయదేవ్, రామ్మోహన్ నాయుడు బిల్లుకు మద్దతుగా ఓటు వేయగా మరో సభ్యుడు కేశినేని నాని ఓటుకు దూరంగా ఉన్నారు. ఈ బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కనుక తాను మద్దతునీయడం లేదని ఆయన చెప్పారు. అయితే బిల్లుపై టీడీపీ ఎలాంటి విప్ జారీచేయలేదు.

### వైసీపీ అనుకూలం

దీనిని ప్రవేశపెట్టడంపై ఓటింగ్ జరిగినపుడు వైసీపీ సభ్యులు కొంత అయోమయంలో పడ్డారు. బిల్లుకు మద్దతునీయాలని నర్సాపురం ఎంపీ రఘురామరాజు చెప్పినప్పటికీ వారు సంశయించారు. అయితే అప్పటికప్పుడు పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డిని సంప్రదించడంతో ఆయన బిల్లుకు మద్దతునీయవలసిందిగా వారిని ఆదేశించారు. బిల్లు ప్రవేశపెట్టినపుడు ఓటింగ్ లో పాల్గొనని వైసీపీ లోక్‌సభా పక్ష నేత మిథున్ రెడ్డి ఆ తర్వాత బిల్లుపై చర్చలో పాల్గొని దాన్ని సమర్థించారు. ‘బిల్లుపై కొన్ని వర్గాల్లో ఆందోళనలున్నాయి. వాటిని కేంద్రం నివృత్తి చేయాలి’ అని ఆయన కోరారు.

### ఇది మత విభజనే: శివసేన

ఎంపిక చేసిన కొంతమంది హిందువులకు పౌరసత్వం కల్పించడం వల్ల అంతిమంగా అది మతయుద్ధానికి దారితీస్తుందని శివసేన కేంద్రాన్ని హెచ్చరించింది. “బిల్లు ముసుగులో ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడడం దేశ ప్రయోజనాలకు మంచిది కాదు. ముస్లింలను మినహాయించి మిగిలిన వారికి పౌరసత్వం కల్పించడం సరికాదు. ఒకవేళ పొరుగుదేశాల్లో హిందువులపై అకృత్యాలు సాగితే పాక్‌పై చర్య తీసుకున్న మాదిరిగానే చర్య తీసుకోండి. బిల్లు తెస్తే అది మత యుద్ధానికి ట్రిగ్గర్ నొక్కినట్లే” అని సామ్నాలో రాసిన సంపాదకీయంలో శివసేన తీవ్రంగా అధిక్షేపించింది.

### బిల్లును అడ్డుకుంటాం: మమత

బిల్లును ఆరునూరైనా తమ రాష్ట్రంలో అడ్డుకుంటామని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తేల్చిచెప్పారు.

### బిల్లు ప్రతిని చించేసిన ఒవైసీ

మజ్లిస్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ బిల్లు ప్రతిని సభలో చించివేశారు. “దక్షిణాఫ్రికా ఇలాంటి వివక్షాపూరిత బిల్లునే నాడు బ్రిటిష్ ప్రభుత్వం తెచ్చింది. ఇది ప్రజలను విడదీస్తుందని అంటూ గాంధీజీ ఆనాడు దానిని నిలువునా చింపి పారేశారు. ఈ బిల్లు దేశంలోని ముస్లింలకు నిలువనీడ లేకుండా చేస్తుంది. ఇందుకు నిరసనగా నేను కూడా ఈ బిల్లును చింపిపారేస్తున్నా” అని ఆ బిల్లును చించేశారు.

## రూ.3.41 లక్షల కోట్లు

**▸▸ నానాటికీ పెరుగుతున్న ఏపీ అప్పులు.. సభలో కేంద్రం**

న్యూఢిల్లీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ చేస్తున్న అప్పులు పెరిగిపోతున్నాయని కేంద్రం ప్రకటించింది. 2019 సెప్టెంబరులో రిజర్వు బ్యాంకు(ఆర్‌బీఐ) ప్రచురించిన నివేదికను ఉదహరించింది. 2016-17లో ఏపీ అప్పులు రూ.2,54,283 కోట్లు కాగా.. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3,41,270 కోట్లకు చేరిందని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. లోక్‌సభలో వైసీపీ సభ్యురాలు వంగ గీత అడిగిన ప్రశ్నకు సోమవారం ఈ మేరకు మంత్రి సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధులను ఆంధ్రప్రదేశ్‌కు 90:10 నిష్పత్తిలో విడుదల చేస్తే 2015 నుంచి 2020 వరకూ ఎంత మొత్తం వస్తుందో అంత మేరకు ఆకాలంలో సంతకాలు చేసిన విదేశీ సహాయ ప్రాజెక్టుల(ఈఏపీ) రుణాలు, వడ్డీలను భరించడం ద్వారా ప్రత్యేక సహాయం అందించాలని కేంద్రం నిర్ణయించిందని అనురాగ్ ఠాకూర్ చెప్పారు. ఈ మేరకు 2018-19కి రూ.15.81 కోట్లు చెల్లించామన్నారు. వివిధ విదేశీ సంస్థల నుంచి ఏపీ తీసుకున్న రుణం 2019-20 నాటికి రూ.1532.38 కోట్లు ఉంటుందని కేంద్రం వెల్లడించింది.

## ‘సమీక్ష’లో మీ సార్లు యేరి?

**▸▸ పోలవరంపై కీలక భేటీకీ డుమ్మానా?.. పర్యవేక్షణ కమిటీ ప్రశ్న**

న్యూఢిల్లీ, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పునరావాస, పరిహార చెల్లింపుల ప్రక్రియ పురోగతిపై నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి రాష్ట్రానికి చెందిన నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు గైర్హాజరు కావడంపట్ల జాతీయ పర్యవేక్షణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కమిటీ చైర్మన్, కేంద్ర భూవనరులశాఖ కార్యదర్శి రౌల్‌కుమ్‌లైన్ బుహ్రిల్ నిర్వహించిన ఈ భేటీలో రాష్ట్రానికి చెందిన దిగువస్థాయి అధికారులే పాల్గొనడం, కార్యదర్శి స్థాయి వారు గైర్హాజరు కావడంపట్ల కమిటీ సభ్యులు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. పోలవరం ప్రాజెక్టువల్ల నష్టపోతున్న ప్రజలకు అందించే పునరావాస, పరిహార సమస్యలపై సామాజికవేత్త పెంటపాటి పుల్లారావు గతంలో మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషన్ ఇచ్చిన ఆదేశాలకు లోబడి, జాతీయ పర్యవేక్షణ కమిటీ అధ్వర్యంలో ఢిల్లీలో సోమవారం సమావేశం జరిగింది. ఈ భేటీలో రాష్ట్రం నుంచి కొందరు దిగువస్థాయి అధికారులు మాత్రమే హాజరయ్యారు. పైగా వచ్చిన ఆ అధికారులు కూడా ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర సమాచారంతో రాకపోవడంపై కమిటీ మండిపడింది.

# కర్ణాటకలో కమలమే

**▸▸ ఉపపోరులో ఘనవిజయం**

**▸▸ 15 స్థానాల్లో 12 చోట్ల జయకేతనం**

**▸▸ కాంగ్రెస్‌కు 2.. జేడీఎస్‌కు సున్నా**

**▸▸ యడ్డి సర్కారుకు ఇక తిరుగులేదు**

**▸▸ 117కి చేరిన కమలనాథుల బలం**

**▸▸ కాంగ్రెస్ నేతలు సిద్ధూ, దినేశ్ రాజీనామా**



కర్ణాటకలో బీజేపీ విజయంపై కార్యకర్తల ఆనందోత్సాహాలు

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో యడియూరప్ప ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ లభించింది. 15 స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో 12 చోట్ల బీజేపీ అభ్యర్థులు విజయఢంకా మోగించారు. ప్రభుత్వం కొనసాగేందుకు 113 మంది సభ్యుల మద్దతు అవసరం కాగా.. ఉపఎన్నికల్లో గెలుపుతో ఆ పార్టీ బలం 117కి చేరింది. మరో మూడున్నరేళ్లు కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వానికి ఢోకా లేకుండా పోయింది.. 14 మంది కాంగ్రెస్, ముగ్గురు జేడీఎస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేయడంతో కుమారస్వామి నేతృత్వంలోని కాంగ్రెస్-జేడీఎస్ ప్రభుత్వం కుప్పకూలగా బీజేపీ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వం నిలబడేందుకు ఆరు స్థానాలు అవసరం కాగా.. బీజేపీ 12 చోట్ల నెగ్గింది. 15 చోట్ల పోటీ చేసిన కాంగ్రెస్ రెండు చోట్ల మాత్రమే గెలుపొందగా.. 12 స్థానాల్లో బరిలోకి దిగిన జేడీఎస్ ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది. హొస్కోటెలో బీజేపీ రెబెల్ శరత్‌కుమార్ బచ్చేగౌడ విజయం సాధించడం గమనార్హం. అనర్హత వేటు పడిన 12 మంది మరోసారి ప్రజాతీర్పుతో అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అనర్హత ఎదుర్కొన్న ఇద్దరు సీనియర్లు విశ్వనాథ్ (హుణసూరు), ఎంటీబీ నాగరాజ్ (హొస్కోటె) పరాజయం పాలయ్యారు. యడియూరప్ప వారికి ఫోన్ చేసి తానున్నానని భరోసా ఇచ్చారు. మరోవైపు.. సీఎం తన కేబినెట్‌ను రెండ్రోజుల్లో విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముందే హామీ ఇచ్చిన మేరకు గెలిచిన 12 మందినీ యడ్డి తన మంత్రివర్గంలో చేర్చుకుంటారని అంటున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మురళీధర్ రావు తదితరులు యడియూరప్పకు, పార్టీ అధ్యక్షుడు నళిన్ కుమార్ కటీల్‌కు ఫోన్ చేసి అభినందించినట్లు తెలిసింది. మొత్తమ్మీద మహారాష్ట్రలో ఎదురైన చేదు అనుభవంతో భంగపడిన బీజేపీకి కర్ణాటక ఫలితాలు కొత్త ఊపిరి పోసినట్లయింది. మరోవైపు కాంగ్రెస్ ఘోర పరాజయానికి నైతిక బాధ్యత వహిస్తూ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పదవికి మాజీ సీఎం సిద్ధరామయ్య, పీసీసీ అధ్యక్ష పదవికి దినేశ్ గుండూరావు రాజీనామా చేశారు. ప్రజాతీర్పును గౌరవిస్తామని పార్టీ సీనియర్ నేత డి.కె.శివకుమార్ ప్రకటించారు. మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్ ఫలితాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జేడీఎస్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. దేవేగౌడ ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. కుమారస్వామి ఎవరికీ అందుబాటులోకి రాలేదు.



## ఉరితాళ్లు పేనండి

### 14 నాటికి పది తాళ్లు కావాలని ఆదేశాలు

**నిర్భయపై అత్యాచారం చేసిన 16నే ఉరి?**

పట్నా, డిసెంబరు 9: ఉరితాళ్లు పేనడంలో పేరొందిన బక్సర్ (బిహార్) జైలుకు.. తాజాగా ఉరితాళ్ల ఆర్డరు వచ్చింది. ఈనెల 14 నాటికి పది తాళ్లు సిద్ధం చేయాలని ఆ ఆర్డర్ సారాంశం. ‘దిశ’ హత్యాచార నిందితుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో నిర్భయ హంతకులనూ శిక్షించాలంటూ ప్రజాగ్రహం వెల్లువెత్తుతున్న నేపథ్యంలో.. ఈ ఉరితాళ్లు వారికోసమేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2012లో వారు కదిలే బస్సులో నిర్భయపై అత్యాచారం చేసిన డిసెంబరు 16నే వారిని ఉరి తీయనున్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాగా, ఉరితాళ్లు సిద్ధం చేయాలంటూ తమకు ఆదేశాలు వచ్చినట్టు బక్సర్ జైలు సూపరింటిండెంట్ విజయ్ కుమార్ అరోరా ధ్రువీకరించారు. ఐదారుగురు వ్యక్తులు కలిసి, ఒక్కో తాడునూ చేత్తో పేనడానికి మూడు రోజులు పడుతుందని.. కొంతమేరకు యంత్రాలను వినియోగిస్తామని ఆయన వివరించారు. తాము తయారుచేసే ఉరితాళ్ల ధరలు సమయాన్ని బట్టి ఉంటాయని.. చివరిసారి అమ్మిన ఉరితాటి ధర రూ.1725 అని ఆయన వెల్లడించారు. తాము తయారుచేసే ఉరితాళ్లను వీలైనంత త్వరగా ఉపయోగించాలని.. లేకపోతే అవి పనికిరాకుండా పోతాయని చెప్పారు.

## నేడు భూమికి సమీపంగా 4 గ్రహశకలాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 9: నాలుగు గ్రహశకలాలు మంగళవారం భూమికి సమీపం నుంచి దూసుకువెళ్లనున్నాయని ‘నాసా’ తెలిపింది. వాటిలో మూడు విమానాలంత పెద్దవి. వీటి పరిమాణం 30 నుంచి 65 మీటర్ల మధ్య ఉంటుంది. ఒకటి మాత్రం చిన్న గ్రహశకలం. పరిమాణం 8.7 మీటర్లు. దాదాపు బస్సంత ఉంటుంది. ఇదే ముందుగా తారసపడనుంది. ఇది భూమి నుంచి కేవలం పది లక్షల కిలోమీటర్ల దూరం నుంచి సెకనుకు 13 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లనుంది. “గ్రహశకలాల విషయంలో ఈ దూరం చాలా తక్కువ. ఇప్పటి దాకా భూమికి అతి దగ్గరగా వెళుతున్న గ్రహశకలం ఇదే” అని ‘నాసా’ పేర్కొంది. దీనిని డిసెంబరు 3న తొలిసారిగా గుర్తించినట్లు తెలిపింది. దీనికి ‘2019 ఎక్స్‌వై’ అని పేరు పెట్టారు.



మీడియాతో మాట్లాడుతున్న రష్యా డోపింగ్ నిరోధక సంస్థ డైరెక్టర్ యూరీ గానస్

# రష్యాకు షాక్

## డోపింగ్ కారణంగా నాలుగేళ్ల నిషేధం

- అంతర్జాతీయ ఈవెంట్లకు నో చాన్స్
- టోక్యో ఒలింపిక్స్‌కూ దూరం
- 'వాడా' సంచలన నిర్ణయం

**రష్యా.. ఒకప్పుడు ఆటలతోపాటు ఇతర అన్ని రంగాల్లో అమెరికాతోపాటు సూపర్ పవర్. కానీ యూఎస్ఎస్ఆర్ విడిపోయి విభిన్న దేశాలుగా ఏర్పడ్డాక రష్యా 'పవర్' తగ్గిపోయింది. అయినా ఒలింపిక్స్, ఇతర ప్రపంచ స్థాయి క్రీడల్లో ఆ దేశం తనదైన ముద్ర వేస్తూనే ఉంది. కానీ, కొంతకాలంగా రష్యా డోపింగ్ ఊబిలో కూరుకుపోయింది. సాక్షాత్తు ఆ దేశ ప్రభుత్వమే డోపింగ్‌ను ప్రోత్సహించినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటిపై అంతర్జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) విచారణ జరిపి రష్యా తప్పిదానికి పాల్పడినట్టు తేల్చింది. దాంతో ఆ దేశంపై నాలుగేళ్ల నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించింది. ఫలితంగా వచ్చే ఏడాది జరిగే టోక్యో ఒలింపిక్స్‌తోపాటు, వింటర్ ఒలింపిక్స్‌కు రష్యా దూరం కానుంది.**





**లాసన్నె (స్విట్జర్లాండ్):** రష్యన్ డోపింగ్ నిరోధక సంస్థ (రుసాడ).. డోపింగ్ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించిందని అంతర్జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) తేల్చింది. సోమవారం ఇక్కడ సమావేశమైన వాడా ఎగ్జిక్యూటివ్ కమిటీ.. రష్యాలో విచ్చలవిడిగా డోపింగ్‌ను ప్రోత్సహించారని పేర్కొంది. అంతేకాదు తనపై వచ్చిన డోపింగ్ ఆరోపణల విచారణకు రుసాడ సహకరించలేదని వెల్లడించింది. దీంతో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనకుండా రష్యాపై నాలుగేళ్ల నిషేధం విధిస్తూ వాడా ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఫలితంగా వచ్చే ఏడాది జరిగే టోక్యో ఒలింపిక్స్, 2022లో జరగనున్న బీజింగ్ వింటర్ ఒలింపిక్స్ (2022)తో పాటు ఖతార్ ఆతిథ్యమివ్వనున్న సాకర్ వరల్డ్ కప్(2022)నకు రష్యా దూరం కానుంది. 2023 వరకు జరిగే ఇతర పెద్ద టోర్నీల్లోనూ పాల్గొనకుండా రష్యాపై ఈ నిషేధం వర్తిస్తుంది. అయితే వచ్చే ఏడు జరిగే యూరోపియన్ సాకర్ చాంపియన్‌షిప్‌లో రష్యా పాల్గొనవచ్చు. కారణం..ఆ టోర్నీ ఆతిథ్య దేశాలలో రష్యా ఒకటి కావడం. ఇకపోతే.. ఒలింపిక్స్‌లో తటస్థ అథ్లెట్లుగా రష్యా ఆటగాళ్లు పాల్గొనవచ్చు. కాకపోతే..తాము డ్రగ్స్ వాడలేదని వారు నిరూపించుకోవాల్సి ఉంటుంది. గత అక్టోబరులో జరిగిన వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 30 మంది రష్యా అథ్లెట్లు అలాగే పోటీపడ్డారు. కాగా..నిషేధంపై 21 రోజులలో అంతర్జాతీయ క్రీడా వివాదాల న్యాయస్థానంలో రష్యా అప్పీలు చేసుకోవచ్చు. 'స్వచ్ఛమైన క్రీడలకు రష్యా ఎప్పుడో తిలోదకాలిచ్చింది' అని రష్యాపై నిషేధాన్ని ప్రకటించిన సందర్భంగా వాడా అధ్యక్షుడు సర్ క్రెయిగ్ రిడ్లే దుయ్యబట్టారు.

### ఏమిటీ వివాదం?

**వా**డా నిబంధనలకు రష్యా తిలోదకాలిచ్చిందన్న ఆరోపణలు సంవత్సరాలుగా ఉన్నాయి. 2010-14 మధ్య ఆ దేశ డోపింగ్ నిరోధక సంస్థ (రుసాడ) స్వయంగా తమ అథ్లెట్లను డోపింగ్‌కు ప్రోత్సహించింది. వాడాకు తప్పుడు నివేదికలు అందించింది. ఈ విషయాన్ని మాస్కోలోని రష్యా నేషనల్ డోపింగ్ లేబరేటరీ చీఫ్ గ్రిగరీ రొడ్‌చెన్కోవ్ వెల్లడించడం సంచలనమైంది. దాంతో 2015లోనే రష్యాను అంతర్జాతీయ పోటీలనుంచి బహిష్కరించారు. మరోవైపు రష్యాపై వచ్చిన ఆరోపణలపై రిచర్డ్ మెక్‌లారెన్ ఆధ్వర్యంలో విచారణ కమిటీని వాడా నియమించింది. రష్యా పెద్ద ఎత్తున డోపింగ్‌కు పాల్పడుతున్నట్టు 2016లో మెక్‌లారెన్ తన నివేదికలో స్పష్టంజేశారు. దాంతో పలువురు రష్యా అథ్లెట్లు 2014 సోచి వింటర్ ఒలింపిక్స్ సహా ఇతర ప్రధాన టోర్నీల్లో లబ్ధి పొందినట్టు ఆ నివేదికలో పేర్కొన్నారు. కాగా.. తమ అథెట్ల డోప్ టెస్ట్‌లకు సంబంధించి నిజమైన నివేదికలను వాడాకు అందజేస్తామని హామీ ఇవ్వడంతో 2018లో రష్యాపై పాక్షికంగా నిషేధం సడలించారు. కానీ 2019 జనవరిలో రష్యా అందజేసిన రుసాడ లేబొరేటరీ నివేదికలు తప్పులతడకలుగా ఉండడంతో.. సోమవారం ఆ దేశంపై వాడా వేటు వేసింది.

### విశ్వక్రీడలపై ప్రభావం?

**ని**షేధం నేపథ్యంలో ఎందరు రష్యా అథ్లెట్లు టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొంటారో చెప్పలేని పరిస్థితి. అయితే ఒలింపిక్స్ పతకాల వేటలో రష్యా కూడా ప్రధాన పోటీదారే. డోపింగ్ కారణాలతో 2016 రియో ఒలింపిక్స్ నుంచి రష్యా ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లను బహిష్కరించారు. అయినా రియో ఒలింపిక్స్‌కు 282 అథ్లెట్ల బృందాన్ని రష్యా పంపింది. ఆ దేశ ఆటగాళ్లు మొత్తం 56 పతకాలు సాధించారు. దాంతో పతకాల పట్టికలో ఆ దేశం నాలుగో స్థానంలో నిలిచింది. ఇక 2012 లండన్ ఒలింపిక్స్‌లో 436 మంది అథ్లెట్లతో రష్యా బరిలోకి దిగి 68 పతకాలు గెలుచుకుంది. కాగా.. ట్రాక్ అండ్ ఫీల్డ్, బాక్సింగ్, ఫెన్సింగ్, జూడో, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్ క్రీడాంశాల్లో రష్యా ఆధిపత్యం ప్రదర్శిస్తుంది.

### అప్పీల్ వృథాయేనా!

**వా**డా నిషేధంపై అప్పీల్ చేసినా ఉపయోగం లేదని రుసాడ డైరెక్టర్ జనరల్ యూరి గానస్ తేల్చి చెప్పారు. అప్పీల్ చేసే విషయమై చర్చించేందుకు ఈనెల 19న రుసాడ సూపర్‌వైజరీ బోర్డు సమావేశం కానుంది. ఈ నేపథ్యంలో.. 'న్యాయస్థానంలో అప్పీల్ చేసినా మేం గెలిచే అవకాశం లేదు' అని గానస్ స్పష్టంజేశారు.

## దివ్యాంగ అథ్లెట్ల కోసం రూ. 171 కోట్లతో..

**న్యూఢిల్లీ:** జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనే దివ్యాంగ అథ్లెట్ల కోసం ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్ అందుబాటులోకి రానుంది. గ్వాలియర్‌లో ఏర్పాటు చేయనున్న ఈ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ. 171 కోట్లు ఖర్చు అవుతుంది. గత ఫిబ్రవరిలోనే కేంద్ర కేబినెట్ దీనికి అనుమతి మంజూరు చేసింది. 2021 మార్చికల్లా ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి కానుంది.

## రాణించిన విహారి

**ఆంధ్రా 211 ఆలౌట్**

**విజయవాడ (భవానీపురం):** హనుమ విహారి (155 బంతుల్లో 83) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆదుకోవడంతో విదర్భతో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 211 పరుగులకు ఆలౌటైంది. విదర్భ లెఫ్టార్మ్ స్పిన్నర్ ఆదిత్య సర్వాటే (4/50), పేసర్ రజనీష్ గుర్బానీ (3/72) ధాటికి ఆంధ్రా టాపార్డర్ కుప్పకూలింది. భరత్ (22), గిరినాథ్ రెడ్డి (22), బండారు అయ్యప్ప (22), నరేన్ రెడ్డి (21) పోరాడారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ తొలిరోజు ఆట ముగిసేసరికి వికెట్ నష్టపోకుండా 26 రన్స్ చేసింది. క్రీజులో ఫయాజ్ ఫజల్ (11), రఘునాథ్ (14) ఉన్నారు. ఇక, విదర్భ వెటరన్ ఓపెనర్ వసీం జాఫర్ కెరీర్‌లో ఇది 150వ రంజీ మ్యాచ్. దీంతో ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో అత్యధిక మ్యాచ్‌లాడిన ఆటగాడిగా జాఫర్ రికార్డు సృష్టించాడు.

**పాము కలకలం..:** మ్యాచ్ జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా మైదానంలోకి పాము రావడంతో ఫీల్డింగ్ చేస్తున్న విదర్భ క్రికెటర్లు ఒక్కసారిగా పరుగు తీశారు. దీంతో మ్యాచ్‌కు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. గ్రౌండ్ సిబ్బంది వెంటనే స్పందించి పామును మైదానం నుంచి బయటికి పంపించారు.

స్వర్ణం గెలిచిన ఆనందంలో భారత ఫుట్‌బాల్ అమ్మాయిల జట్టు



## సాకర్‌లో అమ్మాయిల 'హ్యాట్రిక్'

**దక్షిణాసియా క్రీడలు**

**ఖాట్మండు:** దక్షిణాసియా క్రీడల ఫుట్‌బాల్‌లో భారత మహిళల జట్టు హ్యాట్రిక్ స్వర్ణం సొంతం చేసుకుంది. ఫైనల్లో డబుల్ డిఫెండింగ్ చాంపియన్ భారత్ 2-0తో నేపాల్‌ను ఓడించింది. బాలాదేవి (18వ, 56వ నిమిషం) డబుల్ గోల్స్‌తో అదరగొట్టింది. గతంలో రెండుసార్లు చాంపియన్‌గా నిలిచిన భారత అమ్మాయిలకు ఇది వరుసగా మూడో స్వర్ణం. దీంతో సోమవారం భారత్ 27 స్వర్ణాలతో మరో 42 పతకాలను తన ఖాతాలో వేసుకుంది. 300 మెడల్స్ మార్క్‌కు చేరువైంది. 8వ రోజు పోటీలు ముగిసే సమయానికి భారత్ 294 (159 స్వర్ణ, 91 రజత, 44 కాంస్య) పతకాలతో అగ్రస్థానంలో దూసుకెళ్తోంది. రెజ్లర్లు మరో రెండు స్వర్ణాలు అందించారు.

**పంచ్ అదిరింది..:** భారత బాక్సర్లు ఒక్క రోజే ఆరు స్వర్ణాలు సాధించారు. జాతీయ చాంపియన్ అకింత్ ఖటానా (75 కిలోలు), కలైవాని శ్రీనివాసన్ (48 కి), వినోద్ తోమర్ (49 కి), సచిన్ (56 కి), గౌరవ్ చౌహాన్ (91 కి), మహిళల్లో పర్వీన్ (60 కి) పడిసి పంచ్‌లు విసిరారు. కాగా, వరల్డ్ చాంపియన్‌షిప్స్ కాంస్య పతక విజేత మనీష్ కౌశిక్ (64 కి) ఫైనల్లో పరాజయం పాలయ్యాడు.

## జంషెడ్‌పూర్-చెన్నై మ్యాచ్ డ్రా

**జంషెడ్‌పూర్:** ఐజాక్ వాన్‌మల్సావామ లేటు గోల్‌తో ఆతిథ్య జంషెడ్‌పూర్ డ్రాతో గట్టెక్కింది. ఐఎస్ఎల్‌లో సోమవారం జంషెడ్‌పూర్, చెన్నయిన్ ఎఫ్‌సీ మధ్య జరిగిన మ్యాచ్ 1-1తో సమంగా ముగిసింది. 26వ నిమిషంలో నెరుజూస్ వాల్స్‌కిస్ గోల్ చేసి చెన్నైని 1-0 ఆధిక్యంలో నిలిపాడు. అయితే, 89వ నిమిషంలో ఐజాక్ లేటు గోల్‌తో జంషెడ్‌పూర్ స్కోరు సమం చేసింది.

## టైగర్ సఫారీకి అండర్-19 క్రికెటర్లు

**న్యూఢిల్లీ:** అండర్-19 ప్రపంచకప్‌లో ఆడే భారత యువ క్రికెటర్లు టైగర్ సఫారీ పార్క్‌లో ఆహ్లాదంగా గడిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి జట్టుకు ఎంపికైన యువ ఆటగాళ్ల మధ్య స్నేహభావం నెలకొల్పేందుకు అప్పటి కోచ్ రాహుల్ ద్రావిడ్ పలు కార్యక్రమాలు నిర్వహించేవాడు. టీమ్ బాండింగ్ ప్రోగ్రాంతో పాటు టైగర్ సఫారీలకు వీరిని తీసుకెళ్లేవారు. ఇప్పుడు కూడా అండర్-19 ఆటగాళ్లు రెండు రోజులు నాగర్‌హోల్ జాతీయ పార్కులో గడుపుతారు. దీంట్లో భాగంగానే సోమవారం కబీని ఫారెస్ట్ సఫారీకి కూడా వెళ్లారు. జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) డైరెక్టర్ రాహుల్ ద్రావిడ్ పర్యవేక్షణలోనే ఇదంతా జరుగుతోందని బీసీసీఐ జీఎం సబా కరీమ్ తెలిపాడు.



హేడెన్ వాల్ష్

## వాల్ష్ నా తండ్రి కాదు..

**తిరువనంతపురం:** 'మరోసారి చెబుతున్నా. నా తండ్రి దిగ్గజ పేసర్ కోట్నీ వాల్ష్‌కాదు' అని వెస్టిండీస్ లెగ్‌స్పిన్నర్ హేడెన్ వాల్ష్ పేర్కొన్నాడు. ఇద్దరి పేర్లలో వాల్ష్ ఉండడంతో.. చాలామంది హేడెన్.. కోట్నీ వాల్ష్ కుమారుడిగా పొరపడుతున్నారు. దాంతో మరోసారి హేడెన్ వివరణ ఇచ్చాడు. ఆదివారం భారత్‌తో జరిగిన రెండో టీ20లో అతడు చక్కటి బౌలింగ్‌తో 2 వికెట్లు తీశాడు. 'నేను కెనడా టీ20 లీగ్‌లో ఆడుతున్నా. కొందరు నన్ను కోట్నీ వాల్ష్ కుమారుడిగా భావిస్తున్నారు. కానీ ఆయన నా తండ్రి కాదు. కానీ ఇకపై నేనెవరో అంతా గుర్తిస్తారని అనుకుంటున్నా' అని 27 ఏళ్ల హేడెన్ అన్నాడు.



## సైనికులపై ధోనీ టీవీ సిరీస్!

**న్యూఢిల్లీ:** ప్రపంచకప్ ముగిశాక క్రికెట్‌కు దూరంగా ఉంటున్న ధోనీ భారత సైనికాధికారులపై ఓ టీవీ సిరీస్‌ను తీసే ప్రయత్నాల్లో ఉన్నాడట. టెరిటోరియల్ ఆర్మీ పారాచూట్ రెజిమెంట్‌లో గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో ఉన్న మహీ ఆమధ్య రెండు వారాలు సైన్యంలో పనిచేశాడు. 'అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించి పరమవీర చక్ర, అశోక చక్ర అవార్డులు సాధించిన ఆర్మీ అధికారులపై కథనాలను ఈ షో వివరిస్తుంది. వాళ్ల స్ఫూర్తిదాయక జీవితాలను దేశ ప్రజలకు తెలియజెప్పాలనేది ధోనీ ఆలోచన. వచ్చే ఏడాది ఈ సిరీస్ ప్రసారమవుతుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి' అని ధోనీ సన్నిహితులు తెలిపారు. స్టూడియో నెక్స్, ధోనీ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ సంయుక్తంగా నిర్మించే ఈ సిరీస్ సోనీ టీవీలో ప్రసారం కానుంది.



## నాడా అంబాసిడర్‌గా సునీల్ శెట్టి

**న్యూఢిల్లీ:** బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టి జాతీయ డోపింగ్ నిరోధక వ్యవస్థ (నాడా)బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నాడు. దేశంలోని క్రీడలను స్వచ్ఛంగా ఉంచేందుకు సునీల్ శెట్టి ఇమేజ్ ఉపయోగపడుతుందని నాడా భావిస్తోంది. ఈ ఏడాది 150 మందికి పైగా అథ్లెట్లు డోపింగ్‌లో దొరికిపోవడం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. 'అథ్లెట్, మాజీ అథ్లెట్‌కన్నా ఓ సినిమా స్టార్ దేశవ్యాప్తంగా మరింత ఎక్కువ ప్రభావం చూపగలడు. అందుకే క్రీడల్లో డోపింగ్‌ను దూరం చేసే చర్యల్లో భాగంగా సునీల్‌ను అంబాసిడర్‌గా ఎంపిక చేశాం. అదీకాకుండా తాజా అథ్లెట్లు వివిధ టోర్నీల్లో బిజీగా ఉండడంతో ప్రచారానికి తగిన సమయం కేటాయించలేరు' అని నాడా తెలిపింది.

## యూత్ ఒలింపిక్స్ నిర్వహణకు సహకరించండి

**హోం మంత్రి అమిత్ షాను కోరిన బాత్రా**

**న్యూఢిల్లీ:** యూత్ ఒలింపిక్స్ (2026) నిర్వహణకు సహకారం అందించాలని హోం మంత్రి అమిత్ షాను భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) అధ్యక్షుడు నరీందర్ బాత్రా కోరారు. సోమవారం షాను బాత్రా కలుసుకున్నారు. వచ్చే ఏడాది యూత్ ఒలింపిక్స్-2026 బిడ్డింగ్ మొదలవనుంది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ బిడ్‌లను పరిశీలించి ఖరారు చేయనుంది. బిడ్డింగ్‌కు ముందే ఆతిథ్యం కోసం ఢిల్లీ, ముంబై, భువనేశ్వర్ నగరాల్లో ఒక దాన్ని ఎంపిక చేస్తామని బాత్రా చెప్పారు.




Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.